www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 5-2-2026 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 330 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, బహుళపక్షం, తిథి: చవితి రా.12.22 తదుపరి పంచమి, నక్షత్రం: ఉత్తర రా.10.57 తదుపరి హస్త, వర్జ్యం: శేషం ఉ. 7.17, దుర్ముహూర్తం: ఉ.10.36-11.21, మ.3.07-3.52, అమృతఘడియలు: మ.3.31-5.10, రాహుకాలం: మ.1.30-3.00, సూర్యోదయం: 6.49, సూర్యాస్తమయం: 6.08 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఒకటా.. రెండా?

తొలి ట్రోఫీ అందుకోవాలని ఢిల్లీ..

రెండో టైటిల్ వేటలో బెంగళూరు



డబ్ల్యూపీఎల్ ఫైనల్ నేడే

రా. 7.30 నుంచి

వడోదర: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో ఆసక్తికర ఫైనల్‌కు రంగం సిద్ధమైంది. అద్భుతంగా ఆడుతూ టైటిల్ ఫైట్‌కు దూసుకొచ్చిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)..వరుసగా నాలుగోసారి అంతిమ సమరానికి చేరిన ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ) ట్రోఫీ కోసం గురువారం అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఈసారి టైటిల్ అందుకోవడం ద్వారా ఇప్పటి వరకు జరిగిన మూడు ఎడిషన్లలో రెండుసార్లు చాంపియన్‌గా నిలిచిన ముంబై ఇండియన్స్ రికార్డును సమం చేయాలని ఆర్‌సీబీ ఆరాటపడుతోంది. మరోవైపు గతంలో మూడుసార్లు ఫైనల్ చేరినా..ఒక్కసారీ ట్రోఫీని ముద్దాడలేకపోయిన ఢిల్లీ క్యాపిటల్స్ ఈ దఫా ఆ పరిస్థితి పునరావృతం చేయకూడదని పట్టుదలగా ఉంది. ఈసారి లీగ్‌లో ఆర్‌సీబీ ఆట అలా ఇలా లేదు. ఐదు వరుస విజయాలతో రికార్డు నెలకొల్పింది. హ్యారిస్, గౌతమీ నాయక్, జార్జియా వోల్, రిచాలతో బెంగళూరు బ్యాటింగ్ బలీయంగా ఉంది. కీలక సమయాల్లో వికెట్లు తీస్తూ పేసర్లు డి క్లెర్క్, నదైన్ జట్టుకు అండగా నిలుస్తున్నారు. స్పిన్నర్ శ్రేయాంక పాటిల్ బెంగళూరు బౌలింగ్ తురుపు ముక్క. మొత్తంగా ఆల్‌రౌండ్ షోతో అదరగొడుతున్న ఆర్‌సీబీ అదే జోరులో టైటిల్ పట్టేయాలని అనుకుంటోంది. ఇక కొత్త కెప్టెన్ జెమీమా ఆధ్వర్యంలో తొలిసారి ట్రోఫీ చేజిక్కించుకోవాలని ఢిల్లీ పట్టుదలగా ఉంది. ఢిల్లీ బలం ఆ జట్టు పేస్ బౌలింగే. పేసర్లు చినెల్లే హెన్రీ, నందిని ఫైనల్లోనూ సత్తా చాటితే ఢిల్లీకి తిరుగుండదు. గుజరాత్‌తో ఎలిమినేటర్లో రాణించిన లిజెల్లీ లీ నుంచి అదే ప్రదర్శనను జట్టు ఆశిస్తోంది. షఫాలీ, లారా వోల్వార్ట్, జెమీమా సహజ శైలిలో చెలరేగితే ఢిల్లీ కల నెరవేరడం కష్టం కాబోదు.

కుర్రాళ్లు కుమ్మేశారు

రికార్డు ఛేదనతో ఫైనల్‌కు యువ భారత్

ఆరోన్ శతకం

రాణించిన వైభవ్, ఆయుష్

సెమీస్‌లో అఫ్ఘానిస్థాన్ చిత్తు

అండర్-19 వరల్డ్‌కప్



ఆరోన్ జార్జ్ (115)



వైభవ్ (68)

హరారే: కీలక మ్యాచ్‌లో ఫామ్‌ను అందుకున్న ఓపెనర్ ఆరోన్ జార్జ్ (104 బంతుల్లో 15 ఫోర్లు, 2 సిక్స్‌లతో 115) క్లాసిక్ శతకంతో పాటు వైభవ్ సూర్యవంశీ (68), కెప్టెన్ ఆయుష్ మాత్రే (62) చెలరేగడంతో.. అండర్-19 వరల్డ్‌కప్‌లో యువ భారత్ రికార్డు లక్ష్యాన్ని ఛేదించింది. బుధవారం జరిగిన సెమీఫైనల్లో 7 వికెట్ల తేడాతో అఫ్ఘానిస్థాన్‌ను మట్టికరిపించిన భారత్.. 10వ సారి టోర్నీ ఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగే టైటిల్ ఫైట్‌లో ఇంగ్లండ్‌తో భారత్ తలపడనుంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన అఫ్ఘాన్ 50 ఓవర్లలో 4 వికెట్లకు 310 పరుగులు చేసింది. కనిష్క, దీపేష్ చెరో 2 వికెట్లు తీశారు. ఫైజల్ షినోజాదా (110), ఉజైరుల్ నియాజాయ్ (101 నాటౌట్) సెంచరీలతో కదం తొక్కారు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 148 రన్స్ జోడించడంతో అఫ్ఘాన్ స్కోరు 300 దాటింది. ఓపెనర్ ఉస్మాన్ (39), ఖలీల్ (31) రాణించారు. భారీ ఛేదనలో భారత్ 41.1 ఓవర్లలో 311/3 స్కోరు చేసి గెలిచింది.

సులువుగా కొట్టేశారు: ఛేదనలో భారత్ తరఫున ఆరోన్, వైభవ్ అదిరే ఆరంభాన్నిచ్చారు. అయితే, 22 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద వైభవ్ ఇచ్చిన క్యాచ్‌ను నియాజాయ్ చేజార్చాడు. 20 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఆరోన్‌కు జీవనదానం లభించింది. చెలరేగుతున్న వైభవ్‌ను ఒమర్జాయ్ అవుట్ చేయడంతో భారత్ 91/1తో మెరుగైన స్థితిలో నిలిచింది. మధ్య ఓవర్లలో ఆరోన్, కెప్టెన్ ఆయుష్ రెండో వికెట్‌కు 114 రన్స్ జోడించడంతో జట్టు స్కోరు 200 మార్క్ దాటింది. హాఫ్ సెంచరీ చేసిన ఆయుష్‌ను కూడా ఒమర్జాయ్ పెవిలియన్ చేర్చినా.. విహాన్ (38 నాటౌట్)తో కలసి ఆరోన్ జట్టును గెలుపు ముంగిట నిలబెట్టాడు. అయితే, సెంచరీ పూర్తి చేసుకున్న ఆరోన్.. జద్రాన్ బౌలింగ్‌లో అవుటయ్యాడు. కానీ, మల్హోత్రా, వేదాంత్ (5 నాటౌట్) మరో 53 బంతులు మిగిలుండగానే జట్టును గెలిపించారు.

1 అండర్-19 వరల్డ్‌కప్‌లో ఇదే అత్యధిక ఛేదన. 2006లో ఐర్లాండ్‌పై న్యూజిలాండ్ ఛేదించిన 304 పరుగుల రికార్డును భారత్ అధిగమించింది.

2 ఈ మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌లో కలిపి నమోదైన 621 పరుగులు.. టోర్నీ చరిత్రలో రెండో అత్యధికం. 2004లో చట్టోగ్రామ్‌లో జరిగిన ఫైనల్లో ఆస్ట్రేలియా, ఐర్లాండ్ (340/5, 291/9) మ్యాచ్‌లో 631 రన్స్ నమోదయ్యాయి.

సంక్షిప్త స్కోర్లు

అఫ్ఘానిస్థాన్: 50 ఓవర్లలో 310/4 (ఫైజల్ 110, ఉజైరుల్ 101 నాటౌట్; కనిష్క 2/55, దీపేష్ 2/64).

భారత్: 41.1 ఓవర్లలో 311/3 (ఆరోన్ 115, వైభవ్ 68; నూరిస్తానీ ఒమర్జాయ్ 2/64).

ఇషా డబుల్ ధమాకా

ఆసియా షూటింగ్‌లో రెండు స్వర్ణాలు



న్యూఢిల్లీ: ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ షూటర్ ఇషా సింగ్ రెండు పసిడి పతకాలు కొల్లగొట్టింది. బుధవారం జరిగిన ఈ పోటీల్లో ఇషా వ్యక్తిగత విభాగంతో పాటు టీమ్ ఈవెంట్‌లోనూ సత్తా చాటింది. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగం ఫైనల్లో ఇషా 239.8 పాయింట్లతో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. చైనీస్ తైపీ షూటర్లు రజత, కాంస్యాలు అందుకున్నారు. టీమ్ ఈవెంట్‌లో ఇషా (575), మనుభాకర్ (575), సురభి (576) త్రయం 1726 పాయింట్లతో భారత్‌కు స్వర్ణం అందించారు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో భారత షూటర్ సమ్రాట్ కాంస్యం నెగ్గాడు. టీమ్ విభాగంలో సమ్రాట్, శ్రావణ్, వరుణ్ తోమర్ త్రయం 1732 పాయింట్లతో రజతం సాధించింది.

ఆ గెలుపు సూత్రంపైనే.. ఇప్పటి జట్టు కూడా!

పొట్టి క్రికెట్‌లో బలమైన శక్తిగా ఎదిగిన భారత్.. మరోసారి టైటిల్‌తో చరిత్ర సృష్టించాలనుకొంటోంది. 2024లో రోహిత్ శర్మ సారథ్యంలోని టీమిండియా ప్రపంచకప్‌ను సొంతం చేసుకొంది. ఆ టోర్నీలో రోహిత్ బెరుకులేని ఆటతీరుతో ముందుండి నడిపించాడు. కప్ గెలుపు సూత్రాన్ని పరిచయం చేశాడు. ఆ ఫార్ములాపైనే ఇప్పటి జట్టు కూడా నిర్మితం కావడంతో.. భారత్ మరోసారి ఫేవరెట్‌గా మారింది. ఇదే విషయాన్ని టీమిండియా మాజీ వికెట్ కీపర్ దీప్‌దాస్ గుప్తా కూడా విశ్లేషించాడు. భారత జట్టు ఆడుతున్న విధానం చూస్తుంటే.. పొట్టి ఫార్మాట్‌లో మరోస్థాయికి చేరినట్టు కనిపిస్తోందని దాస్ చెప్పాడు. ఇటీవల న్యూజిలాండ్‌తో సిరీస్‌ను గమనిస్తే.. గత పొట్టికప్‌లో రోహిత్ సేన అనుసరించిన పంథానే స్పష్టంగా కనిపించిందన్నాడు. 'ఆ రోజు అత్యంత దురుసుగా వెంటాడే తత్వం.. భారత్ మరోసారి టైటిల్ సాధిస్తుందనడంలో ఎటువంటి అనుమానం లేదని దాస్ వ్యాఖ్యానించాడు. రోహిత్, విరాట్ కోహ్లీ, జడేజాలు రిటైరైనా.. వెస్టిండీస్‌లో కప్పునెగ్గిన జట్టులోని ఎనిమిది మంది ఇప్పటి జట్టులో ఉండడం విశేషం. 'హార్దిక్ కారణంగా జట్టులో స్థిరత్వం కనిపిస్తోంది. బ్యాటింగ్, బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో టాప్‌లో ఉన్న అభిషేక్, వరుణ్ చక్రవర్తి జట్టులో ఉన్నారు. కోహ్లీ స్థానాన్ని తిలక్ వర్మ భర్తీ చేస్తాడు. శివం దూబే.. ఇప్పుడు మరింత పరిణతి ప్రదర్శిస్తున్నాడు. ఇషాన్ కిషన్ హద్దుల్లేకుండా చెలరేగుతుండడం శుభపరిణామమ'ని దీప్‌దాస్ చెప్పాడు.



ఇషాన్ కిషన్ (53)

టీ20 ప్రపంచ కప్ 2 రోజుల్లో

సంజూకు చోటుండదా?

సఫారీలతో ప్రాక్టీస్ మ్యాచ్‌లో అభిషేక్ శర్మతో ఇషాన్ కిషన్‌ను ఓపెనర్‌గా దించుతున్నట్టు మ్యాచ్‌కు ముందు కెప్టెన్ సూర్యకుమార్ చెప్పాడు. అలాగే మ్యాచ్‌లో కిషన్ కీపింగ్ చేస్తాడని తెలిపాడు. అంటే.. అమెరికాతో ఈనెల 7న జరిగే ప్రపంచ కప్ ప్రారంభ మ్యాచ్‌కు భారత తుది జట్టులో వికెట్ కీపర్, బ్యాటర్ సంజూ శాంసన్‌కు చోటు దక్కదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌లో సంజూ శాంసన్ దారుణంగా విఫలమైన సంగతి తెలిసిందే.

ప్రాక్టీస్ అదుర్స్

ఇషాన్ మెరుపు ఇన్నింగ్స్

దక్షిణాఫ్రికాపై భారత్ గెలుపు


నవీ ముంబై: దక్షిణాఫ్రికాతో భారత్ ప్రపంచ కప్ ప్రాక్టీస్ మ్యాచ్ అదిరింది. టాపార్డర్ బ్యాటర్లంతా సత్తా చాటారు. బుధవారం జరిగిన మ్యాచ్‌లో 30 పరుగులతో సఫారీలను చిత్తు చేసింది. తొలుత భారత్ 20 ఓవర్లలో 240/5 స్కోరు చేసింది. ఇషాన్ కిషన్ (20 బంతుల్లో 53 రిటైర్డ్ అవుట్) తుఫాన్ ఇన్నింగ్స్‌తో వరల్డ్ కప్‌నకు తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు. అభిషేక్ శర్మ (24 రిటైర్డ్ అవుట్)తో కలిసి తొలి వికెట్‌కు పవర్ ప్లేలోపే 80 రన్స్ జోడించాడు. తిలక్ వర్మ (19 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లతో 45) సహజశైలిలో ధాటిగా ఆడాడు. కెప్టెన్ సూర్యకుమార్ (30), వైస్-కెప్టెన్ అక్షర్ పటేల్ (35) దూకుడుగా బ్యాటింగ్ చేశారు. హార్దిక్ పాండ్యా (10 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో 30) సునామీ ఇన్నింగ్స్ ఆడాడు. ఛేదనలో సౌతాఫ్రికా 20 ఓవర్లలో 210/7 స్కోరుకే పరిమితమై ఓడింది. స్టబ్స్ (45 నాటౌట్), రికెల్టన్ (44), మార్క్రమ్ (38) మెరిశారు. హర్షిత్ రాణా ఒకటే ఓవర్ వేసి మైదానాన్ని వీడాడు. బుమ్రా అస్సలు బరిలోకే దిగలేదు.

భారత్: 20 ఓవర్లలో 240/5 (కిషన్ 53, తిలక్ వర్మ 45, అక్షర్ 35 నాటౌట్, హార్దిక్ 30, సూర్యకుమార్ 30, యాన్సెన్ 1/18, ఎంపాక 1/19, బాష్ 1/31, నోకియా 1/57).

దక్షిణాఫ్రికా: 20 ఓవర్లలో 210/7 (స్టబ్స్ 45 నాటౌట్, రికెల్టన్ 44, అభిషేక్ 2/32, అక్షర్ 1/2, వరుణ్ 1/12, అర్ష్‌దీప్ 1/29, శివమ్ దూబే 1/57).

రికార్డుల మీరా

జాతీయ లిఫ్టింగ్‌లో స్వర్ణం కైవసం



మోదీనగర్: ఒలింపిక్ పతక విజేత, స్టార్ లిఫ్టర్ మీరాబాయి చాను జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో రికార్డు ప్రదర్శనతో అదరగొట్టింది. మహిళల 48 కిలోల విభాగంలో విజేతగా నిలిచిన మీరా.. ఈ క్రమంలో మూడు జాతీయ రికార్డులను కొల్లగొట్టింది. బుధవారం ఇక్కడ జరిగిన పోటీల్లో మీరా.. స్నాచ్‌లో 89 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 116 కిలోలతో కలిపి ఓవరాల్‌గా 205 కిలోలు లిఫ్ట్ చేసి స్వర్ణం దక్కించుకుంది. దీంతో గతంలో స్నాచ్‌లో 88 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 115 కిలోలు, ఓవరాల్‌గా 203 కిలోలతో తన పేరిటే ఉన్న జాతీయ రికార్డులను మీరా అధిగమించింది.

క్వార్టర్స్‌కు భారత జట్లు

ఆసియా టీమ్ బ్యాడ్మింటన్

కింగ్డావో (చైనా): ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత పురుషులు, మహిళల జట్లు క్వార్టర్‌ఫైనల్ చేరాయి. బుధవారం జరిగిన పోరులో పురుషుల జట్టు 3-2తో సింగపూర్‌పై గెలవగా.. మహిళల బృందం 5-0తో మయన్మార్‌ను చిత్తుగా ఓడించింది.

బిజినెస్



ఏటా 8-10% జీడీపీ వృద్ధి రేటు సాధ్యమే

రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ

ముంబై: ప్రముఖ పారిశ్రామికవేత్త, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) అధినేత ముకేశ్ అంబానీ దేశ దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధి రేటుపై అత్యంత ఆశాభావంతో ఉన్నారు. భారత ఆర్థిక వ్యవస్థకు ఏటా 8 నుంచి 10 శాతం వృద్ధి రేటు నమోదు చేసే సత్తా ఉందన్నారు. జీడీపీ వృద్ధి రేటు రెండంకెల స్థాయిలో నమోదయ్యే అవకాశాన్నీ తోసిపుచ్చలేమన్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్, బ్లాక్‌రాక్ జాయింట్ వెంచర్ సంస్థ జియో బ్లాక్‌రాక్ బుధవారం సంయుక్తంగా నిర్వహించిన ఒక సమావేశంలో అంబానీ ఈ వ్యాఖ్యలు చేశారు. 'వచ్చే 20-30 సంవత్సరాల్లో మన జీడీపీ వృద్ధి రేటు, ప్రపంచ జీడీపీ వృద్ధి రేటు మించి ఉంటుందని నేను నమ్ముతున్నా' అన్నారు. మన దేశ ప్రజలు గత 50-60 సంవత్సరాలుగా పెద్ద మొత్తంలో పొదుపు చేసినా ఆ మొత్తాలను ఉత్పాదక ఆస్తుల పెంపునకు ఉపయోగించలేక పోయారని అంబానీ విచారం వ్యక్తం చేశారు. బ్లాక్‌రాక్‌తో కలిసి తమ అనుబంధసంస్థ జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ ఏర్పాటు చేసిన జియోబ్లాక్‌రాక్ ఈ లోటును తీర్చబోతోందన్నారు. పొదుపు మొత్తాలను దీర్ఘకాలిక ఆస్తుల కల్పనకు ఎలా పెట్టుబడులు పెట్టాలనే విషయంలో జియోబ్లాక్‌రాక్ ప్రజలకు సలహాలు, సూచనలు అందిస్తుందన్నారు.

టెక్ ఇన్‌ఫ్రాలోనూ ముందుంటాం: మన దేశ జీడీపీ 4.5 లక్షల కోట్ల డాలర్లకు చేరడంతో మన చరిత్ర మారబోతోందని అంబానీ అన్నారు. దీంతో అధునాతన టెక్నాలజీలకు అవసరమైన కీలక మౌలిక సదుపాయాల కల్పనలో మన దేశం ముందుకు పోతోందన్నారు. ఈ విషయంలో భారత్ ఏ మాత్రం వెనకబడి లేదన్నారు. అధునాతన టెక్నాలజీల అందుబాటుతో వచ్చే పదేళ్లలో మన ఇంధన అవసరాల్లో 80 శాతం దేశీయంగానే సమకూర్చుకోబోతున్నట్టు అంబానీ చెప్పారు. దేశంలో పెరుగుతున్న స్టార్టప్స్‌పై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ స్టార్టప్స్ 100 రిలయన్స్ లాంటి మహా కంపెనీలుగా ఎదిగే అవకాశం ఉందన్నారు. ఇందుకు అవసరమైన విధానపరమైన ప్రోత్సాహక వాతావరణం ప్రస్తుతం దేశంలో ఉందన్నారు. పెరుగుతున్న ఆర్థిక పుష్టితో అంతర్జాతీయ ఆర్థిక, దౌత్య రంగంలోనూ మన దేశ ప్రాధాన్యత పెరుగుతోందన్నారు. ఇటీవల అమెరికా, ఈయూ దేశాలతో కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలే ఇందుకు నిదర్శనమని అంబానీ తెలిపారు.

ఇది భారత యుగం

బ్లాక్‌రాక్ సీఈఓ లారీ

అంబానీతో కలిసి ఈ సమావేశంలో పాల్గొన్న బ్లాక్‌రాక్ సీఈఓ లారీ ఫింక్ ప్రస్తుతం నడుస్తోంది భారత యుగమన్నారు. మరో 20-25 సంవత్సరాల వరకు దీనికి తిరుగు లేదన్నారు. వచ్చే పదేళ్లలో భారత జీడీపీ వృద్ధి రేటు ఏటా 8 నుంచి 10 శాతం వరకు ఉంటుందని తెలిపారు. దీంతో పెట్టుబడులపై మంచి రాబడులు ఆశించే మదుపరులు ఎవరూ భారత్‌ను నిర్లక్ష్యం చేయలేరన్నారు. రిటైర్ అయిన వారి పెట్టుబడులతో దేశీయ పెట్టుబడులూ ఇబ్బడిముబ్బడిగా అందుబాటులోకి రావడంతో భారత్‌కు విదేశీ పెట్టుబడుల అవసరం పెద్దగా ఉండదని లారీ తెలిపారు.

ఆంథ్రోపిక్ ఎఫెక్ట్.. ఐటీ షేర్లు క్రాష్



- ఇన్ఫోసిస్, టీసీఎస్ స్టాక్స్ 7 శాతం డౌన్
- బీఎస్ఈ ఐటీ ఇండెక్స్ 5.49 శాతం పతనం
- రూ.1.66 లక్షల కోట్ల సంపద ఆవిరి
- 2020 మార్చి తర్వాత ఐటీకి అతిపెద్ద ఫాల్

ముంబై: అమెరికాకు చెందిన కృత్రిమ మేధ (ఏఐ) సేవల స్టార్టప్ ఆంథ్రోపిక్ ప్రవేశపెట్టిన సరికొత్త ఏఐ టూల్స్.. యూఎస్, యూరప్‌తో పాటు భారత ఐటీ కంపెనీల షేర్లనూ కుదిపేశాయి. బీఎస్ఈలో ఇన్ఫోసిస్ స్టాక్ ధర బుధవారం 7.19 శాతం క్షీణించి రూ.1,535.90కి పడిపోయింది. టీసీఎస్ షేరు కూడా 6.95 శాతం పతనమై రూ.3,000 దిగువకు పడిపోయింది. కోఫోర్జ్ 5.66 శాతం, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ 5.51 శాతం, హెక్సావేర్ టెక్నాలజీస్ 4.98 శాతం, పర్సిస్టెంట్ సిస్టమ్స్ 4.69 శాతం, హెచ్‌సీఎల్ టెక్ 4.22 శాతం, టెక్ మహీంద్రా 4.12 శాతం, విప్రో 3.73 శాతం నష్టపోయాయి. 2020 మార్చి తర్వాత ఐటీ రంగ షేర్లకు ఇదే అతిపెద్ద పతనం. దాంతో ఈ రంగ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ (క్యాపిటలైజేషన్) రూ.1.66 లక్షల కోట్ల మేర తరిగిపోయింది. బీఎస్ఈలోని ఐటీ సూచీ 5.49 శాతం పతనమైంది. ఆంథ్రోపిక్ టూల్స్ దెబ్బకు అమెరికా మార్కెట్లోనూ మంగళవారం టెక్, సాఫ్ట్‌వేర్, లీగల్ టెక్, ఫైనాన్స్ సర్వీసుల కంపెనీల స్టాక్స్ కుప్పకూలాయి. ఆ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజులోనే 28,500 కోట్ల డాలర్ల మేర పతనమైంది. అంతేకాదు, నాస్‌డాక్ సూచీ 1.43 శాతం క్షీణించింది.

సెన్సెక్స్ 78 పాయింట్లు అప్: రోజంతా లాభ నష్టాల మధ్య ఊగిసలాడిన ప్రామాణిక ఈక్విటీ సూచీలు బుధవారం స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్నాయి. ఇంట్రాడేలో 827 పాయింట్ల శ్రేణిలో కదలాడిన సెన్సెక్స్.. చివరికి 78.56 పాయింట్ల లాభంతో 83,817.69 వద్ద ముగిసింది. నిఫ్టీ 48.45 పాయింట్ల వృద్ధితో 25,776 వద్ద క్లోజైంది.

రెపో రేటు యథాతథం!

రేపే ఆర్‌బీఐ పాలసీ

ముంబై: భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) శుక్రవారం ప్రకటించే ద్వైమాసిక ద్రవ్య పరపతి విధానం (ఎంపీసీ) కోసం మార్కెట్ వర్గాలు ఆసక్తితో ఎదురు చూస్తున్నాయి. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అధ్యక్షతన మంగళవారం ప్రారంభమైన ఎంపీసీ భేటీ.. శుక్రవారం తన నిర్ణయాలను ప్రకటించనుంది. ధరల సెగ పూర్తిగా అదుపులో ఉండడం, జీడీపీ వృద్ధి రేటు జోరు మీద ఉండడంతో ఆర్‌బీఐ ఈ సమావేశంలో కీలక రెపో రేటును ప్రస్తుత 5.25 శాతం వద్దే కొనసాగించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ఇంద్రజాల్ డ్రోన్‌తో సిగ్మా అడ్వాన్స్‌డ్ జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఇంద్రజాల్ డ్రోన్ డిఫెన్స్‌తో సిగ్మా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ దీర్ఘకాలిక వ్యూహాత్మక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఇందులో భాగంగా ఇంద్రజాల్ డ్రోన్ సిస్టమ్స్‌కు అవసరమైన కీలక రాడార్, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సబ్‌సిస్టమ్స్‌ను సిగ్మా సరఫరా చేయనుంది. ఇంద్రజాల్ తన కౌంటర్ యూఏఎస్ సొల్యూషన్స్‌తో ఈ మిషన్ క్రిటికల్ సిస్టమ్స్, సబ్‌సిస్టమ్స్‌ను ఇంటిగ్రేట్ చేయనుంది తొలి ఏడాది ఈ కాంట్రాక్టుల విలువ సుమారు రూ.250 కోట్ల వరకు ఉండొచ్చని అంచనా.

సీసీఎల్ ప్రాడక్ట్స్ లాభం రూ.36 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సీసీఎల్ ప్రాడక్ట్స్ డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. అక్టోబరు-డిసెంబరు త్రైమాసికానికి గాను కంపెనీ స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన రూ.564.29 కోట్ల రెవెన్యూపై రూ.36.24 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో లాభం రూ.9.37 కోట్లుగా ఉండగా ఆదాయం రూ.401.59 కోట్లుగా ఉంది. ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.2.75 మధ్యంతర డివిడెండ్‌ను కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

- టాలీ సొల్యూషన్స్.. తిరుపతిలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థ (ఎంఎస్‌ఎంఈ)లకు సేవలందిస్తున్న పన్ను నిపుణులను సత్కరించింది. ఎంఎస్‌ఎంఈ రంగ అభివృద్ధికి తోడ్పాటు నందిస్తున్న జీఎస్‌టీపీ, అకౌంటెంట్స్, ట్యాక్స్ అడ్వకేట్స్ సహా ఇతర నిపుణులను ట్యాక్స్ అండ్ అకౌంటింగ్ టైటాన్స్ పేరుతో టాలీ సొల్యూషన్స్ సత్కరించింది
- గ్రీన్‌ఫార్చ్యూన్ విండోస్ అండ్ డోర్స్ తన బ్రాండ్ నేమ్‌ను ఇండిఫ్రేమ్‌గా మార్చుకుంది. పాత తరంతో పాటు కొత్త తరం కస్టమర్లకు మరింత చేరువయ్యే ఉద్దేశంతో బ్రాండ్ పేరును మార్చినట్లు ప్రకటించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటకలోని 100కు పైగా ప్రాంతాల్లో 800 ప్రాజెక్టులకు గ్రీన్‌ఫార్చ్యూన్ పేరుతో తన ఉత్పత్తులను డెలివరీ చేసింది.
- కుశాల్స్ ఫ్యాషన్ జువెలరీ.. హైదరాబాద్‌లో కొత్తగా నాలుగు స్టోర్లను ప్రారంభించింది. సంస్థ బ్రాండ్ అంబాసిడర్ ప్రియాంక మోహన్ ఈ స్టోర్లను ప్రారంభించారు. 40కి పైగా నగరాల్లో 100 స్టోర్లను నిర్వహిస్తున్న కుశాల్స్ వచ్చే మూడేళ్లలో దేశవ్యాప్తంగా 300 స్టోర్లను ఏర్పాటు చేయాలని భావిస్తోంది.
- ట్రాక్టర్ల తయారీ సంస్థ టాఫే.. మూడో సీజన్ మ్యాసే డైనాస్టర్ కంటెస్ట్ 2026ను ప్రారంభించినట్లు ప్రకటించింది. దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగంలో ఇన్నోవేషన్స్‌ను ప్రోత్సహించేందుకు టాఫే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ పోటీలో గెలుపొందిన విజేతలకు రూ.8.2 లక్షల విలువైన మ్యాసే ఫెర్గూసన్ 254 డైనా స్మార్ట్ ట్రాక్టర్‌ను బహుమతిగా అందించనుంది.
- డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో డాక్టర్ అగర్వాల్స్ హెల్త్ కేర్ నికర లాభం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన 54.5 శాతం వృద్ధి చెంది రూ.44 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంలో లాభం రూ.28 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం ఆదాయం కూడా రూ.443 కోట్ల నుంచి రూ.540 కోట్లకు పెరిగింది.

cognizant

25,000 ఫ్రెషర్ల నియామకాలు

న్యూఢిల్లీ: అమెరికా కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్నప్పటికీ, భారత్‌లోనే అధిక మంది ఉద్యోగులను కలిగి ఉన్న ఐటీ కంపెనీ కాగ్నిజెంట్.. ఈ ఏడాదిలో 24,000-25,000 మంది ఫ్రెషర్లను నియమించుకోనున్నట్లు బుధవారం తెలిపింది. 2025లో చేపట్టిన 20,000 నియామకాలతో పోలిస్తే ఇది 20 శాతం అధికం. "ఫ్రెషర్లను అధిక సంఖ్యలో చేర్చుకుంటున్నాం. 2024తో పోలిస్తే 2025లో వీరి హైరింగ్‌ను మరింత పెంచాం. 2026లో గత ఏడాది కంటే పెంచాలనుకుంటున్నాం" అని కాగ్నిజెంట్ సీఈఓ రవి కుమార్ ఎస్ అన్నారు. 2025 సెప్టెంబరుతో పోలిస్తే డిసెంబరు నాటికి కాగ్నిజెంట్ ఉద్యోగుల నికర సంఖ్య 1,800 పెరిగి 3,51,600కు చేరుకుంది.

19% పెరిగిన లాభం: 2025 ఆర్థిక సంవత్సరంలో డిసెంబరుతో ముగిసిన నాలుగో త్రైమాసికానికి (క్యూ4) కాగ్నిజెంట్ నికర ఆదాయం వార్షిక ప్రాతిపదికన 18.7 శాతం వృద్ధితో 64.8 కోట్ల డాలర్లకు చేరుకుంది. మొత్తం ఆదాయం 4.9 శాతం పెరిగి 533.3 కోట్ల డాలర్లకు ఎగబాకింది. 2025 ఆర్థిక సంవత్సరం మొత్తానికి కంపెనీ ఆదాయం 7 శాతం వృద్ధితో 2,110 కోట్లకు పెరిగింది. 2026 ఆర్థిక సంవత్సరంలో ఆదాయం 2,214-2,266 కోట్ల డాలర్ల (4.9-7.4 శాతం వృద్ధి) శ్రేణిలో ఉండవచ్చని సంస్థ అంచనా వేసింది.

తగ్గనున్న పసిడి, వెండి దిగుమతుల ధర

న్యూఢిల్లీ: బంగారం, వెండి దిగుమతిదారులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఈ రెండు లోహాల దిగుమతులకు ప్రామాణికంగా తీసుకునే కనీస అంచనా విలువ (నోషనల్ వాల్యూ)ను ప్రభుత్వం తగ్గించింది. దీంతో 10 గ్రాముల పసిడి దిగుమతికి ప్రామాణికంగా తీసుకునే నోషనల్ వాల్యూ 1,568 డాలర్ల నుంచి 1,518 డాలర్లకు తగ్గింది. కిలో వెండి నోషనల్ వాల్యూ కూడా 3,457 డాలర్ల నుంచి 2,657 డాలర్లకు తగ్గనుంది. బంగారం, వెండి కడ్డీలు, నాణేలు, బిస్కట్లకు మాత్రమే ఈ తగ్గింపు వర్తిస్తుంది. నగలు, వాటితో చేసిన వస్తువుల దిగుమతులకు ఈ తగ్గింపు వర్తించదు. అంతర్జాతీయ ధరలను బట్టి ప్రభుత్వం ప్రతి 15 రోజులకు ఒకసారి బంగారం, వెండి దిగుమతుల నోషనల్ వాల్యూని సవరిస్తుంది. ఈ నోషనల్ వాల్యూ ఆధారంగా ఈ దిగుమతి సుంకం విధిస్తారు.

ధరలు మళ్లీ పైకి..

విలువైన లోహాల ధరలు వరుసగా రెండో రోజు ఎగబాకాయి. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర బుధవారం మరో రూ.7,400 పెరిగి రూ.1,65,100కు చేరింది. కిలో వెండి ఏకంగా రూ.14,300 పెరుగుదలతో రూ.2,98,300 పలికింది. అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయంగా వీటి ధరలు పెరగడం ఇందుకు కారణమైంది. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ మళ్లీ 5,000 మైలురాయిని దాటేసింది. ఒక దశలో 100 డాలర్లకు పైగా పెరిగి 5,047 డాలర్ల స్థాయిలో ట్రేడైంది. వెండి 4.28 డాలర్లు ఎగబాకి 89.35 డాలర్లకు చేరుకుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)




5వ తేదీ			
హైదరాబాద్	485	విజయవాడ	505
వరంగల్	487	గోదావరి	480
చిత్తూరు	563	విశాఖపట్నం	490
		డజను గుడ్లు రూ. 75	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	130	విజయవాడ	133
వరంగల్	130	గుంటూరు	133
కరీంనగర్	130	ఒంగోలు	133
మహబూబ్‌నగర్	130	చిత్తూరు	121
కర్నూలు	130	నెల్లూరు	126
విశాఖపట్నం	125	అనంతపురం	126
గోదావరి	133		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,60,530 ▲	1,47,150 ▲	3,00,000 ▲
విజయవాడ	1,63,500 ▲	1,52,000 ▲	3,00,000 ▲
విశాఖపట్నం	1,62,942 ▲	1,49,000 ▲	3,20,000 ▲
రాజమండ్రి	1,60,530 ▲	1,47,150 ▲	2,85,000 ▲
ప్రొద్దుటూరు	1,66,000 ▲	1,52,720 ▲	2,93,000 ▲
ముంబై	1,56,625 ▲	1,43,469 ▲	2,82,462 ▲

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 5-2-2026

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

గుంటూరు సిటీ



సుప్రీంకోర్టు ఆవరణలో మమత

లాయర్ దీదీ

బెంగాల్‌లో ఎస్ఐఆర్‌పై సుప్రీంకోర్టులో స్వయంగా వాదనలు వినిపించిన మమత

9

- ఓట్లను భారీగా తొలగిస్తున్నారు
- బతికున్నవాళ్లనూ చనిపోయారని పేర్కొంటున్నారు
- రెండేళ్లలో జరపాల్సిన ఎస్ఐఆర్ మూడు నెలల్లో..
- ఈసీకి ఆరు ఉత్తరాలు రాసినా స్పందన లేదు
- న్యాయం చేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడండి: మమత
- దీదీ 5 నిమిషాలు అడిగితే 15 నిమిషాల సమయం ఇచ్చిన సీజేఐ.. 9కి వాయిదా, ఈసీకి నోటీసులు

జగన్ కుట్రలపై జనంలోకి

అరాచకాలను కలిసికట్టుగా ఎదుర్కొందాం

- టీడీపీ, జనసేన అధినేతల నిర్ణయం
- చంద్రబాబు నివాసానికి పవన్ కల్యాణ్
- రెండున్నర గంటలకుపైగా సుదీర్ఘ భేటీ
- వైసీపీ నేరపూరిత రాజకీయాలపైనే ప్రధాన చర్చ
- కులచిచ్చు పెట్టాలని చూస్తోంది
- తప్పుడు ప్రచారాలతో గందరగోళపరుస్తోంది
- తిరుమల కల్తీ నెయ్యి వ్యవహారమే నిదర్శనం
- తప్పు చేసి అడ్డగోలుగా సమర్థించుకుంటున్నారు
- కూటమిని విచ్ఛిన్నం చేసేందుకు కుట్రలు: పవన్
- కల్తీ నెయ్యి సున్నితమైన అంశం
- అందుకే ఆచితూచి వ్యవహరిస్తున్నాం
- దీనిని వైసీపీ అనుకూలంగా మార్చుకుంటోంది
- జంతు కొవ్వు ఉందని తేలినా బుకాయిస్తోంది
- సిట్ చార్జిషీటుపై కోర్టు నిర్ణయం తీసుకున్నాక అన్ని ఆధారాలతో ఎండగడదాం: సీఎం
- టీడీపీ, జనసేన సమన్వయంపై చర్చ
- త్వరలో ఖాళీ అయ్యే 4 రాజ్యసభ సీట్లపైనా

నేడు కూటమి పార్టీల అగ్ర నేతల భేటీ

- సీఎం నివాసంలో బాబు, పవన్, మాధవ్ సమావేశం
- కల్తీ నెయ్యి వ్యవహారంపైనే ప్రధాన చర్చ



అమరావతి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ సాగిస్తున్న అరాచకాలను కలిసికట్టుగా ఎదుర్కోవాలని, ఆ పార్టీ నాయకుడు జగన్ చేస్తున్న విద్వేషపూరిత రాజకీయాలను జనంలోకి ఉమ్మడిగా తీసుకెళ్లాలని టీడీపీ, జనసేన నిర్ణయించాయి. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబుతో జనసేనాని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ బుధవారం ఉండవల్లిలోని సీఎం నివాసంలో సమావేశమయ్యారు. రెండున్నర గంటలకుపైగా సుదీర్ఘంగా చర్చించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. జగన్ విద్వేష రాజకీయాలపైనే ప్రధానంగా చర్చ జరిగింది. రాష్ట్రంలో ఏ ఘటన జరిగినా దానిని కులాలకు ఆపాదించి, కులాల నడుమ చిచ్చు పెట్టేలా వైసీపీ వ్యవహరిస్తోందని.. కాపు, కమ్మ, బీసీల నడుమ విద్వేషాలను నింపి పబ్బం గడుపుకొనే ప్రయత్నం చేస్తోందని ఇద్దరు నేతలూ అభిప్రాయపడ్డారు. 2014-19 మధ్య జగన్ ఇదే ఫార్ములా అనుసరించారని, కులాల నడుమ విద్వేషాలను రెచ్చగొట్టారని చంద్రబాబు వ్యాఖ్యానించారు. టీడీపీ కమ్మ, కాపు కులాలకు కొమ్ము కాస్తోందని దుష్ప్రచారం చేసి, పార్టీ ఆవిర్భావం నుంచీ అండగా ఉన్న బీసీల్లో విద్వేషాన్ని రగిల్చారని..

మిగతా 11వ పేజీలో...



బీసీ సంక్షేమ శాఖపై సమీక్ష నిర్వహిస్తున్న సీఎం చంద్రబాబు. హాజరైన మంత్రి సవిత, అధికారులు

పారిశ్రామికవేత్తలుగా బీసీలు

- తగిన కార్యాచరణ రూపొందించండి
- అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశం
- బీసీ సంక్షేమ శాఖపై సమీక్ష
- ఆదరణ-3 ద్వారా ఆధునిక పరికరాలు
- 60 కోట్ల సాస్కి నిధులతో గురుకుల స్కూళ్లు, హాస్టళ్లు: సీఎం

అమరావతి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన వర్గాలను మైక్రో ఎంటర్‌ప్రెన్యూర్లుగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. బుధవారం బీసీ సంక్షేమ శాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఆదరణ పథకం-3 ద్వారా కులవృత్తుల వారీగా ఆధునిక

మిగతా 11వ పేజీలో...

సాగునీటి సదస్సు నేడే

- సంఘాల అధ్యక్షులతో సీఎం సమావేశం
- అమరావతి పెరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు 11
- 6,047 సంఘాలు, 58 ప్రాజెక్టు కమిటీలు, 267 డిస్ట్రిబ్యూటరీ కమిటీల చైర్మన్ల హాజరు
- యాజమాన్య విధానాలపై సీఎం కీలక ప్రకటన!
- లస్కర్ వ్యవస్థపైనా చేసే అవకాశం



అవును.. తప్పు చేశాం!

కల్తీ నెయ్యి కేసులో అప్రూవర్లుగా మారిన ముగ్గురు

నిందితుల్లో డెయిరీ ఎక్స్‌పర్ట్ సురేంద్రనాథ్

- ప్రొటోకాల్ దర్శనాలు, మర్యాదలతో వల
- మర్యాదలకు మురిసి తప్పు చేశానని విలవిల
- కోర్టులో నేరం అంగీకరించిన టాప్ సైంటిస్ట్
- రసాయనాల సరఫరా వ్యాపారి, భోలేబాబా డెయిరీ ఉద్యోగి సైతం నేరాంగీకారం

తిరుపతి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): తిరుమల కల్తీ నెయ్యి వ్యవహారంలో అక్రమార్కులు ఓ టాప్ సైంటిస్టును కూడా ప్రలోభాలకు గురిచేశారు. తిరుమలలో దర్శనాలు, వసతి ఏర్పాట్లలో ప్రొటోకాల్ మర్యాదలు చేసి బుట్టలో వేసుకున్నారు. వారి మర్యాదలకు మురిసిపోయి కల్తీ నెయ్యి వ్యవహారంలో డెయిరీలకు సహకరించినట్టు కోర్టు ఎదుట ఆయన అంగీకరించారు. ఈ కేసులో అప్రూవర్‌గా మారిన డెయిరీ ఎక్స్‌పర్ట్ డాక్టర్ బత్తుల సురేంద్రనాథ్ గత డిసెంబరు మొదటి వారంలో కోర్టు ముందు హాజరయ్యారు. నేరాంగీకారంతో పాటు ఎందుకు అలా చేయాల్సి వచ్చిందో వెల్లడించారు. నేషనల్ డెయిరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు సంబంధించి బెంగళూరులోని రీజనల్ సెంటర్‌లో కెమిస్ట్రీ విభాగానికి అధిపతిగా పని చేసిన సురేంద్రనాథ్ ఐదేళ్ల కిందట రిటైరయ్యారు. 2013 నుంచీ టీటీడీకి నెయ్యి కొనుగోలు విషయంలో సలహాలు, సూచనలు, అవసరమైన నివేదికలిస్తూ సహకరించారు. టెండర్లలో పాల్గొనే డెయిరీలను, ప్లాంట్లను తనిఖీ చేసి, వాటి నెయ్యి తయారీ సామర్థ్యం పరిశీలించి టీటీడీకి నివేదికలు ఇచ్చేవారు. అందులో భాగంగా టీటీడీ నియమించిన ప్లాంట్ ఇన్‌స్పెక్షన్ కమిటీలో నెయ్యి నిపుణుడి హోదాలో

మిగతా 11వ పేజీలో...

చిన్నప్పన్న.. పెద్ద దందాలు

- నాడు సుబ్బారెడ్డి పీఏగా ఎన్నో అక్రమాలు
- కల్తీ నెయ్యి సహా ఇతర వ్యవహారాల్లో పాత్ర
- షిప్పింగ్, ఫుా కంపెనీల నుంచి లంచాలు
- ఖాతాలో మొత్తం రూ.4,69,26,202 జమ
- నేరుగా కాకుండా ఓ మహిళ బ్యాంకు ఖాతాకు
- విజయవాడ నుంచి ఆ ఖాతా ఢిల్లీకి బదిలీ
- ఖాతాను తనే ఆపరేట్ చేసిన అప్పన్న
- కేసు నమోదుకు ఏసీబీ డీజీకి సిట్ లేఖ

తిరుపతి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా కేసులో నిందితుడిగా ఉన్న అప్పటి చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ కడూరు చిన్నప్పన్న అక్రమాలు తవ్వేకొద్దీ బయటకొస్తున్నాయి. ఆయన బ్యాంకు ఖాతాలో కల్తీ నెయ్యి లంచాల సొమ్ముతో పాటు ఇతర దందాల తాలూకూ నగదు కూడా పెద్ద మొత్తంలో ఉన్నట్టు సిట్ నిర్ధారించింది. వివిధ పనుల కోసం పలు సంస్థల నుంచి లంచంగా తీసుకున్న నగదు ఆయన ఖాతాలో జమ అయ్యిందని

మిగతా 11వ పేజీలో...

హవ్వ.. నవ్విపోదురు గాక!

- తిట్టి సారీ చెప్పినందుకు పొగడాలంట!
- కాపు కులంలో రాంబాబు టైగర్ అంట!
- సొంత పార్టీ నేతలే నవ్వుకునేలా జగన్ వ్యాఖ్యలు
- అంబటి బూతుల చరిత్ర మరిచి పొగడ్తలు



అంబటి రాంబాబు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జగన్

గుంటూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): 'అంబటి రాంబాబు కాపు కులంలో పుట్టిన విలువలున్న వ్యక్తి, టైగర్. చంద్రబాబును తిట్టినా... తర్వాత సారీ చెప్పారు కాబట్టి అంబటిని పొగడాలి'... ఇదీ వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి సూత్రీకరణ! అంబటి కుటుంబానికి పరామర్శ పేరిట ఆయన బుధవారం గుంటూరు వచ్చారు. కుటుంబ సభ్యులను పలకరించి, వారికి ధైర్యం చెప్పి వెళితే బాగుండేది. కానీ... 'అంబటి టైగర్' అంటూ జగన్ చేసిన వ్యాఖ్యలపై సొంత పార్టీలోనే విస్మయం వ్యక్తమవుతోంది. వివాదాస్పదులకు జగన్ ఇచ్చే ప్రాధాన్యం మరోసారి రుజువైంది. వైసీపీ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన అంబటి రాంబాబు అభివృద్ధి కార్యక్రమాలతో కంటే వివాదాలు, అసభ్య వ్యాఖ్యలు, వ్యక్తిగత దూషణలతోనే ఎక్కువ ప్రాచుర్యం పొందారు. రాజకీయం అంటేనే

మిగతా 12వ పేజీలో...



ఫైనల్‌కు యువ భారత్

- శతక్కొట్టిన ఆరోన్ జార్జ్
- చెలరేగిన వైభవ్, ఆయుష్
- సెమీఫైనల్లో అఫ్ఘానిస్థాన్ చిత్తు
- రేపు ఇంగ్లండ్‌తో టైటిల్ పోరు
- అండర్-19 ప్రపంచకప్

-స్పోర్ట్స్‌లో..

ఆన్‌లైన్ గేమ్‌కు బానిసలై.. అక్కాచెల్లెళ్ల ఆత్మహత్య

- 9వ అంతస్తు నుంచి దూకేసిన వైనం
- 16, 14, 12 ఏళ్ల బాలికల అఘాయిత్యం
- 'సారీ.. నాన్నా..' అంటూ సూసైడ్ నోట్
- కరోనా సమయంలో ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటై
- రెండేళ్లుగా స్కూల్‌కి కూడా వెళ్లని బాలికలు
- మందలించి, ఫోన్ తీసేసుకున్న తల్లిదండ్రులు
- మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న తోబుట్టువులు.. ఘజియాబాద్‌లో ఘటన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: విద్యార్థులు, యువత ఆన్‌లైన్ గేమింగ్‌కు బానిసలుగా మారిపోతున్నారు. మొబైల్ ఫోన్లలో ఆన్‌లైన్ గేమ్‌లు ఆడుతూ.. బాహ్యప్రపంచంతో సంబంధం లేకుండా గంటల తరబడి ఫోన్లలోనే గడిపేస్తున్నారు. తల్లిదండ్రులు వారించినా తీరు మార్చుకోవడం లేదు. ఆన్‌లైన్ గేమ్‌లకు బానిసలైన వారికి ఫోన్ అందుబాటులో లేకుండా చేస్తే.. మానసికంగా కుంగిపోతున్నారు. బలవన్మరణాలకూ పాల్పడుతున్నారు. సరిగ్గా ఇలాంటి దారుణమే

మిగతా 9వ పేజీలో...



స్టాక్ మార్కెట్‌లో నష్టాలకు ఒకరు బలి!

- ప్రైవేటు కంపెనీ చీఫ్ ఇంజనీర్ ఆత్మహత్య
- దువ్వాడ సమీపంలో రైలు కిందపడి బలవన్మరణం

7

టెన్త్ ఇన్విజిలేషన్‌లో ఆటోమేషన్

10

- సాఫ్ట్‌వేర్‌తో ఇన్విజిలేటర్ల నియామకం
- మాన్యువల్ విధానానికి విద్యాశాఖ స్వస్తి

లోక్‌సభలో పుస్తక పోరు!

- నరవణే ఆత్మకథను సభలో ప్రదర్శించిన రాహుల్‌గాంధీ
- బోఫోర్స్,గాంధీల కుటుంబంపై పుస్తకాలను తీసుకొచ్చిన బీజేపీ ఎంపీ
- సభలో తీవ్ర గందరగోళం
- స్పీకర్‌కు పరస్పరం ఫిర్యాదులు
- పార్లమెంటు వెలుపల కాంగ్రెస్ నిరసన
- సభలో రాహుల్‌కు అనుమతి ఇవ్వట్లేదు
- ప్రభుత్వం భయపడుతోంది: ప్రియాంక

9

అమెరికా నుంచి 45 లక్షల కోట్ల ఉత్పత్తులు కొంటామన్నారు

- ఈ మేరకు మోదీ మాటిచ్చారు
- అమెరికా ఉత్పత్తులపై సున్నా టారిఫ్
- భారత్‌పై అమెరికా 18శాతం సుంకం
- వైట్‌హౌజ్ ప్రతినిధి కరోలిన్ లీవిట్
- వెనిజువెలా చమురుతో భారీ లబ్ధి
- 300 బిలియన్ డాలర్ల ఆదా: ఎస్‌బీఐ
- చాబహార్ ప్రాజెక్టు నుంచి భారత్ వెనక్కి?

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మణిపూర్‌లో కొత్త ఆశలు

ఏడాదిగా రాష్ట్రపతి పాలనలో ఉన్న మణిపూర్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పడింది. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ మూలాలున్న బీజేపీ సీనియర్ నాయకుడు యుమ్నాం ఖేమ్‌చంద్ సింగ్ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. కుకీ మహిళా ఎమ్మెల్యే నెమ్చా కిప్గెన్, నాగా పీపుల్స్ ఫ్రంట్ నాయకుడు లోసీ డిఖో ఉపముఖ్యమంత్రులైనారు. ఎప్పటిలాగానే ముఖ్యమంత్రి పదవి మీతీలకే దక్కినప్పటికీ, కుకీ, నాగా జాతులకు చెందిన వారిని ఆ తరువాతి స్థానాల్లో కూచోబెట్టడం ద్వారా బీజేపీ ప్రభుత్వం మణిపూర్ సమాజానికి సుహృద్భావ సందేశం ఇచ్చే ప్రయత్నమైతే చేసింది.

ప్రమాణస్వీకారోత్సవం సందర్భంగా కుకీ–జో–హ్మార్, నాగా ఎమ్మెల్యేలు ఇంఫాల్‌లో కనిపించడాన్ని మీడియా ప్రత్యేకంగా, విశేషంగా చెబుతోంది. ఎంతోకాలం తరువాత ఇంఫాల్‌లో సందడి కనిపించింది. ఎటువంటి నిర్దిష్టమైన హామీలూ లేకుండా కుకీలూ నాగాలు ప్రభుత్వంలో పాలు పంచుకోవడం సరైనది కాదన్న విమర్శలు, హెచ్చరికలు మరోపక్క ఉండనే ఉన్నాయి. ఆయా తెగలకు చెందిన తిరుగుబాటు సంస్థల హెచ్చరికల నేపథ్యంలో, కొండప్రాంతాలకు చెందిన ఎమ్మెల్యేలు దిగిరారన్న అనుమానాలు చివరినిముషం వరకూ లేకపోలేదు. ఖేమ్‌చంద్ ఎంపికకు ముందు రోజు కూడా కుకీ–జో తెగలకు న్యాయం చేయకుండా, నిర్దిష్టమైన హామీలు ఇవ్వకుండా ప్రభుత్వ ఏర్పాటు సరికాదని సీనియర్ ఎమ్మెల్యేలు సైతం వ్యాఖ్యానించారు. కొండ ప్రాంతాల్లో ప్రత్యేక స్వతంత్ర పాలనకు పట్టుబడుతున్న శక్తులు ప్రభుత్వ ఏర్పాటుకు వ్యతిరేకంగా మొండిగా మాట్లాడాయి. జనవరి ఆరున సమావేశమైన కుకీ–జో కౌన్సిల్ కొత్త ప్రభుత్వం ఏర్పాటు ఆలోచనను తిరస్కరించడమే కాక, తమ జాతుల వారు అందులో భాగస్వాములు కాకూడదని తీర్మానించింది. కుకీ–జోలు అత్యధికంగా ఉన్న ప్రాంతాలతో కేంద్రపాలిత ప్రాంతం ఏర్పాటు చేస్తామన్న హామీ తీసుకున్నాకే ప్రభుత్వంలో చేరాలని మరొక సమావేశం డిమాండ్ చేసింది. ఇటువంటి పలు డిమాండ్లు, తెగల తీర్మానాలు, తిరుగుబాటుదారుల హెచ్చరికల నేపథ్యంలో ఖేమ్‌చంద్ ఎంపిక జరిగిందన్నది వాస్తవం.

ఈ లిబరల్ మీతీ నాయకుడికీ, మణిపూర్‌ను రెండేళ్ళపాటు అగ్నికి ఆహుతి చేసిన మాజీ ముఖ్యమంత్రి బిరేన్‌సింగ్‌కు హస్తిమశకాంతరం ఉంది. ప్రధానంగా మీతీ పక్షపాతంతో ఇతర తెగల ఊచకోతలను సమర్థించిన బీరేన్‌ను వ్యతిరేకించిన వ్యక్తిగా ఖేమ్‌చంద్‌కు పేరుంది. ముఖ్యమంత్రి పదవినుంచి బీరేన్‌ను తొలగించకపోతే పార్టీలో తిరుగుబాటు తప్పదని అధిష్ఠానానికి విస్పష్టంగా చెప్పడంతోపాటు, స్పీకర్‌తో చేయికలిపి బీరేన్‌కు వ్యతిరేకంగా ఎమ్మెల్యేలను కూడగట్టడంలో ఈయనది ప్రధాన పాత్ర. ఒకదశలో బీరేన్‌ను మార్చేందుకు ఢిల్లీ పెద్దలు సిద్ధపడ్డా ఆయన తన మీతీబలాన్ని ప్రదర్శించి తిరుగుబాటు చేయడం తెలిసిందే. చివరకు, కాంగ్రెస్ ప్రవేశపెట్టిన అవిశ్వాసతీర్మానాన్ని కూడా వినియోగించుకొని అధిష్ఠానంమీద ఖేమ్‌చంద్ ఒత్తిడిపెంచడంతో బీరేన్‌ను దించివేయక తప్పలేదు. ఆ దశలో అసెంబ్లీని కొనసాగిస్తే రాష్ట్రం చేజారిపోతుదని భయపడిన ఢిల్లీ పెద్దలు బీరేన్‌స్థానంలో మరొకరిని కూచోబెట్టడానికి బదులు రాష్ట్రపతిపాలన విధించి, ఈ ఏడాదికాలంలో రాష్ట్రాన్ని గాడినపెట్టేందుకు కొన్ని ప్రయత్నాలైతే చేశారు కానీ, అది పూర్తిగా సాధ్యపడలేదు. మీతీలకు ఆర్థిక, ఆయుధ, సాయుధ సాయంతో బీరేన్ సృష్టించిన మారణకాండ ఊహకు అందనిది. వందలాది మరణాలు, దహనాలు, అత్యాచారాలు, వలసలతో సమాజం ఛిన్నాభిన్నమైపోయింది.

నిలువునా చీలిన సమాజాన్ని తిరిగి ఒక్కటిచేయాల్సిన కర్తవ్యం కొత్త ముఖ్యమంత్రి మీద ఉంది. డిసెంబరులో ఆయన కుకీ–జో శిబిరాన్ని సందర్శించి బాధితులను పరామర్శించడం రాజకీయ ఎత్తుగడగా కొందరు వ్యాఖ్యానించినప్పటికీ, మీతీలకు ఆగ్రహాన్ని కలిగించే ఈ చర్యకు ఆయన సాహసించడం ఆశ్చర్యకరం. కుకీలు దానిని స్వాగతించకపోయినా, వ్యతిరేకించలేదు. ఖేమ్‌చంద్ పట్ల కుకీ–జో, నాగాల్లో ఇష్టాలు లేవు, ద్వేషాలూ లేవు. బీరేన్‌మాదిరిగా ఆయనను అనుమానించడానికి కూడా ఏమీ లేదు. అయితే, ముఖ్యమంత్రిగా మీతీ ఉన్నంతకాలం తమకు అన్యాయమే జరుగుతుందని కుకీ–జో తెగలవారు తీవ్రంగా భయపడుతున్న తరుణంలో గాయాలను మాన్పే పని సత్వరంగా జరగాలి. న్యాయం జరుగుతుందన్న నమ్మకం బాధితులకు కలగాలి. వచ్చే ఏడాది జరగబోతున్న ఎన్నికలమీద కాక, తలలు తెగ్గోసుకుంటున్న తెగలను దగ్గర చేసే పనిమీద కొత్తప్రభుత్వం దృష్టిపెట్టాలి.

> అమెరికాలో భారతీయ వలసదారులు ఎక్కువగా సంపాదిస్తున్నారు, ఎక్కువగా పన్నులు చెల్లిస్తున్నారు, అక్కడి ప్రభుత్వ సహాయంపై తక్కువ ఆధారపడుతున్నారు.

అది మన ఆత్మగౌరవ సంకేతం!

అమెరికా ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలను బయటి దేశాలవారే ఎక్కువగా పొందుతున్నారనే ఉద్దేశంతో ఆ పథకాలపై ఆధారపడి జీవిస్తున్న వలసదారుల లెక్కలు తీసింది ట్రంప్ ప్రభుత్వం. ఈ లెక్కల ఆధారంగా 75 దేశాల పౌరులకు కొత్తగా అమెరికా రావడానికి అవసరమైన వీసా ప్రాసెసింగ్ నిలిపివేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఏ దేశమైనా సొంత పౌరుల కోసమే ప్రభుత్వ ధనాన్ని వెచ్చించి సంక్షేమ పథకాలను రూపకల్పన చేస్తుంది. కానీ నిబంధనల్లో లొసుగుల్ని వాడుకుంటూ ఆ ప్రయోజనాల్ని ఇతరులు గద్దించుకుంటూ కాజేస్తోంటే ఎవ్వరైనా ఏం చేస్తారో ట్రంప్ కూడా అదే చేశారు. గమనించాల్సిన అంశం ఏంటంటే పాకిస్తాన్, బంగ్లాదేశ్, నేపాల్‌తో పాటు, రష్యా వంటి దేశాలు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. భారత్ మాత్రం ఈ జాబితాలో లేదు. అమెరికాలో అడుగుపెడుతున్న భారతీయులు తమ నైపుణ్యాలు, సామర్థ్యాల మీద ఆధారపడి బతుకుతున్నారే తప్ప, అమెరికా ప్రభుత్వపు దయాదాక్షిణ్యాల మీద కాదని దీన్ని బట్టి స్పష్టమవుతోంది.



ట్రంప్ నిర్ణయం కొందరికి కంటగింపుగా కనిపించవచ్చు. అధికారికంగా వీసా ప్రాసెసింగ్ నిలిపివేయకుండా కేవలం వీసాలు తిరస్కరిస్తూ వచ్చినా ఇంత చర్చ జరిగేది కాదు. కానీ ట్రంప్ తాను ఆయా దేశాలను వెలివేస్తున్నట్టు స్పష్టం చేయదల్చుకున్నారు కనుకనే ఈ నిర్ణయం తీసుకున్నారు. అమెరికాలో ఉంటున్న ఆయా దేశాలకు చెందిన వలసదారులు అక్కడి సంక్షేమ పథకాలన్నింటినీ హైజాక్ చేసేస్తుండటం ఆ తీవ్ర నిర్ణయానికి దోహదం చేసింది. ఈ జాబితాలో అమెరికాతో పోటీపడగల అగ్రదేశం అని చెప్పుకునే చైనా నుంచి చిన్న దేశాల వరకు అనేకం ఉన్నాయి... మనం తప్ప! అమెరికాలోని భారతీయుల ఆత్మగౌరవాన్ని ఇనుమడింపజేసే అంశం అది. అమెరికన్లు కూడా మనల్ని గౌరవించి తీరాల్సిన సంగతి ఇది. అమెరికన్ వ్యవస్థకు భారతీయులు కంట్రిబ్యూట్ చేస్తున్నారే తప్ప, అమెరికా నుంచి వారు తీసుకునే విధంగా లేరు. ఇందుకు భారతీయుల జీవన విధానంలోని క్రమశిక్షణ, ఆర్థిక వనరుల నిర్వహణ, తమ కాళ్లపైనే తాము నిలబడాలనుకునే ధోరణి ఒక కారణం.

భారతీయ వలసదారులు ఎక్కువగా నైపుణ్య ఆధారిత, ఉన్నత వేతనాలు గల రంగాల్లోనే ఉన్నారు. సాంకేతిక, వైద్య, ఇంజనీరింగ్, పరిశోధన, వ్యాపార రంగాల్లో పనిచేస్తున్నారు. ఇవి స్థిరమైన ఆదాయం ఇచ్చే ఉద్యోగాలు. కాబట్టి ప్రభుత్వ సహాయం, పథకాలను అర్థించే స్థితిలో భారతీయులు లేరు. ప్యూ రీసెర్చ్ సెంటర్ ప్రకారం, 2023 నాటికి అమెరికాలో సుమారు 52 లక్షల మంది భారతీయులు నివసిస్తున్నారు. అమెరికాలోని అన్ని ప్రధాన వలస సమూహాల్లో భారతీయుల కుటుంబాల సగటు ఆదాయం అత్యధికం. 2023లో ఆసియా–అమెరికన్ కుటుంబాల సగటు ఆదాయం సుమారు లక్షా అయిదు వేల డాలర్లుగా ఉన్నా, భారతీయుల ఆదాయం దానికన్నా ఎక్కువ. భారతీయుల నేతృత్వంలోని కుటుంబాల సగటు వార్షిక ఆదాయం లక్షా యాభై వేల డాలర్లకు పైగా ఉంది. ఇది అమెరికా జాతీయ సగటును మాత్రమే కాదు, ఇతర వలసదారుల సగటును కూడా దాటింది. ఈ అధిక ఆదాయం కారణంగా భారతీయులు స్థానిక, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు భారీగా పన్నులు చెల్లిస్తున్నారు. ఆర్థికంగా చూస్తే, వారు వ్యవస్థ నుంచి తీసుకునేదాని కంటే ఎక్కువగా అందిస్తున్నారు. అందుకే భారతీయ అమెరికన్లను 'నికర కంట్రిబ్యూటర్లు'గా ఆర్థిక నిపుణులు పిలుస్తున్నారు.

వలస విధానాలు ఎలా ఉంటే ఫలితాలు ఎలా ఉంటాయన్న దానికి భారత్ మంచి ఉదాహరణ. నైపుణ్యాలు, ఉపాధి సామర్థ్యం, విద్యకు ప్రాధాన్యం ఇచ్చిన వలస మార్గాలు సమాజాన్ని బలపరుస్తాయి. ఆర్థిక వ్యవస్థను నిలబెడతాయి. ఇటు సొంత దేశాన్ని, అటు వలస వెళ్లిన దేశాన్ని కూడా గౌరవప్రద స్థితిలో ఉంచుతాయి. అమెరికాలో భారతీయ వలసదారులు ఎక్కువగా సంపాదిస్తున్నారు, ఎక్కువగా పన్నులు చెల్లిస్తున్నారు, అక్కడి ప్రభుత్వ సహాయంపై తక్కువగా ఆధారపడుతున్నారు. అన్ని దేశాల వీసా ప్రాసెసింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేయడం ఒక రకంగా అమెరికాలోని భారతీయులకు సానుకూలాంశం అయ్యే అవకాశం ఉంది. ఉద్యోగాధారిత గ్రీన్ కార్డుల జారీ విషయంలో ఇది ఎన్నారైలకు కలిసొచ్చే సంగతి. ఈ దేశాల వీసాలు ఆగిపోవడం వలన, ఈ ఏడాది సెప్టెంబరు నాటికి కొత్తగా యాభై వేలకు పైగా గ్రీన్ కార్డ్ స్లాట్స్ ఖాళీ అవుతాయి. ఈ 75 దేశాలకు చెందినవారు గ్రీన్ కార్డ్ స్లాట్స్‌ను వినియోగించుకోలేరు. ఆ పరిణామం భారత్ వంటి దేశాల వారు త్వరగా గ్రీన్ కార్డులు పొందే ప్రక్రియను వేగవంతం చేయవచ్చు.

● కృష్ణమోహన్ దాసరి
పాత్రికేయుడు, డల్లాస్

సామాజిక న్యాయంపై కనిపించని కుట్ర

ఉన్నత విద్యా సంస్థలలో కుల ఆధారిత వివక్షను నివారించేందుకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) గత నెల 13న జారీ చేసిన కొత్త నిబంధనలు తీవ్ర అలజడికి దారితీశాయి. వాటిపై నెలకొన్న వివాదం ఉన్నత విద్యా సంస్థలలో సమానత్వాన్ని ప్రోత్సహించడం గురించి ఎంతమాత్రం కాదు. నిజ జీవిత పర్యవసానాలతో కూడిన రాజకీయ ప్రహసనమది. ఆరంభం నుంచి ముగిసే వరకు ఆ నాటకంలోని ప్రతి సన్నివేశం కూడా ద్వేష భావంతో నిండివున్నది. తొలుత పాటించిన వైఖరికి విరుద్ధమైన నిర్ణయం తీసుకుంది యూజీసీ. సామాజిక న్యాయం పట్ల ఉదాసీనత చూపే పాలనా వ్యవస్థ ఉన్నత విద్యా సంస్థలలో వివక్షను రూపుమాపేందుకు ఉద్దేశిస్తూ కొత్త నిబంధనలు జారీ చేసింది. ఆ తరువాత ఆ నిబంధనలకు వ్యతిరేకంగా భిన్నాభిప్రాయాన్ని ఉత్పత్తి చేశారు. పాలకులకు విధేయులు అయినవారు తమ సొంత ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలకు పూనుకున్నారు. ఆధిపత్యాన్ని చలాయించేవారే తాము వేధింపులకు గురవుతున్నామని ఆక్రోశించారు. అంతిమంగా సర్వోన్నత న్యాయస్థానం రంగప్రవేశం చేసింది. వివక్ష నివారణకు నిబంధనలు రూపొందించి అమలుపరచాలని ప్రభుత్వాన్ని ఆదేశించిన అత్యున్నత న్యాయస్థానమే తీరా అవి జారీ అయిన తరువాత రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా లేవనే అభిప్రాయంతో వాటి అమలుపై స్టే విధించింది. యూజీసీ నిబంధనల అమలును సుప్రీం కోర్టు నిలిపివేయడం సాంకేతికంగా ఒక చిన్న విషయమే కావచ్చుకానీ పౌరులు, ప్రభుత్వం మధ్య రాజ్యాంగంలో పొందుపరచిన ఒక సున్నితమైన సామాజిక ఒప్పందాన్ని ఉల్లంఘించే న్యాయ నిర్ణయమది.

యూజీసీ నిబంధనలపై వివాదం విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో సామాజిక వివక్ష ఉందా లేదా అనే విషయంపై కాదు. ఉందనేది ఒక తిరుగులేని వాస్తవమని ఇటీవలే ప్రచురితమైన ఎన్.సుకుమార్ పుస్తకం 'Caste Discrimination and Exclusion in Indian Universities: A Critical Reflection' ధ్రువీకరించింది. ఆ అంశంపై ప్రస్తుతమున్న సమాచారంతో పాటు తాను స్వయంగా నిర్వహించిన సర్వే, విద్యార్థుల వ్యక్తిగత అనుభవాలు, సంస్థాగతమైన విశ్లేషణల ఆధారంగా ఉన్నత విద్యా సంస్థలలో కుల ఆధారిత వివక్ష వ్యవస్థాగతమైనదని సుకుమార్ నిరూపించారు. సంప్రదాయిక కుల పరపతి ఎలా ఆధునిక అవకాశాలకు ఆలంబన అవుతుందన్న విషయమై ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త సతీశ్ దేశ్‌పాండే ప్రతిపాదన ఆధారంగా వ్యక్తిగత మేధా విజయాలకు అది దోహదం చేస్తున్న తీరుతెన్నులను సుకుమార్ వివరించారు.

దేశంలోని కొన్ని ఉత్కృష్ట ఉన్నత విద్యాసంస్థలలో దళిత విద్యార్థులు ఏ విధంగా నిందలు, దుర్భాషలనెదుర్కొంటున్నదీ సుకుమార్ పేర్కొన్నారు. అగ్రకులాలకు చెందిన విద్యార్థులు తమ సహచర విద్యార్థులు అయిన దళిత సామాజికులను 'కోటా సంతానం', 'కేటగిరీ వాలా', 'సర్కారీ దమాద్', 'సర్కారీ బ్రాహ్మిణ్', 'సద్దూస్' లేదా 'బెహెన్జీ' అని, ఇంకా చెప్పలేని మాటల్లో ఎత్తి పొడుస్తుంటారని సుకుమార్ తెలిపారు. ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశాలు, మూల్యాంకనాలు, పరిశోధనా పర్యవేక్షణలు, పాలనా వ్యవహారాలు, క్రమశిక్షణా యంత్రాంగాలలో సర్వత్రా కుల ఆధారిత వివక్ష పరివ్యాప్తమై ఉంది. పది విశ్వవిద్యాలయాలలో 600 మంది విద్యార్థినీ విద్యార్థులతో నిర్వహించిన ఇంటర్వ్యూల ఆధారంగా సుకుమార్ ఈ



వాస్తవాలు వెల్లడించారు. వైవాలు, ఇంటర్వ్యూలలో తాము వివక్షకు గురవుతున్నామని మూడింట రెండు వంతుల మంది విద్యార్థులు వెల్లడించారు. ఆ వివక్షకు ప్రాథమిక కారకులు అధ్యాపకులే అని 60శాతం మంది విద్యార్థులు నిర్ధారించారు. అంతే శాతం మంది దళిత పరిశోధక విద్యార్థులు తాము పర్యవేక్షణాపరమైన దోపిడీకి గురవుతున్నామని తెలిపారు. మరి ఓబీసీల విషయంలో ఈ వివక్ష ఎలా ఉందని మీరు ప్రశ్నించవచ్చు. మన విశ్వవిద్యాలయాలలో ఆ విద్యార్థుల అనుభవాలు ఆ ఉన్నత విద్యా సంస్థలు ప్రజాస్వామిక నెలవులుగా లేవు అని మాత్రమే స్పష్టం చేస్తున్నాయి.

> భారత రాజ్యాంగం ప్రవచించిన సామాజిక న్యాయ భావనపై ప్రచ్ఛన్న దాడులు జరుగుతున్నాయి. ఉన్నత విద్యా సంస్థలలో కుల ఆధారిత వివక్షలు రూపుమాపేందుకు యూజీసీ జారీ చేసిన కొత్త నిబంధనలను సామాజిక న్యాయ వ్యతిరేక శక్తులు అందుకొక అవకాశంగా వాడుకున్నాయి. ఆ దాడుల అసలు లక్ష్యం రిజర్వేషన్ల సదుపాయాన్ని పూర్తిగా కూల్చివేయడమే.

ఈ వివక్షను అరికట్టేందుకు 2012లో యూజీసీ జారీ చేసిన నిబంధనలను రూపొందించడంలో ఆ సంస్థ సభ్యుడిగా నేనూ పాలుపంచుకున్నాను. ఆ తొలి నిబంధనలను అమలుపరిచేందుకు నిర్దేశించిన సంస్థాగత ఏర్పాట్లు సంతృప్తికరంగా లేవు. వాటితో పోల్చితే ఇటీవలి కొత్త నిబంధనలు సంస్థాగత ఏర్పాట్ల విషయంలో చాలా మెరుగ్గా ఉన్నాయి. వివక్షను ఇవి విస్తృత ప్రాతిపదికన నిర్వచించాయి. వేధింపులు, వ్యక్తిగతంగా బాధించడం, వ్యతిరేకత చూపించడం మొదలైనవి కూడా వివక్ష కిందకు వస్తాయి. మరింత స్పష్టంగా చెప్పాలంటే ప్రత్యక్ష, పరోక్ష వివక్షలు అన్నిటినీ రూపుమాపడమే కొత్త నిబంధనల లక్ష్యంగా ఉన్నది.

కొత్త నిబంధనలు ప్రశస్తమైనవి అనడంలో సందేహం లేదు. సమస్యల్లా వాటిని ఆచరణలోకి తీసుకురావడమే. ఇదిగో, ఈ విషయంలోనే సంకల్పం కొరవడుతోంది. 2012లో యూజీసీ జారీ చేసిన నిబంధనలు కాగితాల మీదనే ఉండిపోయాయి. వాటి గురించి విద్యార్థులకు తెలియనే తెలియదు. మరి 2026లో జారీ అయిన కొత్త నిబంధనల పరిస్థితి అందుకు భిన్నంగా ఉంటుందా?


■ యోగేంద్ర యాదవ్

ఈ వ్యవహారం ఒక న్యాయ వివాదం కాదు. ఒక న్యాయ వివాదంగా అది రూపొందకూడదు. విద్యా సంస్థల్లో వివక్షకు వ్యతిరేకంగా యూజీసీ జారీ చేసిన పాత నిబంధనలు, కొత్త నిబంధనలు రెండూ కూడా రాజ్యాంగం నుంచి స్ఫూర్తి పొందినవే. 'కులం, సంప్రదాయం, మతం, భాష, జాతి, జెండర్, వైకల్యం' ఆధారంగా ఎటువంటి వివక్ష చూపడానికి వీలులేదని పాతవీ, కొత్తవీ రెండూ స్పష్టం చేశాయి, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన విద్యార్థులకు సంభావ్య వివక్ష నుంచి రక్షణ కల్పించాలని పాత నిబంధనలు నిర్దేశించాయి. ఆ సామాజిక వర్గాలకు తోడుగా ఓబీసీలకు కూడా అటువంటి రక్షణ కల్పించాలని కొత్త నిబంధనలు పేర్కొన్నాయి. గమనార్హమైన వాస్తవమేమిటంటే 2019లో రోహిత్ వేముల, పాయల్ తాడ్వి (విశ్వవిద్యాలయాలలో వేధింపులు, మానసిక క్షోభకు గురై ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులు)ల మాతృమూర్తులు దాఖలు చేసిన ఒక కేసులో సర్వోన్నత న్యాయస్థానం నిర్దిష్ట ఆదేశాల మేరకు కొత్త నిబంధనలను యూజీసీ జారీ చేసింది. జస్టిస్ (ఇప్పుడు సీజేఐ) సూర్యకాంత్, జస్టిస్ బాగ్చీలతో కూడిన ధర్మాసనం సెప్టెంబర్ 15, 2025న ఆ ఆదేశాలు జారీ చేసింది. 'విద్యార్థుల పట్ల వివక్ష నివారణకు ఒక కమిటీ నేర్పాటు చేయాలని, ఆ కమిటీలో 50శాతం మంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు చెందినవారే సభ్యులుగా ఉండాలని, కమిటీ చైర్మన్ కూడా ఆ సామాజిక వర్గాలకు చెందిన వ్యక్తే ఉండాల'ని సుప్రీంకోర్టు సిఫారసు చేసింది. ఆ సిఫారసుల మేరకు యూజీసీ కొత్త నిబంధనలు జారీ చేసింది. తాము సిఫారసు చేసిన నాలుగు నెలల అనంతరం అదే ధర్మాసనం యూజీసీ జారీ చేసిన కొత్త నిబంధనలు రాజ్యాంగబద్ధంగా లేవంటూ వాటి అమలుపై స్టే విధించింది. ఈ స్టే ఉత్తర్వుల జారీకి సుప్రీంకోర్టు చెప్పిన కారణాలు ఈ తరహా వివక్షల విషయమై సర్వోన్నత న్యాయస్థానం దీర్ఘకాలంగా అనుసరిస్తున్న వైఖరికి అనుగుణంగా లేవని న్యాయశాస్త్ర కోవిదుడు గౌతమ్ భాటియా అభిప్రాయపడ్డారు.

ఉన్నత విద్యా సంస్థలలో కుల ఆధారిత వివక్షను రూపుమాపేందుకు యూజీసీ జారీ చేసిన నిబంధనలపై రగులుతోన్న ఆందోళన నిస్సందేహంగా ఒక రాజకీయ పోరాటం. దానికి కారకులైనవారు తమ అసలు లక్ష్యాలను దాచిపెట్టారు. ఎన్నికలలో విజయాన్ని సాధించిపెట్టే ఒక సామాజిక సంకీర్ణాన్ని భారతీయ జనతా పార్టీ నిర్మించుకున్నది. తన ప్రధాన ఓటు బ్యాంకు అయిన అగ్రకులాల హిందువులను సంఘటిత పరచడంతో పాటు హిందూ సమాజంలోని మిగతా సామాజిక వర్గాలపై గణనీయమైన పట్టు సాధించడం ద్వారా ఆ సామాజిక సంకీర్ణం సాధ్యమయింది. ఆ క్రమంలో కింది స్థాయి హిందూ సామాజిక వర్గాలు అయిన దళితులు, బహుజనులకు పలు రాజకీయ, ఆర్థిక రాయితీలు కల్పించింది. కుల గణన డిమాండ్‌ను ఆమోదించడం కూడా వాటిలో ఒకటి. తమ రాజకీయ అధికారాన్ని, ఆధిపత్యాన్ని నిలబెట్టుకునేందుకు దళిత, బహుజనులకు అటువంటి రాయితీలు కల్పించడం తప్పనిసరి అని బీజేపీ ప్రధాన ఓటు బ్యాంకు అయిన అగ్రకులాల హిందువులు భావించారు, సహించారు. ఎన్నికలలో బీజేపీ వరుసగా తిరుగులేని విజయాలు సాధిస్తూ వస్తోంది. ఎడతెగని ప్రచారోధృతితో తన భావజాలానికి విస్తృత ఆమోదాన్ని కూడా సాధిస్తోంది. ఈ కారణంగా దళితులు, బహుజనులకు ఇస్తోన్న రాయితీలు అనవసరమని, అవి ఇవ్వకపోయినా తమ రాజకీయ ఆధిపత్యానికి సవాళ్లు ఎదురుకావనే సునిశ్చిత విశ్వాసానికి బీజేపీ మద్దతుదారులు అయిన అగ్రకులాల హిందువులు వచ్చారు. ఏది ఎలా జరిగినప్పటికీ ఓబీసీలకు కల్పిస్తున్న ప్రయోజనాల విషయమై అగ్రకులాల హిందువులకు తీవ్ర అభ్యంతరాలు ఉన్నాయి. ఫలితంగా బీజేపీ నిర్మించిన సామాజిక సంకీర్ణం బీటలువారడం ప్రారంభమయింది. ఈ విచ్ఛిన్నాన్ని, లేదా అనైక్యతను దాచిపెట్టేందుకు బీజేపీ చాలా కష్టపడుతోంది.

భారత రాజ్యాంగం ప్రవచించిన సామాజిక న్యాయ భావనపై ప్రచ్ఛన్న దాడులు జరుగుతున్నాయి. యూజీసీ నిబంధనలు అందుకొక సందర్భం మాత్రమే. ఆ అవకాశాన్ని సామాజిక న్యాయ వ్యతిరేక శక్తులు ఉపయోగించుకున్నాయి. వాటి అసలు లక్ష్యం రిజర్వేషన్ల సదుపాయాన్ని పూర్తిగా కూల్చివేయడమే. వివిధ రంగాలలో ఓబీసీల పురోగతి ఆ శక్తులకు తొట్రుపాటు కలిగిస్తోంది. కులగణన డిమాండ్ ఆ శక్తులను కలవరపరుస్తోంది. ఫలితంగానే యూజీసీ నిబంధనలపై వివాదం నెలకొన్నది. ఈ వివాదంతో– తమ రాజకీయ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి కృతనిశ్చయంతో ఉన్నవారు, రాజకీయ అధికారాన్ని సాధించుకోవడానికి ప్రయత్నిస్తున్న వారి మధ్య ఒక సామాజిక సమరం పునః ప్రారంభమయింది. ఈ పోరాటం మన రిపబ్లిక్ భవితవ్యాన్ని నిర్ణయిస్తుంది.

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)


'డచ్ రోగం' ముదిరేనా?

ప్రపంచంలోనే అత్యంత అరుదైన, అపారమైన ఖనిజ నిల్వలకు చిరునామా భారతదేశం. దేశ సజీవ, నిర్జీవ సహజ వనరుల్లో (అటవీ సంపద, ఖనిజం= మినరల్, ముడి ఖనిజం= ఓర్) అత్యధిక శాతం వింధ్య పర్వతాలకు దిగువనున్న దక్షిణాపథంలో (దక్కన్ ద్వీపకల్పం, తమిళనాడు, కేరళ, కర్ణాటక భూభాగాలతో సహా శ్రీలంక, మాల్దీవుల వరకు) విస్తరించి ఉందన్న విషయం తెలిసిందే. శతాబ్దాల నుంచి చారిత్రకంగా కదంతాల్ స్థితిలో కొనసాగుతున్న 'గోండ్వానా' ఆదివాసీల నివాస ప్రాంతంగా, వారిని సంఘటితం చేసిన మావోయిస్టుల ప్రభావిత ప్రాంతంగా 45 ఏళ్ళకు పైగా ఉన్నందున... ఈ విలువైన సహజ వనరులు, మానవ వనరులు దేశీయ, ప్రపంచ మార్కెట్‌తో అనుసంధానం కాలేదు.

2026 మార్చి నాటికి దక్షిణాపథంలో మావోయిస్టు తీవ్రవాదాన్ని అంతమొందించడంలో భాగంగా అనేక రూపాల్లో సాయుధ ఆపరేషన్లను కేంద్రం నిర్వహించింది. వాటికి పరాకాష్ఠగా 'ఆపరేషన్ కగార్' కేంద్రంగా 'డిసిసివ్ డికేడ్: ఎండింగ్ లెఫ్ట్ వింగ్ ఎక్స్‌ట్రీమిజం' అనే సైనిక వ్యూహాన్ని కేంద్రం వేగంగా చేపట్టడంతో మావోయిస్టు ఉద్యమం పూర్తి స్థాయిలో అంత్య దశకు చేరుకుంది. దాంతో గణనీయమైన స్థాయిలో మానవ వనరులు, సహజ వనరులు దేశ, విదేశీ మార్కెట్లకు అందుబాటులోకి వచ్చాయి. వీటి వాణిజ్యం (స్వదేశీ, విదేశీ) ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతుందని, వాణిజ్యం విస్తృతమై, అపార సంపదలు సమాజంలోకి విదేశీ మారక నిల్వల రూపంలో ప్రవహిస్తాయన్న పాలకుల స్వప్నం సాకారమవుతుందా?

స్వాతంత్ర్యానంతరం తొలి 3 దశాబ్దాలు కొనసాగిన 'హిందూ వృద్ధిరేటు' అనే ఆర్థిక బాలారిష్టంలో కూరుకుపోయి, గణనీయమైన నిర్మాణాత్మక పరిణామానికి ఇండియా ఆర్థిక వ్యవస్థ నోచుకోలేదు. తొలినాళ్ళలో ప్రభుత్వరంగ ఉద్యోగుల భారీ నియామకం వల్ల వ్యవసాయం, వస్తూత్పత్తి పారిశ్రామిక రంగాల అభివృద్ధి క్రమం పెద్దఎత్తున కుంటుపడింది. ఆ తరువాత 1980–2015 కాలంలో ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న 7–8 దేశాల్లో ఒకటిగా నిలిచింది. 1980లలో ప్రారంభమై ఇండియాలో సేవా రంగం– ఐటీ అపార వృద్ధి; అమెరికా, కెనడా, ఆస్ట్రేలియాలకు నైపుణ్యం ఉన్న ఉద్యోగుల వలసలు; మధ్య ఆసియా, ఆగ్నేయాసియా, ఇంగ్లండ్ తదితర దేశాలకు అనిపుణ, అర్ధనిపుణ కార్మికుల వలసల కారణంగా దేశంలోకి విదేశీ మారక ద్రవ్యం ప్రవహించింది. దీంతో దేశీయ కరెన్సీ బలపడి, ఇండియా ఎగుమతులు అంతర్జాతీయ మార్కెట్‌లో ఖరీదైనవిగా మారి, వాటి డిమాండ్ తగ్గడంతో వాణిజ్యం దెబ్బతింది. పర్యవసానంగా వ్యవసాయం, వస్తూత్పత్తి రంగాలు కుదేలై, దిగుమతులు పెరిగాయి. సేవల రంగం, అధిక వేతనాలిచ్చే ప్రభుత్వ రంగాల కారణంగా శ్రమశక్తి వనరుల లభ్యత దేశీయ మార్కెట్‌లో కొరవడింది.

> 'కగార్ యుద్ధం' పర్యవసానంగా దండకారణ్యం సహజవనరులు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌కు అందుబాటులోకి వస్తున్నాయి. వీటి వాణిజ్యం ద్వారా దేశ ఆర్థికవ్యవస్థ వేగంగా వృద్ధి చెంది, అపార సంపదలు సమాజంలోకి ప్రవహిస్తాయన్న పాలకుల స్వప్నం సాకారమవుతుందా?



దాంతో వస్తూత్పత్తి రంగం నష్టదాయకంగా మారడమే కాకుండా, ఉపాధి అవకాశాలు గణనీయంగా సన్నగిల్లాయి.


1990లలో ప్రపంచీకరణ విధానాలను వేగంగా అమలు చేయడం వల్ల దేశంలోకి ప్రత్యక్ష విదేశీ అర్థ మదుపులు(ఎఫ్‌డీఐ), విదేశీ సంస్థాగత మదుపులు, ప్రవాసీలు పంపే ధనం... పర్యవసానంగా విదేశీ మారకద్రవ్య నిల్వలు పెరగడంతో ఇండియా కరెన్సీ విలువ క్షీణత నెమ్మదించింది. దేశంలో అవసరాలకు మించిన కరెన్సీ ఆర్థిక వ్యవస్థలో ప్రవహించడంతో అనేక ప్రతికూల పరిణామాలు చోటుచేసుకున్నాయి. ప్రధానంగా మనది గ్రామీణ వ్యవసాయ ఆధారిత దేశం కావడంతో భారీ స్థాయి ఆర్థిక విధ్వంసక పరిణామాలు చోటుచేసుకోలేదు. అయితే వ్యవసాయం తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోయి రైతులు అధిక సంఖ్యలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. చేతివృత్తులు ధ్వంసం కావడంతో పెద్ద ఎత్తున గ్రామీణ నిరుద్యోగం ప్రబలి, పట్టణాలకు వలసలు కడుతున్నారు. పట్టణాల్లో శ్రామికులు అత్యంత దుర్భరమైన పరిస్థితుల్లో బతుకులీడుస్తున్నారు. దేశ అవసరానికి మించి వివిధ రూపాల్లో ప్రవహించిన విదేశీ మారక ద్రవ్యం, ప్రభుత్వరంగ ఉద్యోగాల గణనీయమైన అభివృద్ధి, ఆ తర్వాత ఐటీ రంగం పెరగడం వల్ల దిగుమతులు విపరీతంగా పెరిగి, స్వదేశీ వస్తూత్పత్తి రంగం కుదేలయింది. దాంతో నిరుద్యోగం పెరిగి, జీవన ప్రమాణాలు దారుణంగా పడిపోయాయి.

ఆర్థిక వ్యవస్థలో ఒక రంగం తీవ్రమైన వృద్ధి రేటు సాధించడం వల్ల వస్తూత్పత్తి, ఎగుమతుల రంగాలు క్షీణించాయి. విదేశీ మారక రేటులో దేశీయ ద్రవ్యం విలువ ప్రపంచ మార్కెట్ అవసరాలకు మించడంతో ఎగుమతులు ప్రియమై పోటీతత్వం సన్నగిల్లింది. దాంతో స్వదేశీ వాణిజ్య శక్తులు లాభదాయక రంగంపై అధికంగా ఆధారపడ్డాయి, ఇతర రంగాలు దెబ్బతిని, ఉద్యోగాలు ఆవిరై కొనుగోలు శక్తి క్షీణించింది. దీన్ని నిలువరించేందుకు వైవిధ్యభరితమైన, సమతుల్యమైన ఆర్థిక విధానాలను ప్రభుత్వాలు రూపొందించాలి. అంతవరకు, ఉత్తర–దక్షిణ భారతం అభివృద్ధి వ్యత్యాసాలు, ఘర్షణలు వంటి ప్రాంతీయ అసమానతలు, అభివృద్ధి రేటు కుంటుపడడం వంటి దుష్పరిణామాలు చోటుచేసుకుంటాయి. ఆర్థిక వ్యవస్థలో ఏర్పడే ఇలాంటి సంక్షోభాన్ని 'డచ్ రోగం' అని పిలుస్తారు. ఇండియాలో ప్రధానంగా ద్రవ్య, ఐటీ తదితర సేవల రంగం పునాదిగా ఈ రోగం ఏర్పడింది. ఇది మొదటిసారిగా 1960లలో ఆయిల్, గ్యాస్ నిల్వలు కనుగొని, వాటి వ్యాపారంపై డచ్ (నెదర్లాండ్స్) దేశ ఆర్థిక వ్యవస్థ మోహరించడం వల్ల మొదట్లో ఆర్థిక ప్రగతికి లాభదాయకంగా ఉన్న ఏక రంగం కేంద్రిత ఆర్థిక విధానం, కరెన్సీ బలపడి డచ్ సరుకులు అంతర్జాతీయ విపణిలో ప్రియమయ్యాయి. ఎగుమతులు దిగనాశిల్లడంతో వస్తూత్పత్తి రంగం కుదేలు కావడం, ఉపాధి ఆవిరవడంతో దేశం త్రీవ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. అప్పటి నుంచి ఈ ఆర్థిక రుగ్మతకు 'డచ్ రోగం' అని పేరొచ్చింది.

నైజీరియా, వెనెజువెలా దేశాల్లో ఆయిల్ వ్యాపారం; ఇండియాలో ఫైనాన్స్, ఐటీ వంటి సేవల రంగాలలో అభివృద్ధి కారణంగా; ఆస్ట్రేలియాలో మైనింగ్ కార్యకలాపాలపై కేంద్రీకరణ; గల్ఫ్ దేశాల్లో ఆయిల్ వాణిజ్య ఆదాయాల కారణంగా ఆ దేశాలు కూడా 'డచ్ రోగం' బారిన పడ్డాయి. 'కగార్ యుద్ధం' పర్యవసానంతో దేశంలో (దక్షిణాపథం దండకారణ్యం) గణనీయమైన స్థాయిలోని సహజ/ శ్రమశక్తి వనరులు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్ రంగాలకు అందుబాటులోకి వస్తున్నాయి. ఇప్పటికే జాతీయ, ప్రపంచ ఆర్థిక సంక్షోభం 2007 నుంచి కొనసాగుతున్న నేపథ్యంలో దాని పరిష్కారంగా మార్కెట్/ కార్పొరేట్ శక్తులు కొత్తగా అందుబాటులోకి వచ్చిన వనరులు లాభదాయకమని భావించి, ఆ రంగం వైపు మదుపులను పెద్దఎత్తున మళ్లిస్తాయి. దాంతో వస్తూత్పత్తి రంగం భయంకరంగా దెబ్బతిని, నిరుద్యోగం ఎక్కువై 'డచ్ రోగం' ఇంకా భీకరంగా ప్రబలేందుకు మావోయిస్టుల నిర్మూలన కార్యక్రమం కూడా దోహదమయ్యే సంభావ్యతను కాదనలేం. సహజ/ శ్రమశక్తి వనరుల వాణిజ్య ఆదాయం విదేశీ మారకద్రవ్యం రూపంలో దేశ ఆర్థిక వ్యవస్థలోకి వచ్చే ప్రవాహం... సహజ వనరుల వాణిజ్య ఆధారిత 'డచ్ రోగం' ఏర్పడేందుకు దారితీసే ప్రమాదం ఉంది. దాంతో ఇప్పటికే ఉన్న ద్రవ్య, ఐటీ తదితర సేవలరంగ డచ్ రోగానికి ఇది జత అయితే, దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదం ఉంది.

■ వెన్నెలకంటి రామారావు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com





అనాటమీ డిసెక్షన్ తిలకిస్తున్న మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యేలు నసీర్, మాధవి

సైన్స్ ఎగ్జిబిషన్ అద్భుతం

- రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్
- సైన్స్‌పై స్ఫూర్తి నింపేలా ఉందని ప్రశంస
- అందరూ తిలకించాలని మంత్రి పిలుపు

6



సిద్ధమైన వేదిక

నేడు నీటి సంఘాల అధ్యక్షుల సదస్సు

- అమరావతిలో సీఎం అధ్యక్షతన సమావేశం
- ఏడు వేల మంది హాజరవుతారని అంచనా

6


పిన్నెల్లి ఘటన యాదృచ్ఛికమే

- ఎస్సీ కమిషన్ ఛైర్‌పర్సన్ కె.జవహర్



4

- రూ.60 కోట్లు ఇవ్వాలని ఆదేశాలిచ్చినా నామమాత్రం
- సీసీఆర్ కార్డుల పంపిణీతో సరిపెట్టిన అధికారులు
- క్షేత్రస్థాయిలో ప్రభుత్వ మార్గదర్శకాల అమల్లో నిర్లక్ష్యం



రుణాలు అందేనా?

కౌలు రైతులపై పీఏసీఎస్‌ల వివక్ష

(మాచర్ల, ఆంధ్రజ్యోతి)

దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న చందంగా కౌలు రైతుల పరిస్థితి మారింది. పీఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు)ల ద్వారా కౌలు రైతులకు రుణాలు అందించే విధంగా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో దాదాపు రూ.60 కోట్ల వరకు కౌలు రైతులకు రుణాలను అందించాలనే సూచన కూడా చేసింది. కానీ ఇప్పటి వరకు పట్టుమని పది కోట్లు కూడా కౌలు రైతులు రుణం అందుకున్న పాపాన పోలేదు. ఈ మొత్తం ప్రక్రియను వ్యవసాయశాఖ, పీఏసీఎస్‌లు సంయుక్తంగా పర్యవేక్షించాలని తెలిపింది. సీసీఆర్‌సీ కార్డుల ద్వారా బ్యాంకర్లు అందించే రుణాలు అంతంతమాత్రంగా ఉంటే, సొసైటీల ద్వారా కౌలు రైతులకు అందించే (మిగతా 6వ పేజీలో)

ప్రక్షాళన సరే.. సేవల మాటేంటి

ప్రభుత్వం కొలువుదీరగానే సహకార సంఘాల ప్రక్షాళనపై దృష్టి సారించింది. గత ప్రభుత్వంలో రాజకీయ సిఫారసులే ప్రామాణికంగా రుణాలు కైంకర్యం చేసి పీఏసీఎస్‌లను కునారిల్లేలా చేశారు. గడచిన ఏడాది కాలంలో పీఏసీఎస్‌ల డేటా మొత్తాన్ని ఆన్‌లైన్ చేసే ప్రక్రియను ప్రభుత్వం చేపట్టి దానిని విజయవంతంగా ముగించింది. ఈ క్రమంలోనే అర్హత లేకపోయినా రుణాలు పొందిన వారిపై ప్రత్యేక దృష్టి సారించి వారికి నోటీసులు కూడా జారీ చేసింది. ఈ అక్రమాలకు సంబంధించి అరెస్టుల పరంపర కూడా కొనసాగుతూనే ఉంది. ప్రక్షాళన విషయంలో ఫలితాలు కనబడుతున్నప్పటికీ రైతులకు అందించే సేవల విషయంలో మాత్రం అదే నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. కౌలు రైతులకు పీఏసీఎస్‌ల ద్వారా అర్హత కలిగిన వారికి రూ.లక్ష వరకు రుణం అందించాలని ఆదేశించినా ఇంతవరకు అవి కనీస స్థాయిలో కూడా అమలు కాకపోవడం సేవల నత్తనడకకు అద్దం పడుతోంది.

ప్రతిష్ఠాత్మకంగా కోటయ్య తిరునాళ్ల

- ఏర్పాట్లకు రూ.30 లక్షలు విడుదల
- భక్తులకు ఉచితంగా లడ్డూ ప్రసాదం
- దేవస్థానం రుణాలు రూ.56.84 లక్షలు రద్దు
- దేవదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి
- నిర్వహణ ఏర్పాట్లపై విస్తృత సమీక్ష..
- వీఐపీ దర్శనం ఉచిత పాసులు రద్దు
- 10 నుంచి ఆన్‌లైన్‌లో రూ.300 టిక్కెట్లు



త్రికోటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మంత్రి గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ కృతికా శుక్లా తదితరులు

రూ 50.84 లక్షలు రుణం రద్దు

గతంలో దేవస్థానం అభివృద్ధికి వివిధ దేవాలయాల నుంచి రూ.70 లక్షలు రుణంగా తీసుకోవడం జరిగిందని, దీనిలో రూ.12 లక్షలు తిరిగి చెల్లించినట్లు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. ఇంకా చెల్లించాల్సిన రూ.50.84 లక్షలకు మినహాయింపు ఇవ్వడం జరిగిందన్నారు. ఆయా దేవాలయాలకు ప్రభుత్వం చెల్లిస్తుందని చెప్పారు. గిరి ప్రదక్షిణ రహదారి నిర్మాణానికి అటవీ శాఖ నుంచి అనుమతులు తీసుకుంటామని చెప్పారు. పాత కోటేశ్వరస్వామి దేవాలయానికి సోపాన మార్గం కూడా నిర్మించనున్నట్లు చెప్పారు. శివరాత్రి ఒక్క రోజు స్వామిని దర్శించుకున్న భక్తులకు లడ్డూ ప్రసాదం ఉచితంగా పంపిణీ చేస్తారని చెప్పారు. విద్యుత్ ప్రభల విషయంలో అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశాల మేరకు పనిచేసి తిరునాళ్లను విజయవంతం చేయాలని ఆనం పిలుపునిచ్చారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే పుల్లారావు, జీవీ ఆంజనేయులు, అరవిందబాబు, బ్రహ్మానందరెడ్డి, కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ బి. కృష్ణారావు

కోటప్పకొండ(నరసరావుపేట), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి పండగ రోజు ఈ నెల 15న కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి తిరునాళ్ల ఏర్పాట్లకు ప్రభుత్వం రూ.30 లక్షలు మంజూరు చేసింది. కోటప్పకొండలో బుధవారం జరిగిన సమావేశంలో తిరునాళ్ల నిర్వహణపై దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమీక్షించారు. భక్తులకు విస్తృతమైన పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని మంత్రులు అధికారులను ఆదేశించారు. ఏటా పంపిణీ చేసే ఉచిత వీఐపీ దర్శనం పాసులను రద్దు చేస్తున్నట్లు అధికారుల ప్రకటించారు. స్వామి దర్శనం చేసుకున్న ప్రతి భక్తునికి ఉచితంగా లడ్డూ ప్రసాదం పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. వీఐపీ దర్శనానికి రూ. 300 టిక్కెట్‌లు విక్రయించాలని నిర్ణయించారు. 10 నుంచి ఆన్‌లైన్‌లో టిక్కెట్ల విక్రయాలు ఉంటాయని, దర్శనం సమయానికి స్లాట్‌లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ట్రాఫిక్, పారిశుధ్యం, తాగునీరు, వైద్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. సమావేశంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ మహాశివరాత్రి ఉత్సవాలు ప్రతిష్ఠాత్మకంగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని తెలిపారు. తిరునాళ్లకు రాష్ట్ర పండుగ హోదా కల్పించిన నేపథ్యంలో ప్రభుత్వం తరపున త్రికోటేశ్వర స్వామికి తిరునాళ్ల రోజున పట్టువస్త్రాలు సమర్పించనున్నామని పేర్కొన్నారు. ఎక్కువగా సామాన్య భక్తులు స్వామిని దర్శించుకునేలా ఏర్పాట్లు ఉంటాయని, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం మహిళలకు కల్పించడంలో మహిళా భక్తుల సంఖ్య ఈసారి పెరుగుతుందని చెప్పారు. గతేడాది 1.20 లక్షల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారని, ఈసారి (మిగతా 6వ పేజీలో)



శంకుస్థాపన ప్రదేశంలో చర్చిస్తున్న సీఎంవో అధికారులు

క్వాంటం వ్యాలీకి 7న శంకుస్థాపన

- ఉద్దండ్రాయునిపాలెం వద్ద భారీగా ఏర్పాట్లు
- హాజరు కానున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

తుళ్లూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలోని ఉద్దండ్రాయునిపాలెంలో 7వ తేదీన క్వాంటంవ్యాలీ శంకుస్థాపన కార్యక్రమానికి ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేయనున్న దృష్ట్యా ఏర్పాట్లను బుధవారం రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి ప్రద్యుమ్న, సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, కలెక్టర్ ఏ.తమీమ్‌అన్సారియా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీఆర్డీఏ అదపు కమిషనర్ భార్గవతేజ, జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, ఆర్‌టీజీఎస్ అధికారులు ప్రఖార్‌జైన్, గీతాంజలిశర్మ, ఆర్డీవో కె.శ్రీనివాసరావు, జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ, తదితరులు పాల్గొన్నారు.

అమరావతిలో ఎస్‌బీఐ భవనానికి శంకుస్థాపన

భూమి పూజ చేసిన ఛైర్మన్ చల్లా శ్రీనివాసులుశెట్టి

మంగళగిరి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్మిస్తున్న లోకల్ హెడ్ ఆఫీస్ (ఎల్‌హెచ్‌ఓ) నూతన భవనానికి బుధవారం శంకుస్థాపన జరిగిం ది. బ్యాంకు ఛైర్మన్ చల్లా శ్రీనివాసులుశెట్టి నూతన భవన నిర్మాణా నికి భూమిపూజ నిర్వహించారు. రాజధానిలో నిర్మించే నూతన భవ నంతో రాష్ట్రంలో నూతన అధ్యాయం మొదలు కాబోతోందని ఈ సం దర్భంగా ఆయన చెప్పారు. ఈ నూతన భవన నిర్మాణం ఎస్‌బీఐ దీర్ఘ దృష్టికి నిదర్శనంగా రాష్ట్ర అభివృద్ధికి దోహదపడేదిగా ఉంటుందన్నారు.

నేటి నుంచి విజ్ఞాన్ మహోత్సవ్
నిరుద్యోగ యువతకు ఉపాధి మార్గం

దూరవిద్య పరీక్ష కేంద్రాలుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు

4

స్వర్ణాంధ్ర లక్ష్యాలు అధిగమించాలి

కలెక్టర్ తమీమ్ అన్సారీయా ఆదేశాలు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్వర్ణాంధ్ర సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు నిర్దేశించిన సూచికలు నూరుశాతం అధిగ మించేలా అన్ని శాఖలు పటిష్ఠ ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవా లని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్వర్ణాంధ్ర సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో కలెక్టర్ సమీక్షించారు. జిల్లా, మండల స్థాయిలో శాఖల వారీగా నిర్దేశించిన లక్ష్యాలకు సంబంధించి అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నెల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను ఖచ్చితంగా అధిగమించేలా అధికారు లు నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో జ్యోతిబసు, సీపీఓ శేషశ్రీ, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం జయలక్ష్మి, డ్వామా పీడీ శంకర్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కోమలి పద్మ, ఆర్ అండ్ బీ డిప్యూటీ ఎస్ఈ హజరతయ్య, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, జిల్లా సహకార శాఖ అధికారి వీరాచారి, జిల్లా పశుసంవర్ధ శాఖ జేడీఏ కేవీవీ సత్యన్నారాయణ, డీపీఓ సాయి కుమార్, మార్కెటింగ్ ఏడీ సత్యనారాయణ చౌదరి , ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్ఈ కల్యాణ చక్రవర్తి, హౌసింగ్ పీడీ ప్రసాదు, ఆర్టీసీ ఆర్ఎం జె.సామ్రాజ్యం, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవీందర్, ఎపీఎంఐపీ పీడీ వజ్రశ్రీ, ఎక్సైజ్ డీసీ అరుణ, ఐసీడీఎస్ పీడీ ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ సర్వేను పరిశీలించిన కలెక్టర్

యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేను కలెక్టర్ అన్సారియా బుధవారం పరిశీలించారు. గుంటూరు పరిధిలోని కేవీపీ కాలనీ రెండో లైన్‌లో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. సర్వే చేస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేను స్వర్ణ వార్డు సచివాలయం సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల పూర్తి వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. సర్వే ద్వారా ఆయా కుటుంబాల అవసరాలు తెలుసుకుని, ఆ మేరకు వాటికి పథకాలు అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ ఉప కమిషనర్ బి. శ్రీనివాసరావు, స్వర్ణ సచివాలయాల సమన్వయకర్త మోహన్‌రెడ్డి, వెల్ఫేర్ సెక్రెటరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



గుంటూరులో జరుగుతున్న ఫ్యామిలీ సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

అద్భుతంగా.. మంత్రుల బంగ్లా

అమరావతిలో శరవేగంగా నిర్మాణాలు

గుంటూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలో మంత్రుల బంగ్లాలు శరవేగంగా నిర్మాణం జరుగుతోన్నాయి. అత్యాధునిక డిజైన్, సమర్థవంతమైన ప్లానింగ్, నాణ్యమైన నిర్మాణానికి ఈ బంగ్లాలు ప్రతీకగా నిలవబోతున్నాయి. రాయపూడి వద్ద నిర్మించిన మోడల్ బంగ్లా చిత్రాన్ని ఏపీసీఆర్‌డీఏ బుధవారం విడుదల చేసింది. జీ+1 నమూనలో ఈ బంగ్లా నిర్మించారు. 7,963 చదరపు అడుగులు బిల్టప్ ఏరియాగా ఉన్నది. సువిశాలమైన పార్కింగ్, పచ్చని సోయగాలతో ఆహ్లాదం కలిగించే లాన్, క్యాంపు ఆఫీసు, సెక్యూరిటీ అవుట్‌పోస్టు, కారు పార్కింగ్ వంటి సదుపాయాలతో నిర్మించారు. మరో 8 బంగ్లాల నిర్మాణాలు కూడా చివరి దశలో ఉన్నట్లు సీఆర్‌డీఏ వర్గాలు తెలిపాయి. రాజధానిలో కీలకమైన ఈ3 - ఈ4 రోడ్డు కారిడార్ల నడుమ ఈ బంగ్లాల నిర్మాణాలు జరుగుతున్నాయి. మొత్తంగా 35 బంగ్లాలను దాదాపు రూ.205 కోట్లకు పైగా వెచ్చించి నిర్మిస్తున్నారు. అంతర్గత రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల పనులు కూడా వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ బంగ్లాలు పూర్తి అయితే మంత్రులు తమ సొంత నియోజకవర్గాలకు వెళితే తప్పితే మిగతా రోజుల్లో ఇక్కడే ప్రజలకు అందుబాటులో ఉంటారు.



రాయపూడి వద్ద నిర్మితమౌతున్న మంత్రుల మోడల్ బంగ్లా

తవ్వుతున్నారు.. తరలిస్తున్నారు..

- మట్టిని అమ్మేసుకుంటున్న సబ్ కాంట్రాక్టర్లు
- రాజధానిలో రెచ్చిపోతున్న మట్టి మాఫియా

తుళ్లూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో గత కొన్ని నెలలుగా అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. అయితే ఈ పనులకు సంబంధించి చేపట్టిన తవ్వకాల్లో పెద్ద ఎత్తున మట్టి, గ్రావెల్, బుసక ఇసుక వస్తోంది. వీటిని కొందరు సబ్ కాంట్రాక్టర్లు అమ్మేసుకుంటున్నారు. నీరుకొండ, శాఖమూరు, పెనుమాక రిజర్వాయర్‌తో పాటు పాలవాగు వెడల్పు చేస్తున్నారు. ఈ తవ్వకాలలో వస్తున్న మట్టి, గ్రావెల్, బుసక ఇసుకను ఆయా పనులు తీసుకున్న సబ్ కాంట్రాక్టర్లు రాత్రిళ్లు అమ్మేసుకుంటున్నారు. పెనుమాక రిజర్వాయర్ తవ్వకంలో ఇటీవల బుసక వెలికితీయగా కొంత అక్కడే డంప్ చేసి, మిగిలిన దాన్ని అమ్మేసుకున్నారని సమాచారం. దొండపాడు సీడ్ రోడ్డు వెంట డంప్ చేస్తున్నారు. అడపాదడపా లారీలను పట్టుకుని పోలీసులు కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారే కానీ కఠిన చర్యలు తీసుకోవడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు. తీసిన మట్టి, గ్రావెల్ ఎంత.. ఇప్పుడు ఎంత ఉందనేది విచారణ చేపడితే అక్రమంగా ఎన్ని వేల లారీలు బయటకు అమ్ముకున్నారో తెలుస్తుందని రైతులు చెప్తున్నారు.

ఆధిపత్య పోరు

రాజధాని అమరావతిలో మట్టి మాఫియా రెచ్చిపోతుంది. అధికార, ప్రతిపక్ష పార్టీకి చెందిన వ్యక్తుల మధ్య అధిపత్య పోరు నెలకొంది. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం ఓ వర్గం మరో వర్గంపై మంగళగిరి మండలం కృష్ణాయపాలెంలో దాడి చేసింది. దీనిపై మంగళగిరి రూరల్, తుళ్లూరు పోలీస్ స్టేషన్లలో ఇరువర్గాలు ఫిర్యాదు చేసుకున్నారు. చివరకు ఈ పంచాయితీ తుళ్లూరు పోలీస్ స్టేషన్‌కు చేరింది. దాడి చేసిన వారిలో తాడేపల్లి మండలానికి చెందిన టీడీపీ, మంగళగిరి మండలానికి చెందిన గతంలో వైసీపీ(ఇప్పుడు టీడీపీ)కి చెందిన వ్యక్తి, తాడేపల్లికి చెందిన టీఎన్‌ఎస్‌ఎఫ్ పదవిలో ఉన్న వ్యక్తి ఉన్నారు.

64లో 35 బార్లకు 144 దరఖాస్తులు

- 122 దరఖాస్తులతో గుంటూరు జిల్లా రికార్డు
- నేడు గుంటూరు, పల్నాడు కలెక్టరేట్లలో లాటరీ ప్రక్రియ

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో మద్యం బార్లకు దరఖాస్తులకు బుధవారం రాత్రితో గడువు ముగిసింది. రాష్ట్రంలో 122 దరఖాస్తులతో గుంటూరు రికార్డు సృష్టించింది. రెండు జిల్లాలలో మొత్తం 64 మద్యం బార్లకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే వీటిలో 35 బార్లకు మాత్రమే వ్యాపారుల నుంచి దరఖాస్తు లు వచ్చాయి. గుంటూరు జిల్లాలో 42 బార్లలో 30కి మాత్రమే వ్యాపారులు దరఖా స్తు చేసేందుకు ముందుకు వచ్చారు. 12 బార్లకు ఎవరూ దరఖా స్తు చేయలేదు. కాగా 30 బార్లకు రాష్ట్రం లో అత్యధికంగా 122 దరఖాస్తులు రావడం విశేషం. పల్నాడు జిల్లాలో 22 బార్లు ఉండగా 5 బార్లకు 22 దరఖాస్తులు వచ్చాయి. 17 బార్లకు దరఖాస్తులు రాలేదు. గుంటూరు జిల్లాలో 30, పల్నాడు జిల్లాలో ఐదు బార్లకు ఆయా జిల్లాల కలెక్టరేట్లలో గురువారం లాటరీ నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు.

నేటి నుంచి విజ్ఞాన్ మహోత్సవ్

● ముఖ్య అతిథిగా ప్లేబ్యాక్ సింగర్ డాక్టర్ కొమండూరి రామాచారి
● పోటీలకు ప్రారంభమైన రిజిస్ట్రేషన్లు



వేడుకలకు సన్నాహాలు చేస్తున్న విద్యార్థులు

గుంటూరు (విద్య) ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో జాతీయస్థాయిలో నిర్వహించనున్న మరో అతిపెద్ద యూత్ ఫెస్టివల్ విజ్ఞాన్ మహోత్సవ్-2026కు సన్నాహాలు పూర్తయ్యాయని ఇన్‌చార్జి వీసీ కేవీ క్రిష్ణకిషోర్ బుధవారం తెలిపారు. గురువారం నుంచి 7వ తేదీ వరకు మూడు రోజులపాటు ఈ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ప్రారంభ వేడుకలకు ఇండియన్ ప్లేబ్యాక్ సింగర్, కంపోజర్, లిటిల్ మ్యూజిషియన్స్ అకాడమీ వ్యవస్థాపకుడు డాక్టర్ కొమండూరి రామాచారి, ముగింపు వేడుకలకు 2025 ఏషియన్ చాంపియన్ గోల్డ్ మెడలిస్ట్, భారత హెప్టాథ్లెట్ నందిని అగసారా ముఖ్య అతిథులుగా విచ్చేస్తారని పేర్కొన్నారు. రెండో రోజు ఇండియన్ ఫిల్మ్ డైరెక్టర్ ప్రదీప్ అద్వైతం, మూడో రోజు ఇండియన్ ఫిల్మ్ యాక్టర్ దీక్షిత్ శెట్టి నందన విచ్చేస్తారని వెల్లడించారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 50 వేల మందికి పైగా విద్యార్థులు తరలివచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. పోటీల విజేతలకు మొత్తం రూ.15 లక్షల బహుమతులు అందజేయనున్నట్టు తెలిపారు. విజ్ఞాన్ యూనివర్సిటీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మహోత్సవంలో 80కు పైగా ఈవెంట్లు నిర్వహించనున్నట్టు చెప్పారు. రిజిస్ట్రార్ పీఎంవీరావు, ఆయా విభాగాల డీన్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

ప్రాథమిక స్థాయిలో గుర్తిస్తే కేన్సర్‌కు చికిత్స



ర్యాలీలో వైద్యులు, నర్సింగ్ విద్యార్థులు

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కేన్సర్ నుంచి రక్షణ కోసం ప్రాథమిక స్థాయి వైద్య సహాయం పొందడానికి అవసరమైన కృషి చేయాలని కాటూరి వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చైతన్య తెలిపారు. ప్రపంచ కేన్సర్ నివారణ దినోత్సవం పురస్కరించుకొని బుధవారం కళాశాలలో జరిగిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. కాటూరి జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ వై కిరణ్‌కుమార్ మాట్లాడుతూ స్ర్కీనింగ్ పరీక్షలతో పలు రకాల కేన్సర్ వ్యాధులను తొలి దశలోనే గుర్తించవచ్చని తెలిపారు. కాటూరి హాస్పిటల్‌లో ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద ఉచితంగా కేన్సర్ వైద్యచికిత్సలు చేస్తున్నట్లు తెలిపారు. సర్జరీ, రేడియోథెరపీ, కీమోథెరపీ తదితర చికిత్సలు అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ చైతన్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఫణీంద్ర, డీన్ డాక్టర్ సీహెచ్ మోహన్‌రావు, అడ్మినిస్ట్రేటర్ అజయ్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ సుగుణకుమారి, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు. రోగులకు, బంధువులకు కేన్సర్ స్ర్కీనింగ్ వైద్యపరీక్షలపై వైద్య విద్యార్థులు అవగాహన కల్పించారు.

జగన్ అధికారం కోల్పోయాక..

ఎక్కడికి వెళ్లినా జంగిల్ రాజ్ అంటున్నాడు

● పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

గుంటూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు జగన్ అధికారం కోల్పోయాక ఎక్కడికి వెళ్లినా జంగిల్ రాజ్, ఆటవిక పాలన అంటున్నాడని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆక్షేపించారు. బుధవారం గుంటూరులోని తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. నిజంగా ఆటవిక పాలన జరిగితే ఆయన గుంటూరు వరకూ రాగలరా.. పర్యటనలు చేయగలరా అని ప్రశ్నించారు. గత వైసీపీ ప్రభుత్వంలో చంద్రబాబు మాచర్లలో బాధిత టీడీపీ కుటుంబాలను పరామర్శించ డానికి బయలు దేరితే ఆయన నివాస గేటుకు తాళ్లు కట్టిన విషయాన్ని గుర్తుచేశారు. టీడీపీ కార్యాలయం మీద గుంటూరు, విజయవాడ గూండాలు దాడి చేస్తే .. కార్యకర్తలకు కోపం వచ్చి చేశారు అని స్వయంగా జగనే అన్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దాడులు చేయొద్దు అని చెప్తే ఆనాడు సమర్థించుకున్న వ్యక్తి జగన్ అని మండిపడ్డారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఫ్యాక్టరీ కుటుంబాలు చనిపోతే కనీసం పట్టించుకోలేదు.. అదీ జంగిల్ రాజ్ అంటేనన్నారు. కేవలం ప్రభుత్వం మీద బురద జల్లడం కోసం మాత్రమే ఇలాంటి వ్యాఖ్యలు జగన్ చేస్తున్నారని దుయ్యబట్టారు. అధికారం పోయినా వైసీపీ వాళ్లకి అహంకారం తగ్గలేదని, కల్తీ నెయ్యి గురించి కూడా దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిట్ రిపోర్ట్‌లో పేజీ నంబరు 35లో యానిమల్ ఫ్యాట్ ఉంది అని స్పష్టంగా ఉందని పునరుద్ఘాటించారు. టీటీడీ నియమనిబంధనలను కూడా వైసీపీ హయాంలోనే మార్చారని, ఆ సమయంలోనే పాలు, వెన్న పని లేకుండా టెస్ట్‌లకు దొరక్కుండా నెయ్యి ఎలా తయారు చేయాలో కనిపెట్టారని ఆరోపించారు. అలాంటి కల్తీ నెయ్యి తయారు చేయడానికి అన్ని పేటెంట్ హక్కులు భూమన, వైవీ సుబ్బారెడ్డికే చెందుతాయన్నారు. టెస్టులలో పది శాతం కంటే తక్కువ ఉంటే అది కనిపించదని, అంతమాత్రాన కొవ్వు కలవలేదని కాదన్నారు. 2019లో జగన్ సీఎం అయ్యాక 2023 వరకు టీటీడీ నెయ్యి టెండర్లు ఇచ్చింది వైసీపీ కాదా అని నిలదీశారు. నభూత ఉన్నవాడ ఎవడూ అంబటి రాంబాబులా మాట్లాడరని, వైసీపీ పార్టీ బూతుల పార్టీలా ఉందన్నారు. ఎక్కువ బూతులు తిట్టినోళ్లకు ఎక్కువ సన్మానాలు జగన్ చేస్తాడని, రాష్ట్రంలో ఒక విష సంస్కృతికి నాంది పలికారన్నారు. అంబటి రాంబాబు కుమార్తెలు ముందే ఇతరుల కుటుంబాల గురించి అలా మాట్లాడొద్దని చెప్పి ఉండాల్సిందన్నారు. ఈ సంఘటనలు జరగడానికి అంబటి రాంబాబే కారణమని, టీడీపీ వాళ్లు ఓ ఫ్లెక్సీ పెట్టుకుంటే అభ్యంతరమేందన్నారు. పోలీసులు ఆ ఫ్లెక్సీ 24 గంటల్లో తీయకపోతే తనే వచ్చి తీస్తానని అంబటి చెప్పి గొట్టలేదా అని ప్రశ్నించారు. టీడీపీ మహిళ నేతల్ని వెంట పడి తరిమారని ఆయన నిలదీశారు. కల్తీ నెయ్యి మీద వేసిన సిట్ ఫైనాన్షియల్ ట్రయిల్ మీద దృష్టి పెట్టారు తప్పితే లోతైన విచారణ ఇంకా చేయలేదన్నారు. దీనిపై మరింత లోతైన విచారణ చేయాలని తాము కోరుతున్నామన్నారు. మాస్క్ అడిగినందుకు ఓ డాక్టర్‌ను నడిరోడ్డు మీద అవమానించి హింసించి ప్రాణాలు కోల్పోయే విధంగా చేయలేదా.. అని ధూళిపాళ్ల నిలదీశారు. ఇప్పుడు స్వేచ్ఛగా రోడ్ల మీద తిరగనిస్తుంటే తమను జంగిల్ రాజ్ అంటారానని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు సుకవాసి శ్రీనివాసరావు, పులివర్తి అజార్ పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం 541.80 అడుగులు

విజయపురిసౌత్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం బుధవారం నాటికి 541.80 అడుగులు ఉంది. ఇది 192.09 టీఎంసీలకు సమానం. మొత్తం ఔట్‌ఫ్లో 18375 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు ఇన్‌ఫ్లో 6752 క్యూసెక్కులు చేరుతోంది.

మహాశివరాత్రికి విస్తృత ఏర్పాట్లు చేయాలి

● దేవదాయశాఖ ఆర్‌జేసీ చంద్రశేఖర ఆజాద్



ఏర్పాట్లపై చర్చిస్తున్న ఆర్‌జేసీ ఆజాద్

పెదకాకాని, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివ రాత్రి ఏర్పాట్ల ను విస్తృతంగా చేపట్టాలని దేవదాయ శాఖ ఆర్‌జేసీ చంద్రశేఖర ఆజాద్ తెలిపారు. బుధవారం ఆలయాన్ని ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్‌తో కలిసి ఆయన సందర్శించారు. క్యూలైన్లను పరిశీలిం చారు. మహా శివరాత్రి తెల్లవారుజామున 3 గంటల నుంచి సాధారణ దర్శనాలు ప్రారంభం కావాలని, వీఐపీ దర్శనానికి తగు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

దూరవిద్య పరీక్ష కేంద్రాలుగా

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు

● ఆచార్య రామచంద్రన్

ఏఎన్‌యూ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్రవిశ్వవిద్యాలయం తరహాలో మున్ముందు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నిర్వహించే దూరవిద్య పరీక్షలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలను పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేసే యోచనలో ఉన్నట్లు ఏఎన్‌యూ దూరవిద్య పరీక్షల సమన్వయకర్త ఆచార్య డి.రామచంద్రన్ బుధవారం తెలిపారు. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారుల ఆమోదానికి పంపుతానని చెప్పారు. ప్రస్తుతం దూరవిద్య రెండో విడత పరీక్షలు సజావుగా జరుగుతున్నాయన్నారు. గుంటూరు నగరంలోని గోరంట్లలోని ఓ కేంద్రంలో పరీక్షల నిర్వహణపై బుధవారం ప్రత్యేక బృందంతో తనిఖీ చేయించినట్లు చెప్పారు. నిబంధనల పాటిస్తున్నట్లు తేలిందన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి మార్గం

● ఉచిత శిక్షణ ● చిరు వ్యాపారాల వృద్ధికి తోడ్పాటు

తుళ్లూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఏపీ నైపుణ్యాభివృద్ధి, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు భవన నిర్మాణ రంగంలో స్వల్ప వ్యవధి ఉచిత శిక్షణ, ఉపాధి కల్పిస్తున్నట్లు సీఆర్డీఏ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నాక్) 18 నుంచి 35 ఏళ్లలోపు వారికి అమరావతిలో 45 నుంచి 60 రోజులు శిక్షణ అందిస్తుందని చెప్పారు. ఇతర వివరాలకు 91001 07699, 99662 30506 , 81213 06680 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు. అలాగే డిజిటల్ నైపుణ్యాలతో వ్యాపారవేత్తలకు సాధికారత కార్యక్రమం ఎస్‌ఆర్‌ఎం వర్సిటీలో నిర్వహిస్నుట్లు పేర్కొన్నారు. 5 రోజుల మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమ లక్ష్యం విద్యార్హతలు లేకపోయినా మొబైల్, సోషల్ మీడియా ద్వారా చిరు వ్యాపారులు తమ వ్యాపారాలను ధైర్యంగా అభివృద్ధి చేసుకునేలా చేయడమన్నారు. ఈ నెల 17 నుంచి 21 విజయవాడలోని ఎస్‌ఆర్‌ఎం వర్సిటీలో శిక్షణ ఉంటుందని తెలిపారు. నమోదు, వివరాల కోసం 76720 62003, 9000 827670 సంప్రదించాలన్నారు. కాగా, ఏపీ సీఆర్డీఏ సౌజన్యంతో ఈ నెలలో 4 రకాల ఉచిత శిక్షణ, ఉపాధి కల్పన కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఆసక్తి కల అభ్యర్థులు తమకు నచ్చిన శిక్షణలో చేరవచ్చని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయం తెలిపింది. పూర్తి వివరాలకు రాజధాని ప్రాంత వాసులు తమ గ్రామంలోని సీఆర్డీఏ ఫెసిలిటేటర్‌ను అలాగే ఇతర ప్రాంతాలవారు సీఆర్డీఏ లైవ్‌లీహుడ్ స్పెషలిస్ట్ శంకర్‌ను 98484 24207 నంబరుకు సంప్రదించవచ్చని తెలిపింది.


పిన్నెల్లి ఘటన రెండు కుటుంబాలది

● రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.జవహర్

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఇటీవల పల్నాడు జిల్లా మాచవరం మండలం పిన్నెల్లి గ్రామంలో చోటుచేసుకున్న మంద సాల్మన్ మృతి ఘటన కేవలం రెండు కుటుంబాల మధ్య వివాదమే కానీ, రాజకీయ పరమైనది కాదని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.జవహర్ స్పష్టం చేశారు. బుధవారం పట్టణంలో ఎస్సీ హక్కులపై వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. పిన్నెల్లిలో మందా సాల్మన్ మృతి బాధాకరమన్నారు. సాల్మన్ కుటుంబానికి ఆర్థిక సాయంపై అధికారులకు సిఫారసు చేస్తామన్నారు. పిన్నెల్లి తరహా ఘటనలు పునరావృతం కాకుండా ఆరు సూచనలు చేశామని తెలిపారు. ఈ ఘటన కేవలం యాదృచ్ఛికమే కానీ ఉద్దేశపూర్వకంగా జరిగిన ఘటనకాదన్నారు. పిన్నెల్లిని ఎస్సీ సెన్సిటివ్ గ్రామంగా ప్రకటించడం, శాశ్వత పికెటింగ్, ఎస్సీ కుటుంబాలకు భద్రత, గ్రామ శాంతి కమిటీలు, పిన్నెల్లి తరహా గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు, ఎస్సీలకు పౌర హక్కులు, అట్రాసిటీ చట్టంపై అవగాహన కల్పించాలని సూచించినట్లు చెప్పారు. తొలుత పిన్నెల్లి ఘటనపై అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ కృష్ణారావు, డీఆర్వో నారదముని, ఆర్డీవో మురళీకృష్ణ, కమిషన్ సభ్యులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌కు ఎస్‌బీఐ చేయూత

● కార్డియాలజీ విభాగానికి రూ.4.12 కోట్ల పరికరాలు



డాక్టర్ శ్రీకాంత్‌కు చెక్‌ను అందజేస్తున్న ఎస్‌బీఐ ప్రతినిధులు

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ బ్యాంకింగ్ సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి (జీజీహెచ్)కి చేయూతనందించింది. కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద ఆసుపత్రి కార్డియాలజీ విభాగానికి బుధవారం రూ.4.12 కోట్ల విలువైన వైద్య పరికరాలు అందజేసేందుకు ఆమోదం తెలిపింది. ఆసుపత్రి కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎన్ శ్రీకాంత్‌కు ఎస్‌బీఐ ముంబై హెడ్ ఆఫీస్ ప్రతినిధుల ద్వారా సీఎస్ఆర్ బహూకరణను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి ద్వారా అందజేశారు. రాంకీ ఎన్జీవో ద్వారా జీజీహెచ్‌కు ఈ వైద్య పరికరాలు అందజేస్తామని ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణ యశస్వి.. వైద్య పరికరాలు అందజేసేందుకు సహకరించిన ఎస్‌బీఐ జీజీహెచ్ బ్రాంచ్ మేనేజర్ జి.విజయసింహ, ఇతర అధికారులకు అభినందనలు తెలిపారు.

ప్రపంచ పర్యాటక కేంద్రంగా కొండవీడు అభివృద్ధి

● ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలనలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి



ఉత్సవాల ఏర్పాట్లను ఎమ్మెల్యే ప్రత్తిపాటికి వివరిస్తున్న డీఎఫ్‌వో కృష్ణప్రియ

యడ్లపాడు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): చారిత్రక నేపథ్యం కలిగిన కొండవీడు కోటను ప్రపంచ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అన్ని విధాలా కృషిచేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఈ నెల 7, 8 తేదీల్లో జరగనున్న కొండవీడు ఉత్సవాల ఏర్పాట్లను అధికారులతో కలసి ఆయన బుధవారం సందర్శించారు. కొండ దిగువన ఏర్పాటు చేస్తున్న సభాస్థలి, పార్కింగ్, హెలీపాడ్ ప్రాంతాలను, కొండపైన ఏర్పాట్లను పరిశీలించి, విలేకరులతో మాట్లాడారు. 1,231 హెక్టార్ల సువిశాల ప్రాంతంలో కొండవీడుకోట విస్తరించి ఉందని, సీఆర్డీఏ పరిధిలో ఉన్న ఈ ప్రాంతం ఎంతో ప్రత్యేకమైనదన్నారు. ఈ ప్రాంత విశిష్టత భావితరాలకు తెలియజేసేందుకు ఈ ఉత్సవాలు దోహదపడతాయన్నారు. అంబరాన్నంటేలే సాంస్కృతిక, క్రీడా, సాహస కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హెలీరైడ్, బోటింగ్, హార్స్ రైడింగ్, ట్రెక్కింగ్ వంటి సాహస కృత్యాలతోపాటు, శాండ్ ఆర్ట్, ఫ్లవర్ షో, విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామన్నారు. 6న లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. చౌడవరం వైపు నుంచి కొండవీడుకోట ఘాట్‌రోడ్డును అనుసంధానిస్తూ 5 కిలోమీటర్ల టన్నెల్ మార్గాన్ని 2019లో సీఎం చంద్రబాబు ప్రకటించారన్నారు. కొండపైన నిలిచిపోయిన శివాలయం, మసీదు పునర్నిర్మాణం త్వరలోనే చేపడతామన్నారు. చెంఘీజ్‌ఖాన్‌పేట వెన్నముద్దల బాలకృష్ణుడు విగ్రహాన్ని చూసి ఇస్కాన్ వారు ఆలయం నిర్మించేందుకు ముందుకు వచ్చారని, వారికి 71 ఏకరాలు కేటాయించడం జరిగిందన్నారు. గురువారం కర్టెన్ రైజర్‌గా చిలకలూరిపేటలో 2కే రన్ కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆర్డీవో మధులత, డీఎఫ్‌వో కృష్ణప్రియ, టీడీపీ మండల అధ్యక్షుడు సాయిబాబు, నాయకులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.05 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	147 , 156, 167
చికెన్ విత్ స్కిన్(కిలో)	284.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	294.00

మిర్చియార్డు సమాచారం

(బుధవారం ధరలు)

వచ్చిన బస్తాలు	96,415
అమ్మకాలు	94,351
నిల్వ	22,466

నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	13500	23000
నెంబరు. 5	13500	23000
273	----	----
341	14000	26000
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13000	20500
షార్క్-1	-----	----
బ్యాడిగి	14000	25000
దేవనూరు డీలక్స్	15500	27000
ఆర్మూరు	12500	17500
ఏసీ కామన్ వెరైటీ		
334	13500	21500
నెంబరు. 5	13000	21500
273	----	----
341	14000	22500
4884	----	----
సూపర్ 10	----	----
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13000	19000
బ్యాడిగి 355	14000	23500
దేవనూరు డీలక్స్	----	
తాలుకాయలు	7200	12000

గురువులను గౌరవించడం అందరి బాధ్యత

● తిరుపతి కలెక్టర్, లొయోలా పూర్వ విద్యార్థి ఎన్.వెంకటేశ్వర్



క్రీడలను ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, కరస్పాండెంట్ డాక్టర్ పి.ఆంటోని

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదిగేందుకు కృషి చేస్తున్న గురువులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని తిరుపతి జిల్లా కలెక్టర్ ఎన్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. గుంటూరులోని నల్లపాడు లొయోలా పబ్లిక్ పాఠశాలలో బుధవారం అండర్-17, 18, 19 విభాగాల్లో క్రీడా వేడుకలు ఘనంగా జరిగాయి. పోటీలను పాఠశాల కరస్పాండెంట్, సుపరీయర్ రెవరెండ్ ఫాదర్ డాక్టర్ పి.ఆంటోనితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్ మాట్లాడుతూ ఎంత ఎత్తుకు ఎదిగినా తల్లిదండ్రులను, గురువులను మరిచిపోవద్దని సూచించారు. మాతృభూమి, పుట్టిన ప్రాంతాన్ని గుర్తుంచుకోవాలన్నారు. చదువుతో పాటు క్రీడలలో ప్రావీణ్యం సాధించాలన్నారు. తను పాఠశాల పూర్వ విద్యార్థి అని, క్రీడల్లో అనేక బహుమతులు సాధించానని గుర్తుచేసుకున్నారు. చదువుకున్న పాఠశాలకు ముఖ్య అతిథిగా రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఆయన అభినందించారు. విద్యార్థులు ప్రదర్శించిన సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ రెవరెండ్ ఫాదర్‌లు డాక్టర్ సగాయరాజ్ మార్క్, జోసఫ్ రాజ్, ఫాదర్ నరేష్, అరవింద్, పీఈటీ బాపూజీ పాల్గొన్నారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



మిర్చియార్డు వైస్ చైర్మన్ మల్లికను అభినందిస్తున్న ఎమ్మెల్యే నసీర్

మిర్చి రైతులకు భరోసా కల్పించడమే లక్ష్యం కావాలి

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మిర్చి యార్డుకు వచ్చే రైతులకు అండగా నిలుస్తూ, భరోసా కల్పించడమే లక్ష్యం కావాలని తూర్పు ఎమ్మెల్యే నసీర్ సూచించారు. మిర్చి యార్డు వైస్ చైర్మన్‌గా ఇటీవల నియమితులైన బిట్రగుంట్ల మల్లిక బుధవారం తూర్పు కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, తనపై నమ్మకం ఉంచి మిర్చి యార్డు వైస్ చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ మిర్చి యార్డు అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం ముందుండాలన్నారు. యార్డు పరిధిలో సౌకర్యాల కల్పనకు ప్రణాళికా బద్ధంగా పని చేయాలన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో ఉద్యోగులకు కేటాయింపులు జరగాలి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న అసెంబ్లీలో ప్రవేశపెడుతున్న రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన బకా యిలు, ఇతర ఆర్థిక ప్రయోజనాలకు కేటాయింపులు జరగాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘ నాయకులు కోరారు. బడ్జెట్‌లో ప్రాధాన్యం కల్పించాలని కోరుతూ బుధవారం నగర పశ్చిమ, పొన్నూరు ఎమ్మెల్యేలు గల్లా మాధవి, ధూళిపాళ్ల నరేంద్రకుమార్, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నంకు వారు వినతి పత్రాలను అందజేశారు. సంఘ జిల్లా అధ్యక్షుడు టీవీ రామిరెడ్డి మాట్లాడుతూ ముగ్గురు సభ్యుల వేతన సవరణ కమిషన్ ఏర్పా టుతో పాటు, పెండింగ్ డీఏలు, మధ్యంతర భృతి తదితర ఆర్థికపరమైన అంశాల్లో కేటాయింపులు జరగాలని కోరారు. సమస్యలను శాసనసభలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తామని ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చినట్టు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి వై నాగేశ్వరరావు, లక్ష్మీ నారాయణ, కోటేశ్వరరావు, వజ్జా పెద్దరత్తయ్య, శోభన్‌బాబు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేత

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్, శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం, అన్నమయ్య కళావేదికపై బుధవారం రామకుమారి జ్ఞాపకార్థం పచ్చిపులుసు రాఘవరావు కుటుంబ సభ్యులు పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేసే కార్యక్రమం నిర్వహించారు. దేవస్థాన సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రముఖ ప్రవచనకర్త నోరి నారాయణమూర్తి పాదుకా పట్టాభిషేకంపై ప్రవచనం చేశారు. ఈ కార్యక్రమంలో రవి, సతీష్ దుర్గావాణి, శంకర్ ప్రభావతి, లిఖిత, హేష్మ సాయి, రిత్విక్, గాయత్రి, సునీత, ఆదినారాయణ, ఆర్య రివాన్ పాల్గొన్నారు.

మిర్చి యార్డు డైరెక్టర్‌కు అభినందనలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మిర్చి యార్డు డైరెక్టర్‌గా నూతనంగా నియమితులైన గుంటూరు టీడీపీ పార్లమెంటరీ కోశాధికారి కొనగళ్ల సత్యనారాయణను బుధవారం వాసవీ క్లబ్, గుంటూరు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు రాయవరపు అశోక్‌కుమార్ మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి, మిర్చి రైతుల అభ్యున్నతికి సేవలను మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పెరుమాళ్ళ సుబ్రమణ్యం, అమరా రమేష్ పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో నగర యువకుడి ప్రతిభ

గుంటూరు విద్య ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ యూనివర్సిటీ సెంట్రల్ జోన్ పరిధిలో జరిగిన బాడీ బిల్డింగ్ పోటీల్లో గుంటూరుకు చెందిన ఆంధ్ర జిమ్ యువకుడు నూర్‌బాషా ఆశిక్ ప్రతిభ కనపరిచి మొదటి స్థానంలో నిలిచాడు. చీరాలలో నిర్వహించిన పోటీల్లో ఆశిక్ 60 కేజీల విభాగంలో ప్రతిభ కనబరిచాడు. ఆశిక్ మిట్టపల్లి ఇంజనీరింగ్ కళాశా లలో బీటెక్ చదువుతున్నాడు.

వ్యవసాయ ఉత్పత్తులపై అవగాహన

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అనుబంధ ఉత్పత్తులపై అవ గాహన, శిక్షణ కార్యక్రమం డీఆర్డీఏ, వెలుగు, గుంటూరు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాధర విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో లైవ్‌లిహుడ్స్ డీపీఎం టి.అశోక్‌కుమార్, నాగేంద్ర, జనార్ధనరావు, సరళ, యు.వీరశేఖర్, శ్రీనివాసరావు, లీడ్ బ్యాంకు మేనేజర్ మహిపాల్ రెడ్డి, పావని జ్యోతి, పాల్గొన్నారు. 17 మండలాల అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్లు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఉత్సాహంగా పూర్ణ కాలేజ్ పూర్వ విద్యార్థుల సమావేశం

గుంటూరు (విద్య) ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): గుంటూరులో 1966లో గింజుపల్లి పూర్ణచంద్రరావు స్థాపించిన పూర్ణ కాలేజీలో 1970 సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక బుధవారం నగరంలో నిర్వహించారు. వారంతా ఆ కాలేజీలో తమ తీపి జ్ఞాపకా లను, చిలిపి పనులను నెమరు వేసుకొని సంతోషంగా గడిపారు. సుమారు 55 మంది పూర్వ విద్యార్థులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని గింజుపల్లి సాంబశివ రావు, డాక్టర్ గింజుపల్లి సుధాకర్, నర్రా శివకుమారి తదితరులు నిర్వహించారు. సమావేశంలో జేకేసీ కళాశాల ప్రిన్సిపాల్ గోపీచంద్, రత్నకుమారి, పట్టాభి, ఒంటెద్దు జనార్దన రెడ్డి, రవి ప్రసాద్, చెన్నకేశవరావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల చేయూత

గుంటూరు (విద్య) ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు పూర్వ విద్యార్థులు తమ వంతు ఆర్థిక చేయూత అందించారు. ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ పి.విజయ తల్లి పి.తులసమ్మ రూ.2 లక్షలు, కళాశాల పూర్వ విద్యార్థి, ప్రిన్సిపాల్ ఆర్జేడీగా పనిచేసిన బసవ పున్నమ్మ రూ.లక్ష అందజేశారు. సందర్భంగా ప్రిన్సిపాల్ వీఆర్ జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు చేయుట అభినందనీయమని అన్నారు.



పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి ఆహ్వానం మేరకు బుధవారం ఆమె నివాసానికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ విచ్చేశారు. ఆయనకు ఎమ్మెల్యే గళ్లా మాధవి, రామచంద్రరావు దంపతులు, ఎమ్మెల్యే నసీర్, టీడీపీ నేతలు ఘన స్వాగతం పలికారు. గళ్లా మాధవి దంపతులు ఆయనను దుశ్శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. పశ్చిమ నియోజకవర్గంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, ఇతర సెంటర్లలో వైద్య సదుపాయాలను మెరుగుపరచాలని ఎమ్మెల్యే గళ్లా మాధవి ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్‌ను కోరారు. ఆయన సానుకూలంగా స్పందించారు. **- గుంటూరు.**

పీకలవాగును సమగ్రంగా సర్వే చేయండి

● కమిషనర్‌ను కోరిన ఎమ్మెల్యే గళ్లా మాధవి



పీకలవాగు గురించి కమిషనర్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు(కార్పొరేషన్), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో మురుగు పారుదలకు కీలకమైన పీకలవాగుని సమగ్రంగా సర్వే చేయాలని కమిషనర్ కే మయూర్ అశోక్‌ని పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి కోరారు. దీంతో సమగ్ర నివేదిక ఇవ్వాలని సిటి ప్లానర్‌ని, పూడికతీతకు ప్రతిపాదనలు అందించాలని ఎస్‌ఈని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. బుధవారం ఎమ్మెల్యే మాధవి, కమిషనర్ కలసి బ్రాడీ పేట, కంకరగుంట ఆర్యూబీ, కోబాల్ట్‌పేట, దేవాపురం ప్రాంతాల్లో పీకలవాగుని పరిశీలిం చారు. నగరపాలక సంస్థ అధికారులు సమన్వయంతో సమస్యను శాశ్వత ప్రాతిపదికన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మాధవి కోరారు. పీకలవాగుని సమగ్రంగా సర్వే చేసి, పూర్తి స్థాయి వివరాలు అందించాలని సిటి ప్లానర్‌ని కమిషనర్ ఆదేశించారు. పర్యటనలో సీపీ రాంబాబు, ఎస్‌ఈ వెంకటేశ్వరరావు, ఈఈ వేణు, ప్రజారోగ్య, ఇంజ నీరింగ్, పట్టణ ప్రణా ళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

గుంటూరును జీవీబీ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దాలి : కమిషనర్

గుంటూరు(కార్పొరేషన్), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరాన్ని గార్బేజ్ వల్న ర్బుల్ పాయింట్స్ (జీవీబీ) ఫ్రీ నగరంగా తీర్చిదిద్దుకోవాలని, ట్రేడ్ లైసెన్స్ ఫీజుల నూరు శాతం వసూళ్లు కావాలని, ప్రజారోగ్య అధికారులు, కార్యదర్శులు పనితీరు మెరుగుపరుచు కోకుంటే కఠిన చర్యలు తప్పవని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ స్పష్టం చేశారు. బుధవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రజారోగ్య విభాగ అధికారు లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నూరుశాతం ఇంటింటి చెత్త, కమర్షియల్ చెత్త సేకరణ ఏజన్సీలు సక్రమంగా ఉంటే జీవీబీలు ఉండవ న్నారు. అప్పటికీ చెత్త రోడ్ల మీద, డ్రైన్లలో వేసే వారిపై అపరాధ రుసుం విధించాలన్నారు. ఈ సమావేశంలో సీఎంవోహెచ్ డాక్టర్ శాంతికళ, ఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మీనారాయణ, వీఏఎస్ డాక్టర్ నాగేశ్వరరావు, డీఎస్‌వో ప్రసాద్, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు, లోకేశ్‌లను దూషించడం దుర్మార్గం : పోసాని

గుంటూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): అహర్నిశలు రాష్ట్ర భవిష్యత్తు కోసం కృషి చేస్తు న్న ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌లను దూషించడం దుర్మార్గమని టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు పోసాని వెంకటేశ్వర్లు అన్నారు. టీడీపీ లీగల్ సెల్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు చుక్కపల్లి రమేష్ అధ్యక్షతన బుధవారం పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన లీగల్ సెల్ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభు త్వం ఏర్పడిన తర్వాత 19 నెలల కాలంలో రాష్ట్రంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. వైసీపీ నాయకులు, మాజీ మంత్రులు పనిగట్టుకొని ముఖ్యమంత్రిని, మంత్రులను దూషిస్తున్నారన్నారు. అంబటి, జోగి రమేశ్‌ల వ్యాఖ్యలను లీగల్ సెల్ తరుపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. చుక్కపల్లి రమేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు మీద అంబటి చేసిన అనుచిత వ్యాఖ్యలు హేయమని అన్నారు. కల్తీ నెయ్యి విషయాన్ని కప్పిపుచ్చుకునేందుకే ఇలా రోజుకొక నాయకుడు నీచమైన మాటలు మాట్లాడుతున్నారన్నారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవికి, కేసులు నమోదైన నాయకులకు, కార్యకర్తలకు జిల్లా లీగల్ సెల్ అండగా ఉండి పోరాడుతుందని తెలిపారు. సమావేశంలో శ్రీరామ్ రాజీవ్ ఆనంద్, కట్టా కాళిదాస్, ఏమినేటి లక్ష్మి శైలజ, కాలే దేవదాస్, పప్పుల దేవదాస్, ముత్తినేని శివలీల, నర్మదా, నరేంద్ర బాబు, మహతి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న టీడీపీ లీగల్ సెల్ నేతలు

పటిష్ట చట్టాలతోనే న్యాయవాదులకు భద్రత : రాజారాం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పటిష్ట చట్టాలతో న్యాయ వాదులకు, వారి కుటుంబసభ్యులకు భద్రత ఏర్పడుతుందని ఆంధ్ర లాయర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంవీ రాజారాం అన్నారు. స్థానిక అరండల్‌పేట హోటల్‌లో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో మేనిఫెస్టో, ప్రమాణ పత్రాలను తన మద్దతుదారులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. రాజారాం మాట్లాడుతూ భారత రాజ్యాంగం ద్వారా లభించిన పౌర హక్కుల్లో న్యాయవాదుల భద్రత నానాటికి రక్షణ లేకుండాపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కఠిన చట్టాలతోనే దాడులను అరికట్టవచ్చని అన్నారు. దీర్ఘకాలిక భద్రత, భవిష్యత్తు, సంక్షేమం కోసం ప్రభుత్వం పరంగా రాష్ట్ర న్యాయవాదుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈసారి జరిగే బార్ కౌన్సిల్‌లో పోటీ చేస్తున్నానని, న్యాయవాదుల సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మేడా శ్రీనివాస్, అవధానుల హరి, నాగరాజు, నడింపల్లి గురుదత్, సాయి పాల్గొన్నారు.

సహకరించే వరకు.. ఆందోళన విరమించం : మొవ్వా

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల ఉద్యోగుల దీర్ఘకాల సమస్యలను పరిష్కరించే వరకు నిరసనల్లోనే ఉంటామని రాష్ట్ర వ్యవసాయ, సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్‌ల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మొవ్వా వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ ఉద్యోగులు చేపట్టిన దశల వారీ ఆందోళనల్లో భాగంగా స్థానిక శ్యామలనగర్‌లోని సహకార కార్యాలయం ఎదుట ఉద్యోగులు చేపట్టిన నిరసనలు బుధవారం నాటికి ఏడో రోజుకు చేరుకున్నాయి. ఆయన మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించని ఎడల 12వ తేదీ వరకు వంట-వార్పు, 13న కార్యాలయాల ముట్టడి, అప్పటికీ పరిష్కరించని నేపథ్యంలో సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. ఈ నిరసనల్లో తోటా వెంకట్రామయ్య, కొల్లి సత్యనారాయణ, శ్రీకాకుళం, పశ్చిమగోదావరి నాయకులు పాపినాయుడు, మెండ సత్యానారాయణ, విజయ్‌భాస్కర్, కృష్ణశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

8న త్రిపురనేనిరామస్వామి చౌదరి పురస్కార ప్రదాన సభ

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడీపేట, సీపీఎం కార్యాలయంలో ఈ నెల 8న కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి పురస్కార ప్రదాన సభ జరుగుతుందని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. బుధవారం బ్రాడీపేట, యూటీఎఫ్ హాల్లో బుధవారం జరిగిన కార్యక్రమంలో పురస్కార ప్రదానసభ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ - జాషువా-పూలే - పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి పురస్కారాలను విశ్రాంత డీజీపీ, రచయిత ఏబీ వెంకటేశ్వరరావు, కవి, రచయిత్రి, నాగార్జున యూనివర్సిటీ బుద్దిస్ట్ విభాగాధిపతి ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణిలకు అందజేస్తు న్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్, కె.జయసుధ, బి.విల్సన్ పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై మరిన్ని ఆందోళనలు అవసరం

● కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఏఐకేఎస్ జాతీయ రైతు సభల్లో ప్రవేశపెట్టిన తీర్మానాల మేరకు రైతుల సమస్యలపై మరిన్ని ఆందోళ నలు అవసరమని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక బ్రాడీపేట, సీపీఎం కార్యాలయంలో బుధవారం జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేసిన రైతు, ప్రజాసంఘాల నాయకుల అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమంలో రైతులను భాగ స్వామ్యం చేయాలన్నారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్ మాట్లాడుతూ జాతీయ కౌన్సిల్ సభలకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వి.కృష్ణయ్య, కే అజయ్‌కుమార్, ఎన్ వేణుగోపాలరావు, భారతి, సురేష్, పాశం రామారావు, నేతాజీ, ఈమని అప్పారావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానం పునర్నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం

గుంటూరు(కార్పొరేషన్), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గుంటూరు పట్టణం లాలాపేట లోని పురాతనమైన శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణానికి విరాళాలు ఇచ్చేం దుకు దాతలు ముందుకు రావాలని ఆలయ ఏసీ టి.సుభద్ర కోరారు. బుధవారం దేవస్థా నం పునర్నిర్మాణంలో భాగంగా నూతన ధ్వజస్తంభానికి గుంటూరు ఏటీ అగ్రహారం వాస్తవ్యులు మద్ది నందకిషోర్, సౌమ్యశ్రీ దంపతులులు రూ.5,01,116 లను విరాళంగా ఆలయ ఏసీకి అందజేసినట్లు ఆమె తెలిపారు.



జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయలక్ష్మిని సన్మానిస్తున్న హెల్త్ అసిస్టెంట్లు

పురుష ఆరోగ్య కార్యకర్తల పునర్ నియామకం

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జీవో 1207కు చెందిన పురుష ఆరోగ్య కార్యకర్తల విషయంలో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కీలక పరిణామం చోటుచేసుకుంది. 2024 డిసెంబరులో తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకున్నారు. డైరెక్టర్ ఆఫ్ హెల్త్ అనుమతితో మొత్తం 40మంది పురుష ఆరోగ్య కార్యకర్తలను తిరిగి విధుల్లోకి తీసుకుం టూ గుంటూరు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి నియామక పత్రాలు బుధవారం అందజేశారు. ఈనెల ఒకటవ తేదీ నుంచి వారు తిరిగి విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం తొలగించిన హెల్త్ అసిస్టెంట్ల జీవితాల్లో వెలుగులు నింపిందని అంబటి రఘుబాబు, అంకయ్య, సీహెచ్ సుబ్బారెడ్డి, వై.రామకృష్ణప్రసాద్ అన్నారు. ఈ ప్రక్రియలో సహకరించిన అధికారులను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

దరఖాస్తులకు గడువు పెంపు..

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ గుంటూరు పరిధిలోని పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేసేందుకు అరు లైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించే గడువును పొడిగించినట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కే. విజయలక్ష్మి తెలిపారు. ఈనెల 10వ తేదీ వరకు పొడిగించినట్లు ఆమె స్పష్టం చేశారు.

అంబటి రాంబాబు మంత్రినా!

గుంటూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అంబటి రాంబాబు మంత్రి అని మాట్లాడి వైసీపీ అధ్యక్షుడు జగన్ నవ్వులు పాలయ్యారు. బుధవారం సాయంత్రం గుంటూరులోని అంబటి రాంబాబు నివాసంలో ఆయన కుటుంబాన్ని పరామర్శించడానికి వచ్చిన జగన్ ఒకటికి రెండుసార్లు అంబటి రాంబాబుని మంత్రి అని సంబోధించడం అందర్నీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఆయన మాజీ మంత్రి అన్న విషయాన్ని కూడా జగన్ విస్మరించి మాట్లాడటం చూసి వైసీపీ నాయకులు, కార్యకర్తలే ఆశ్చర్యపోయారు. అంబటి గొప్పగా బతికాడు. కాపు కులంలో నిజంగా గర్వంగా చెబుతున్నా. ఆయనొక టైగర్, గొప్పగా బతికాడు. విలువ ఉన్న వ్యక్తి, విలువలతో బతికాడన్నారు. అలాంటి అంబటిని తప్పుడు కేసులో అన్యాయంగా అరెస్టు చేయడమే కాకుండా శారీరకంగా సీఐలు వంశీ, ఇంకొకడు వెంకటేశ్వర్లు హింసించారంటూ తూలనాడారు. అంబటిని హత్య చేయడానికి టీడీపీ నాయకులు ప్రయత్నించారని ఆరోపిస్తూ కాపు సామాజికవర్గం సానుభూతి పొందేందుకు జగన్ మాట్లాడారు. ఎల్లకాలం ఈ ప్రభుత్వం ఉండదు. బీహార్‌లో ఏమి జరుగుతుందో తెలియదు. ఇక్కడ మాత్రం జంగిల్ రాజ్ సృష్టించి పాలిస్తున్నారు. మూడేళ్ల తర్వాత వచ్చేది మా ప్రభుత్వమేనని ప్రతీ ఒక్కడికి చెబుతున్నా. చంద్రబాబు, ఆయన కొడుక్కి, ఆయనకు కొమ్ము కాస్తోన్న ఇలాంటి పోలీసు అధికారులకు కూడా చెబుతున్నా.. ఎల్లకాలం ఇలా చేస్తామంటే కుదరదు. వడ్డీతో సహా చెల్లిస్తామన్నారు.

బడ్జెట్‌పై యువతకు అవగాహన అవసరం



మాట్లాడుతున్న జయప్రకాష్ నారాయణ

గుంటూరు (విద్య) ఫిబ్రవరి 4 (ఆంధ్ర జ్యోతి): దేశ బడ్జెట్‌పై యువతకు అవగా హన అవసరమని, మానవ జీవిత గమనంలో బడ్జెట్ చాలా కీలకంగా ఉంటుందని బీజేపీ అధికార ప్రతినిధి వి.జయప్రకాష్ నారాయణ అన్నారు. టీజేపీఎస్ కళాశాలలో డిగ్రీ, పీజీ వాణిజ్య విభాగాల ఆధ్వర్యంలో బుధవారం యూనియన్ బడ్జెట్‌పై నిర్వ హించిన అవగా హన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కళా శాల ప్రిన్సిపాల్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి, చార్టెడ్ అకౌంటెడ్ హరనాథ్ బాబు, కళాశాల కార్యదర్శి కేవీ బ్రహ్మం, పీజీ ప్రిన్సిపాల్ ఎస్ అనితాదేవి, డిగ్రి, పీజీ వాణిజ్య విభాగశాఖాదిపతులు ఎస్ శ్రీనివాసరావు, జి.సురేష్ కుమార్, ఎంబీఏ, బీబీఏ విభాగ శాఖాధిపతి రవికుమార్ పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై విద్యార్థినులకు అవగాహన అవసరం

గుంటూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ వెంగళరావునగర్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం పి.రమేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డైటీషి యన్ డాక్టర్ రాజవరపు బిక్షపతి విద్యార్థులకు క్యాన్సర్ అంటే ఏమిటి, దాని లక్షణాలు, ఎలా తగ్గించుకోవచ్చు, బాలికలు, స్త్రీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సహృదయ సేవా సంస్థ అధ్యక్షుడు శుద్ధపల్లి రవీంద్ర, సభ్యుడు డేవిడ్ కలిసి క్యాన్సర్‌పై అవగాహన వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ హెచ్‌ఎం కే ప్రమీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

గుంటూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక లాలాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని బారాయిమాం పంజా సెంటర్లో పట్టపగలు తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బారా ఇమామ్ పంజా సెంటర్‌కి చెందిన రాజేశ్వరి చౌత్రా సెంటర్లో ఫ్యాన్సీ షాపు నిర్వహిస్తుంటుంది. ఆమె భర్త అగ్నిమాపక శాఖలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం అందరూ ఎవరు పనికి వారు వెళ్లిపోగా ఇంటి మెయిన్ డోర్ తాళాలను గుమ్మం పక్కనే పెట్టారు. ఇది గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు తాళాలతో మెయిన్ డోర్ తెరుచుకుని లోనికి వెళ్లి బీరువాలోని బంగారు, వెండి ఆభరణాలు, కొంత నగదు అపహరించుకుపోయారు. సాయంత్రం వచ్చిన కుటుంబసభ్యులు తాళం తెరిచి ఉండడం గమనించి ఇంట్లోకి వెళ్లి చూడగా రూ.మూడు లక్షల ఖరీదైన సొత్తు చోరీకి గురైనట్టు బాధితురాలు రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు లాలాపేట పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. సీసీటీవీ పుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు.

దాడుల సంస్కృతికి శ్రీకారం చుట్టింది జగన్ రెడ్డే

● కనపర్తి శ్రీనివాసరావు



కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో దాడుల సంస్కృతికి శ్రీకారం చుట్టింది జగన్ రెడ్డేనని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. గుంటూరులోని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు నోటి దూల కారణంగానే టీడీపీ కార్య కర్తలు రెచ్చిపోయారని అన్నారు. డీజీపీ కార్యాలయం పక్కనే ఉన్న టీడీపీ రాష్ట్ర కార్యాలయంపై ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, దేవినేని అవినాశ్, ఎంపీ నందిగం సురేశ్ తదితర నేతలంతా రాడ్లు, కర్రలు, రాళ్లతో దాడిచేసి వ్యక్తులను తీవ్రంగా గాయ పరచడంతో పాటు, ప్రతిపక్షనేత చంద్రబాబు ఇంటిపై ఎమ్మెల్యే జోగి రమేష్ దాడికి ప్రయత్నించిన రోజున జగన్‌రెడ్డి వారిని ఎందుకు వారించలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని నిలదీశారు. రాజకీయాల్లో దాడుల సంస్కృతికి శ్రీకారం చుట్టింది జగన్‌రెడ్డేనని మండిపడ్డారు. దమ్ముంటే నన్ను అరెస్టు చేయండి, రెడ్ బుక్కుకు నా కుక్క కూడా భయపడదని పదే పదే టీడీపీ కార్యకర్తలను అంబటి రెచ్చగొట్టడంతో ఫలితం అనుభవించాల్సి వచ్చిందని అన్నారు. జగన్ హయాంలో పసిపిల్లల పాలు దగ్గర నుంచి, పేదలు తాగే మద్యం వరకు అన్నీ కల్తీయేనని విమర్శించారు. అవినీతి సొమ్ముతో బలిసిపోయిన అంబటి కాపు కులస్తులను బహిరంగంగా తీవ్రంగా దూషించిన ఆయన మూడురోజుల నుంచి కాపు నాయకుడు ఎలా అయ్యాడో, దీని వెనుకున్న ఆంతర్యం ఏమిటో జగన్‌రెడ్డి విష పత్రికకే తెలియాలని అన్నారు. వేలాది మంది టీడీపీ కార్యకర్తల్లో ఆగ్రహం పెల్లుబుకినా అంబటి ఇంటి వద్ద పోలీసులు కఠినంగా వ్యవహరించారు కాబట్టే అంబటికి, ఆయన కుటుంబసభ్యులకు, వైసీపీ కార్యకర్తలకు ఒక్క గాయం కూడా కాలేదని అన్నారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, బీసీ వర్గానికి చెందిన ఎమ్మెల్యే గళ్లా మాధవిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే మళ్ళీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని కనపర్తి హెచ్చరించారు.

అంబటి సంస్కారి అంటూ కుసంస్కారి జగన్ కితాబు

● మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): అంబటి రాంబాబు సంస్కారవంతుడని కుసంస్కారి అయిన జగన్ కితాబివ్వడం హాస్యాస్పదంగా ఉందని ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ ఎద్దేవా చేశారు. గుంటూరులోని తన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ నాయకుడు జగన్మోహన్‌రెడ్డి పరా మర్శకు రావాలంటే బెట్టింగ్ కింగ్ అయినా అయి ఉండాలి, లేదంటే గంజాయి స్మగ్లర్ అయినా అయి ఉండాలి, లేదా జనం ఛీ కొట్టే బూతు చరిత్ర ఉన్నవాడైనా అయి ఉండా లని ఎద్దేవా చేశారు. అలాంటి బూతు చరిత్ర ఉన్న అంబటి రాంబాబుకు సంస్కారవంతుడని కుసంస్కారి అయిన జగన్ సర్టిఫికెట్ ఇవ్వడం అతనిలోని జంగిల్‌రాజ్ మనస్తత్వాన్ని మరోసారి బయటపెట్టుకున్నట్లు అయిందని అన్నారు. రాజకీయ ప్రత్యర్థులను హతమార్చడం, అడ్డొచ్చిన వారిని భౌతికంగా తొలగించే సంస్కృతికి రాష్ట్రంలో తొలిసారిగా బీజం వేసింది వైఎస్ కుటుంబమేనని ఆరోపించారు. నాడు రాజారెడ్డి, నిన్న రాజశేఖర్‌రెడ్డి, నేడు జగన్ రెడ్డి వరకు అదే విధమైన అరాచక పాలన కొనసాగుతోందని ఆయన విమర్శించారు. జగన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి చేసింది ఎవరు? ప్రశ్నించిన పట్టాభిపై దాడులు జరగలేదా? అంగళ్లలో చంద్రబాబుపై దాడి చేయించింది మీరు కాదా జగన్‌రెడ్డి అని నిలదీశారు. జెడ్ ప్లస్ భద్రత ఉన్న చంద్ర బాబుపై కూడా దాడికి పాల్పడిన విషయం ప్రజలు మర్చిపోలేదని, నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రలో అడుగడుగునా వేధింపులకు గురి చేసిన విషయాన్ని ఎవరూ మర్చిపోలేదన్నారు. రాజకీయాల్లో కుటుంబాలను, కులాలను లాగకూడదని, సిద్ధాంత పరమైన వైరం మాత్రమే ఉండాలని, మహిళలను దూషించినా, శాంతిభద్రతలకు విఘా తం కలిగించినా కూటమి ప్రభుత్వం ఉపేక్షించదని మన్నవ మోహనకృష్ణ హెచ్చరించారు.

లడ్డూ కల్తీ అంశాన్ని పక్కదారి పట్టించడానికే జగన్ కుట్రలు

● దాసరి రాజామాస్టారు



దాసరి రాజామాస్టారు

గుంటూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ అంశాన్ని పక్కదారి పట్టించాలనే దురుద్దేశంతోనే వైసీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి గుంటూరులో అంబటి రాంబాబు నివాసానికి వచ్చారని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వహక కార్యదర్శి దాసరి రాజామాష్టారు ఘాటుగా విమర్శించారు. ఆ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కోట్లాది హిందువుల మనోభావాలకు సంబంధించిన అత్యంత సున్ని తమైన తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారి లడ్డూ ప్రసాదం కల్తీ వ్యవహారంపై దేశ వ్యాప్తంగా భక్తుల్లో ఆగ్రహం వెల్లువెత్తుతున్న వేళ, నిజాలను ఎదుర్కొనే ధైర్యం లేక జగన్ కావాలనే రాజకీయ డ్రామాలు సృష్టిస్తూ శాంతి భద్రతల సమస్యలకు తెరలేపుతున్నారని ఆయన మండిపడ్డారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకు, హిందూ ధర్మంపై జరిగిన ఘోర అవమానాన్ని కప్పిపుచ్చేందుకు జగన్ ఇలాంటి చీప్ రాజకీయాలకు పాల్పడుతున్నారని దాసరి రాజామాష్టారు ఆరోపించారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు తిరుమల పవిత్రతను కాపాడడంలో ఘోరంగా విఫలమైన జగన్, ఇప్పుడు బాధ్యత నుంచి తప్పించు కోవడానికి డ్రామాలు ఆడుతున్నారని రాజా మాస్టారు విమర్శించారు.

అహల్య హాస్పిటల్‌లో కేన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భం గా కొత్తపేటలోని అహల్య హాస్పిటల్‌లో ప్రముఖ వైద్యనిపుణులు డాక్టర్ శనక్కాయల రాజకుమారి ఆధ్వర్యంలో మహిళలకు రొమ్ము కేన్సర్, గర్భాశయ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. కేన్సర్ రహిత ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధిద్దాం అనే నినాదంతో ఏర్పాటు చేసిన ఈ కేన్సర్ స్క్రీనింగ్ శిబిరంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. వైద్యపరీ క్షల అనంతరం కేన్సర్ వ్యాధుల అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శనక్కాయల రాజకుమారి, పలు రకాల కే న్సర్ జబ్బుల నివారణకు పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలను వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్యశాఖ రాష్ట్ర డైరెక్టర్ పద్మావతితో పాటు పలువురు వైద్యనిపుణులు పాల్గొన్నారు.



కేన్సర్ వైద్యశిబిరంలో డాక్టర్ శనక్కాయల రాజకుమారి

రాష్ట్రంలో యాదవ భవనాన్ని ఏర్పాటు చేయాలి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యాదవ సామాజిక వర్గానికి ప్రత్యేకంగా భవనాన్ని, విద్యార్థులకు వసతి గృహాలను ఏర్పాటు చేయాలని అఖిలభారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చింకా నారాయణరావు యాదవ్ డిమాండ్ చేశారు. స్థానిక అమరావతి రోడ్డులోని సంఘ కార్యాలయంలో బుధవారం రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వ హించారు. తొలుత యాదవ మహాసభ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా నగరానికి చెందిన దుగ్గని సూర్యనారాయణ యాదవ్‌కు నియా మక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు పెద్దిబోయిన శ్రీనివాస్ యాదవ్, బొడ్డు పైడిరాజు యాదవ్, యర్రాకుల శ్రీనివాసరావు యాదవ్, ఆలా అనంత రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్ఠాత్మకంగా కోటయ్య తిరునాళ్ల

(3వ పేజీ తరువాయి)

ఆ సంఖ్య గణనీయంగా పెరుగుతుందన్నారు. కొండ కింద నుంచి కేవలం బస్సుల్లోనే భక్తులు కొండపైకి రావాలని, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ సజావుగా నిర్వహించాలన్నారు.

నేనే 4.30 గంటలు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయా

తాను గతేడాది తిరునాళ్లలో 4.30 గంటల పాటు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయానని మంత్రి ఆనం గుర్తుచేశారు. అత్యవసర వైద్య సేవలు, క్యూలైన్లలో భక్తులకు తాగునీరు, మజ్జిగతో పాటు పిల్లలకు పాలు, బిస్కెట్‌లు పంపిణీ చేయాలని సూచించారు. తోపులాటలు, తొక్కిసలాటకు తావు లేకుండా పటిష్ఠమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కొండకు వచ్చే రహదారులకు మరమ్మతులు చేపట్టాలని, తిరునాళ్ల ఏర్పాట్లకు రూ. 30 లక్షలు నిధులు గురువారం విడుదల చేస్తున్నట్లు చెప్పారు. గతేడాది రూ.1.76 కోట్లు దేవస్థానానికి తిరునాళ్ల ఆదాయం వచ్చిందన్న మంత్రి.. దీనిలో రూ.50.55 లక్షలు ఖర్చయ్యాయని తెలిపారు. రూ. 1.20 కోట్లు ఆదాయం నిల్వ ఉందని, వార్షిక ఆదాయం రూ.9.38 కోట్లు ఉన్నట్లు చెప్పారు. రూ.8.32 కోట్లు ఫిక్సిడ్ డిపాజిట్లు, అన్నదానానికి భక్తుల విరాళాలు రూ.2.88 కోట్లు బ్యాంకులో డిపాజిట్ చేసి.. వచ్చే వడ్డీతో భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు మంత్రి ఆనం చెప్పారు. కోటప్పకొండలో మిగిలిపోయిన అభివృద్ధి పనులను ప్రభుత్వం చేస్తుందని ఆయన చెప్పారు.

మంత్రి గొట్టిపాటిరవికుమార్ మాట్లాడుతూ శాంతి భద్రతలు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. కొండలోని క్వారీ నిర్వాహకులతో చర్చించి మజ్జిగ ప్యాకెట్‌లు ఇచ్చేలా చర్యలు తీసుకుంటానన్నారు. ప్రభలు వచ్చే సమయంలో హెచ్‌టీ లైన్ విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరగుతుందన్నారు. విద్యుత్‌శాఖ సీఎండీ కొండకు వచ్చి విద్యుత్ పనులను పరిశీలిస్తారన్నారు. కొండ ప్రాంతమంతా విద్యుత్ దీపాలు వెలుగులు ఉంటాయని చెప్పారు.

కోటప్పకొండ తిరునాళ్లకు ఇంకా నిధులు విడుదల చేయాలని ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు కోరారు. కొండవీడుకు, కోటపకొండకు పొంతన లేదన్నారు. భారీ విద్యుత్ ప్రభలు చిలకలూరిపేట నుంచే వస్తాయన్నారు. కోటప్పకొండ దిగువన రియల్ వెంచర్ల వల్ల.. భవిష్యత్‌లో ప్రభలు నిలిపివేసే అవకాశం ఉండదన్నారు. కొండలో రియల్ ప్లాట్లకు అనుమతులు నిలిపివేయాలని కోరారు.

దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, కలెక్టర్ కృతికా శుక్లా, ఛీప్‌విప్ జీవీ ఆంజనేయులు, ఎస్పీ బి.కృష్ణారావు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, ఆలయ ట్రస్టీ రామకృష్ణ కొండలరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశికుమార్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ వందనాదేవి, జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, ఈవో డి.చంద్రశేఖరరావు, ఆర్డీవో మధులత పాల్గొన్నారు.

రుణాలు అందేనా?

(3వ పేజీ తరువాయి)

రుణాలు పట్టించుకునే నాధుడే కరువయ్యారు. ఈ రుణానికి కూడా సీసీఆర్‌సీ కార్డునే ప్రామాణికంగా తీసుకోగా ఇప్పటి వరకు కనీసం వందల సంఖ్యలో కూడా పీఏసీఎస్‌ల ద్వారా రుణాలు అందలేదని తెలుస్తోంది. ఈ మొత్తం ప్రక్రియను పర్యవేక్షించాల్సిన పీఏసీఎస్‌ల సిబ్బంది నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ ప్రభుత్వ సంకల్పానికి తూట్లు పొడిచే విధంగా వ్యవహరిస్తున్నారు. కౌలు రైతులకు రుణాల విషయంలో వ్యవసాయశాఖ వద్ద సరైన సమాచారం లేకపోగా వ్యవస్థలు పరస్పర నిందారోపణలకు దిగడం పరిపాటిగా మారింది

భారీగా సీసీఆర్‌సీ కార్డు లక్ష్యాలు..

బాపట్ల జిల్లాలో లక్ష కార్డులను కౌలు రైతులకు అందించాలనే లక్ష్యం పెట్టుకోగా 80 శాతం మేర యంత్రాంగం చేరుకుంది. గుంటూరు జిల్లాలో 55,000, పల్నాడు జిల్లాలో 68,000 సీసీఆర్‌సీ కార్డులు అందించాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఇందులో దాదాపు 75 శాతం లక్ష్యాలు చేరుకున్నట్లు వ్యవసాయశాఖ చెబుతోంది. మూడు జిల్లాల పరిధిలో జరిగే సేద్యం వాటాలో 70 శాతం కౌలు రైతులదే. ఇందులో సీసీఆర్‌సీ కార్డు పొందేది చాలా తక్కువ మంది. మళ్లీ ఇందులో బ్యాంకు రుణాలు అందుకునే వారి సంఖ్య మరీ తీసికట్టుగా ఉంటోంది.

సాధ్యమైనంత ఎక్కువ మంది కౌలు రైతులకు తక్కువ వడ్డీ రుణ ఫలాలు అందించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం పీఏసీఎస్‌లలో కౌలు రైతులకు కూడా చోటు కల్పించాలనే ఆదేశాలను జారీ చేసింది. బాపట్ల జిల్లాలో 112 పీఏసీఎస్‌లు, ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చూస్తే వీటి సంఖ్య 167గా ఉంది. వీటి పరిధిలో సీసీఆర్‌సీ కార్డులు ప్రామాణికంగా కౌలు రైతులకు రూ.లక్ష వరకు రుణం అందించాలని ప్రభుత్వం నిర్దేశించింది. పీఏసీఎస్‌ల రుణాల సంగతి అటుంచితే బ్యాం కులు అందించే రుణాలపై కూడా మానిటరింగ్ కరువవుతోంది.

నేడు నీటి సంఘాల అధ్యక్షుల సదస్సు

- రాజధాని అమరావతిలో సీఎం అధ్యక్షతన సమావేశం
- ఏర్పాట్లు పూర్తి

తుళ్లూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సాగు నీటి సంఘాల అధ్యక్షులతో గురువారం సదస్సును నిర్వహించటానికి అధికారులు అన్ని ఏర్పాటు పూర్తి చేశారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవానాల నుంచి హైకోర్టుకెళ్లే మార్గంలో పరేడ్ గ్రౌండ్‌లో ఈ వేదికను సిద్ధం చేశారు. మధ్యాహ్నం భోజనానంతరం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ సదస్సు జరగనుంది. అందుకు కావాల్సిన ఏర్పాట్లు అధికారులు పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 6 వేల మంది సాగు నీటి సంఘాల అధ్యక్షులు సదస్సుకు హాజరు కానున్నారు. అధికారులు, సాగు నీటి సంఘాల సభ్యులు కలిపి 12 వేల మంది వరకు ఉంటారని అంచనా వేశారు. అందుకు తగ్గట్టుగా కావాల్సిన భోజన సదుపాయలు సిద్ధం చేస్తున్నారు. ప్రధాన వేదిక దక్షణ భాగంలో భోజనశాలను ఏర్పాటు చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు స్టేజీ మీద నడుచుకుంటూ వచ్చి మీటింగ్ చెప్పటాకి 150 అడుగుల ర్యాంప్‌ను ఏర్పాటు చేశారు. సదస్సుకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, డీఎస్పీ మురళీ కృష్ణ, ఇతర జిల్లా, సీఆర్డీఏ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఏర్పాట్లపై అధికారులతో బుధవారం కలెక్టర్ సమావేశం నిర్వహించారు.



ఏర్పాట్లపై అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ అన్సారియా. చిత్రంలో ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ తదితరులు

సైన్స్ ఎగ్జిబిషన్ అద్భుతం

- రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్
- సైన్స్‌పై స్ఫూర్తి నింపేలా ఉందని ప్రశంస
- అందరూ తిలకించాలని మంత్రి పిలుపు



గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 4 (ఆంధ్ర జ్యోతి): వైద్య రంగం పట్ల, వ్యక్తిగత ఆరోగ్య సంరక్షణ పట్ల పరిపూర్ణమైన అవగాహన కల్పించేలా గుంటూరు వైద్య కళాశాలలో మెడి కల్ ఎగ్జిబిషన్‌ను అద్భుతంగా ఏర్పాటు చేశారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కితాబిచ్చారు. బుధవారం వైద్య కళాశాలలో మెడికల్ ఎగ్జిబిషన్ మెడ్‌ఫ్యూజన్ 26ను మంత్రి ప్రారంభించారు. అలాగే ప్రదర్శనలో వివిధ స్టాల్స్‌ను గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్, పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి ప్రారంభించారు. అనంతరం అనా టమీ విభాగం, ఫార్మకాలజీ విభాగాల్లో ఏర్పాటు చేసిన పలు స్టాల్స్‌ను మంత్రి, ఎమ్మెల్యేలు తిల కించారు. ఎగ్జిబిషన్‌ను చక్కగా ఏర్పాటు చేశారని జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారీని, ఇతర వైద్య విభాగాధిపతులకు మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ విలేకరులతో మాట్లాడుతూ, కళాశాలలు, ఉన్నత పాఠశాలల విద్యార్థులందరూ తప్పనిసరిగా ఈ మెడికల్ ఎగ్జిబిషన్‌ను తిలకించాలని కోరారు. గుండె, మెదడు, కాలేయం వంటి పలు నిజమైన మానవ అవయవాలను ప్రదర్శ నలో ఉంచారని, వీటిని తిలకించాలని సూచించారు. ఆసియా ఖండంలోనే అతిపెద్ద పెథాలజీ స్పెసిమన్ మ్యూజియం గుంటూ రు వైద్య కళాశాలలో ఉందని, ఇందులో నిజమైన స్పెసిమన్లను ప్రజలు తిలకించే అవకాశం ఈ మెడికల్ ఎగ్జిబిషన్ ద్వారా వచ్చిందని ఆయన వివరించారు. ఈ ప్రదర్శన తిలకించిన తర్వాత చాలా మంది పిల్లలు వైద్య విద్యను అభ్యసించేందుకు ఆసక్తి చూపు తారని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు.



● ఆరోగ్య సంరక్షణకు అత్యంత ప్రాధాన్యం

కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్య సంరక్షణకు అత్యంత ప్రాధా న్యమిస్తోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. కేన్సర్ వ్యాధుల నియంత్రణకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపతోం దన్నారు. ఎన్‌సీడీ 4.0లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో పలు రకాల కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, అనుమానిత కేసులకు ప్రతి మంగళ, గురువారాల్లో వైద్య బోధన ఆసుపత్రుల్లో తదుపరి వైద్యపరీక్షలు చేయిస్తున్నామని తెలిపారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనకు ప్రభుత్వం చేస్తున్న ప్రయతాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ మాట్లాడుతూ, మూడు దశాబ్దాల తర్వాత జీఎంసీలో ఏర్పాటు చేసిన మెడికల్ ఎగ్జిబిషన్ ఎంతో గొప్పగా ఉందన్నారు. ప్రజలంతా దీనిని తిలకించాలని కోరారు. ఈ కళాశాల పూర్వ విద్యార్థులు అందిస్తున్న సేవలు వెల కట్టలేనివన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు గుంటూరు వైద్య కళాశాలలోని మెడికల్ ఎగ్జిబిషన్‌ను తిలకించేలా విద్యాశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరానని తెలి పారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారీ, వైస్‌ప్రిన్సి పాళ్లు డాక్టర్ బి.శ్రీధర్, డాక్టర్ డి.మాధవి, డీఎంహెచ్‌వో డాక్టర్ కె.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. గురువారం నుంచి సందర్శకులను అనుమతిస్తున్నట్లు కళాశాల అధికారవర్గాలు తెలిపాయి. గురువారం మూడు వేల మంది సందర్శకులు వస్తారని వైద్యాధికారులు భావిస్తున్నారు.





ఎగ్జిబిషన్‌లో వివిధ ప్రదర్శనలు

చిత్రజ్యోతి

SINCE 1965

వేసవి బరిలో 'పెద్ది'




రామ్‌చరణ్ హీరోగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'పెద్ది' విడుదల తేదీ ఖరారైంది. తొలుత ఈ చిత్రాన్ని మార్చి 27న విడుదల చేయాలని భావించినప్పటికీ, వేసవి సెలవులను దృష్టిలో ఉంచుకొని ఏప్రిల్ 30న గ్రాండ్‌గా ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

మాస్‌లుక్‌లో: రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో రామ్‌చరణ్ మునుపెన్నడూ లేని విధంగా మాస్ లుక్‌లో కనిపిస్తున్నారు. పొడవైన జుట్టు, గడ్డం, ముక్కు పుడకతో గంబీరంగా కనిపించారు. చుట్టూ అలసిపోయి, వేదనతో ఉన్న జన సమూహం మధ్య నుంచి చరణ్ నడిచొస్తున్న తీరు సినిమాలో ఉండబోయే బలమైన ఎమోషన్‌ను సూచిస్తోంది. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఏ. ఆర్ రెహమాన్. జాన్వీకపూర్ కథానాయిక.

విడుదల తేదీ ఖరారు!

పవన్‌కల్యాణ్ అభిమానులు, ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్న 'ఉస్తాద్ భగత్‌సింగ్' చిత్రం విడుదల తేదీ ఖరారు అయింది. మార్చి 26న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాతలు నవీన్ యర్నేని, రవిశంకర్ యలమంచిలి చెప్పారు. హరీశ్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. పవన్‌కల్యాణ్ అభిమానులకు ప్రత్యేక విందుగా నిలవడంతో పాటు అన్ని వయసుల వారినీ అలరించేలా వినోదభరితంగా దర్శకుడు హరిశ్‌శంకర్ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు. అభిమాని నుంచి దర్శకుడిగా మారిన హరీశ్ శంకర్ పవన్ కల్యాణ్‌తో రూపొందించిన 'గబ్బర్ సింగ్' చిత్రం ఎంతటి సంచలనం సృష్టించిందో తెలిసిందే. ఇప్పుడు 'ఉస్తాద్ భగత్‌సింగ్' అంతకు మించి ఉండేలా హరీశ్ కృషి చేస్తున్నారు. శ్రీలీల, రాశీ ఖన్నా, పార్దిపన్, కె.ఎస్. రవికుమార్, ఎల్.బి. శ్రీరామ్, రావు రమేశ్, రాంకీ తదితరులు ఈ చిత్రంలో నటించారు.



'వారణాసి'లో ఆ సన్నివేశాలకు థ్రిల్ అవుతారు

రాజమౌళి

మహేశ్‌బాబు కథానాయకుడిగా ఎస్.ఎస్ రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న 'వారణాసి' సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 7న విడుదలవుతున్న సంగతి తెలిసిందే. ప్రేక్షకుల ముందుకు రావడానికి ఇంకా 14 నెలల సమయం ఉన్నప్పటికీ ఈ చిత్రంపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న అంచనాలను పెంచడానికి ఇప్పటి నుంచే ప్రచారపర్వాన్ని ఆరంభించారు మేకర్స్. కేవలం ప్రచారం కోసమే దాదాపు రూ.100 కోట్ల దాకా ఖర్చు చేయనున్నట్లు సమాచారం. తాజాగా హాలీవుడ్ మీడియాకు 'వారణాసి' గురించి చిత్ర బృందం విడివిడిగా చెప్పిన విశేషాలివి.



రెండు కాదు... ఒకటే సినిమా

- 'వారణాసి' చిత్రం నిడివి మూడు గంటలా 20 నిమిషాలు. ఎక్కడా బోర్ కొట్టకుండా ప్రతీ క్షణం ఆసక్తికరంగా.. కొత్త అనుభూతినిచ్చేలా తీర్చిదిద్దుతున్నాం.
- హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూన్ తెరకెక్కించిన 'అవతార్'తో నా సినిమాను పోల్చడం గౌరవంగా భావిస్తున్నాను. కానీ నన్ను ఆయనతో పోల్చవద్దని నా మనవి. ఎందుకంటే ఆయన ఒక శిఖరం. నేను ఇంకా విద్యార్థినే.
- ఈ చిత్రంలోని కథాంశం ఒక ప్రపంచం నుంచి మరో ప్రపంచానికి మారుతుంటుంది. మన పురాణాలలో ఎప్పటినుంచో ఉన్న అంశాలే ఇవి. ఈ కథలన్నీ మన రక్తంలో ప్రవహించేవే. భావోద్వేగాల్ని బ్లైండ్ చేయడం సులభమైన విషయమే. కానీ ఇలాంటి పురాణ అంశాలను డీల్ చేసేటప్పుడు ప్రేక్షకులు నాపై పెట్టుకున్న అంచనాలను అందుకోవడమే కష్టమైన పని. వారణాసిలో 25 నిమిషాలు మన ఇతిహాసాలపై సన్నివేశాలుంటాయి. ప్రేక్షకులు ఆ సన్నివేశాలు చూసి థ్రిల్ అవుతారు.
- ఈ సినిమాకు ప్రియాంకను కథానాయికగా తీసుకుందామని అనుకున్నప్పుడు.. 'కొన్నేళ్లుగా ఆమె భారతీయ సినిమాలకు దూరంగా ఉన్నారు. ఇప్పుడు ఈ సినిమాలోని మందాకిని పాత్రను సునాయాసంగా పోషించగలదా అని సందేహించాను. కానీ షూట్‌లో తొలి రోజే తన నటనతో ఆమె నన్ను ఆశ్చర్యపరిచింది'.
- దేశంలో సరిపడనన్ని ఐమ్యాక్స్ తెరలు లేకపోవడం ఈ సినిమా విషయంలో నాకు ఎదురైన అతి పెద్ద సవాళ్లలో ఒకటి. అమెరికాలో 400 ఐమ్యాక్స్ తెరలుంటే, భారత్‌లో కేవలం 35 మాత్రమే ఉన్నాయి. ఈ సినిమా విడుదలయ్యే నాటికి వీలైనన్ని ఐమాక్స్ తెరలు భారత్‌లో ఏర్పాటు చేయండి అని లాస్ ఏంజిల్స్‌లోని ఐమ్యాక్స్ కార్యాలయం దగ్గర ధర్నా చేస్తా (నవ్వుతూ).
- 'వారణాసి' చిత్రం రెండు భాగాలుగా విడుదల కావడంలేదు. అందరితో చర్చించిన తర్వాత మొత్తం ఒకటే భాగంగా విడుదల చేస్తున్నాం.

\- రాజమౌళి

ఆ రెండు షాట్స్ కోసమే ఆరు నెలలు

- రాజమౌళి నాతో ఓ సినిమా చేయాలని ప్లాన్ చేస్తున్న సమయంలో నన్ను కలిశారు. అప్పటికి 'వారణాసి' కథను ఆయన చెప్పలేదు. కానీ ఎలాంటి సినిమా చేద్దాం అని అడిగేవారు. రాజమౌళి నన్ను కలసి వెళ్లిన తర్వాత 'మీతో సినిమా చేస్తున్నందుకు ఆనందంగా ఉంది. మీరు మీ సినిమాలో కథానాయకుల్ని చూపించే తీరు నాకు చాలా ఇష్టం. మీకు వారంటే ఎంతో ప్రేమ కదా' అని ఆయనకు మెసేజ్ చేశాను. 'కృతజ్ఞతలు. కానీ నాకు నా ప్రతినాయకులంటే మరింత ఇష్టం' అని బదులిచ్చారు. 'వారణాసి'లో నా లుక్స్ కోసం ఎన్నో రిహార్సల్స్ చేశాం. 2024 నుంచీ అదే పని లో ఉన్నా. మరో విషయం ఏమిటంటే ఈ సినిమాలో శ్రీరాముడి పాత్ర పోషించాను. రాముడు నిలబడే విధానం నుంచి ఆ పాత్రలో నటించడం వరకూ చాలా రిహార్సల్స్ చేయాల్సి వచ్చింది. రెండు మూడు నెలలు అందుకోసమే కష్టపడ్డా. అలాగే సినిమాలో కేవలం రెండు షాట్స్ కోసమే ఆరు నెలలు ట్రైనింగ్ తీసుకున్నా.

\- మహేశ్‌బాబు

ఆ పాట రోజూ వింటున్నా...

- 'వారణాసి'లో నటిస్తారా అని రాజమౌళి అడిగినప్పుడు నేను ఒక్క విజ్ఞప్తి చేశా... 'నాకు సినిమాలో డ్యాన్స్ చేసే అవకాశం ఇవ్వండి. ఓ మంచి పాట ఉండేలా చూడండి' అని. 'ఒకటి కాదు.. చాలా పాటలున్నాయి' అని రాజమౌళి చెప్పారు. ఇప్పటికే ఓ పాట చిత్రీకరణ పూర్తైంది. ఆ పాటను రోజూ వింటూనే ఉంటా. అందులో డ్యాన్స్ చాలా బాగుంటుంది.

\- ప్రియాంక

సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టు

● బంజారాహిల్స్ పోలీసులకు సినీ నటి ఈషా రెబ్బా ఫిర్యాదు



తనకు తరుణ్‌భాస్కర్ దర్శకత్వంలో నటించాలని ఉందంటూ నటి ఈషా రెబ్బా మూడు రోజుల క్రితం ఇన్‌స్టాలో పోస్టు పెట్టారు. ఓ వ్యక్తి ఈ పోస్టుకు స్పందిస్తూ అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశాడు. దాంతో ఈషా రెబ్బా ఆ వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బంజారా హిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించిన పోలీసులకు సోషల్ మీడియాలో అలా పోస్టు చేసిన వ్యక్తి తన పేరుతో కాకుండా మారుపేరుతో అకౌంట్ వాడుతున్నట్టు తెలిసింది.

బంజారాహిల్స్ (ఆంధ్రజ్యోతి)

బుల్లెట్ సునీల్ వచ్చేశాడు!



శర్వానంద్ హీరోగా యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఫ్యామిలీ డ్రామా 'బైకర్'. అభిలాష్‌రెడ్డి కంకర దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో బుల్లెట్ సునీల్‌గా ఓ పవర్‌ఫుల్ పాత్రలో రాజశేఖర్ నటిస్తున్నారు. మాజీ మోటో క్రాస్ రేసర్‌గా ఎన్నో విజయాలు సాధించిన పాత్ర ఆయనది. రాజశేఖర్ పుట్టినరోజు సందర్భంగా గ్లింప్స్ విడుదల చేశారు. ఇందులో 'బుల్లెట్ సునీల్' పాత్రకు మంచి ఎలివేషన్ ఇచ్చారు. 'ఒపినీయనే కదా.. మారుద్దాం' అంటూ రాజశేఖర్ చెప్పే డైలాగ్ ఆకట్టుకుంది. శర్వానంద్ బైక్ రేసర్‌గా నటిస్తున్నారు. సినిమాలో ఆయనకు, రాజశేఖర్‌కు ఉన్న సంబంధం ఏమిటో చూడాలంటే ఏప్రిల్ 3న వరకూ ఆగాల్సిందే. సంక్రాంతికి విడుదలైన 'నారీ నారీ నడుమ మురారి' చిత్రంతో ఈ ఏడాది తొలి విజయాన్ని అందుకొన్న శర్వానంద్ రెండు నెలల్లోనే రెండో సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తుండడం విశేషం. మాళవిక నాయర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో బ్రహ్మాజీ, అతుల్ కులకర్ణి ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి నిర్మాతలు వంశీ, ప్రమోద్.

అసెంబ్లీ సమావేశాలు చూద్దాం రండి!

- పాఠశాల, కళాశాలల విద్యార్థులకు ఆహ్వానం
- ఒక్కో బ్యాచ్‌కు 45 నిమిషాలు వీక్షించే అవకాశం
- చట్టసభలపై అవగాహన పెంచే ఉద్దేశం

అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): చట్టసభల పట్ల విద్యార్థుల్లో అవగాహన పెంచే ఉద్దేశంతో రాష్ట్రంలోని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు శాసన సభ సందర్శకుల గ్యాలరీ నుంచి సభా కార్యకలాపాలను వీక్షించేందుకు అనుమతించాలని అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు నిర్ణయించారు. ఆసక్తి కల పాఠశాలలు, కళాశాలల ప్రధానోపాధ్యాయులు/ప్రిన్సిపల్స్ విద్యార్థుల జాబితాతో అధికారిక అభ్యర్థన లేఖను ఈ-మెయిల్ ద్వారా legis.passes@g-mail.com కు పంపించాలని అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూచించారు. ప్రధానోపాధ్యాయులు/ప్రిన్సిపల్స్ సంతకాలు, స్టాంపుతో కూడిన అధికారిక అభ్యర్థన లేఖను, విద్యార్థుల పేరు, ఆధార్ నంబర్ తదితర వివరాలతో కూడిన జాబితాను స్కాన్ చేసి ఈ-మెయిల్ ద్వారా పంపాలన్నారు. ఒక్కో బ్యాచ్‌కు 45 నిమిషాల వరకు సభా కార్యకలాపాలు వీక్షించే అవకాశం లభిస్తుందని, ప్రతి బ్యాచ్‌లో గరిష్ఠంగా 30 మంది విద్యార్థులను అనుమతిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 91 863 2449184, 91 863 2449185 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రాయలసీమలో పెరిగిన ఉష్ణోగ్రతలు..

- కడపలో 34.8 డిగ్రీలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కోస్తాపైకి సముద్రం మీదుగా తూర్పుగాలులు వీస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్ పరిసరాల్లో కొనసాగుతున్న అధికపీడనం ప్రభావంతో మధ్యభారతం నుంచి పొడిగాలులు వీస్తున్నాయి. వీటి ప్రభావంతో కోస్తాలో ఎక్కువచోట్ల బుధవారం మేఘాలు ఆవరించాయి. రాయలసీమలో పలుచోట్ల ఆకాశం నిర్మలంగా ఉండడంతో పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. కడపలో 34.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల ఉదయంపూట పొగమంచు కురుస్తుందని, మిగిలిన చోట్ల పొడి వాతావరణం నెలకొంటుందని వాతావరణ శాఖ తెలిపింది.


ఖాకీల అవినీతి గోవుల దీనస్థితి

ఆవుల అక్రమ రవాణా ముఠాతో పోలీసుల కుమ్మక్కు

- పార్వతీపురం నుంచి సుళ్లూరుపేట దాకా మాఫియా
- గోవుల్ని ఎడాపెడా కంటైనర్లలో కుక్కి కబేళాలకు
- వందల కోట్ల చీకటి వ్యాపారానికి పోలీసుల మద్దతు
- నాయుడుపేట పోలీసులపై ఏసీబీ దాడితో ఫిర్యాదులు
- చిలకలూరిపేట, సుళ్లూరుపేటలో వైసీపీ నేతల దందా

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఆవుల అక్రమ రవాణా ముఠాతో పలువురు పోలీసులు కుమ్మక్కైనట్టు ఫిర్యాదులు వస్తున్నాయి. పార్వతీపురం నుంచి సుళ్లూరుపేట వరకూ రాత్రిపూట జరుగుతున్న చీకటి దందాకు దారి పొడవునా మద్దతిస్తున్న పలువురు పోలీసుల బాగోతం ఏసీబీ అధికారులకు చేరినట్లు తెలిసింది. నెల రోజుల్లోనే ముగ్గురు పోలీసులు కర్నూలు, నాయుడుపేటలో ఏసీబీ ట్రాప్‌లో పడటంతో పశువుల అక్రమ రవాణాదారుల అరాచకాలు, వారికి సహకారం అందిస్తున్న పోలీసుల గురించి గోరక్ష సంఘాల నుంచి పాడి రైతుల వరకూ ఫిర్యాదులు చేస్తున్నారు. గోమాంసం ఎక్కువగా తినే కేరళకు మన పొరుగు రాష్ట్రమైన ఒడిశా నుంచి ఆవులు, ఎద్దులు రవాణా అవుతున్నాయి. ఉత్తరాంధ్రలోని పార్వతీపురంలో అతిపెద్ద పశువుల సంతలో వ్యాపారులు ఆవులు, ఎద్దుల్ని కొనుగోలు చేసి కేరళలోని కబేళాలకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి ఆవు మాంసం విదేశాలకు సైతం ఎగుమతి చేస్తున్నారు. సంతలో కొనుగోలు చేసిన ఆవుల్ని కంటైనర్లలో తగినంత స్థలంలో ఉంచి మార్గమధ్యంలో ఆపుతూ కిందికి దించి వాటికి ఆహారం, నీరిచ్చి తీసుకెళ్లేందుకు అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అయితే రాష్ట్రంలో మాఫియాగా ఏర్పడిన కొందరు 16 ఆవులు మాత్రమే పట్టే కంటైనర్లలో 40 నుంచి 50 కుక్కి ఊపిరి ఆడకుండా చేసి అత్యంత దారుణంగా తీసుకెళ్తున్నారు. పగటిపూట సంతలో కొనుగోలు చేసి చీకటి పడగానే వాటిని కంటైనర్లలో ఎక్కిస్తున్నారు. పార్వతీపురం నుంచి సుళ్లూరుపేట వరకూ వెళ్లే దారిలో రాజమహేంద్రవరం, చిలకలూరిపేటలో ఆపి కొందరు తీసుకెళ్తున్నారు. ఎక్కువమంది పశువుల్ని ఆపకుండా రాష్ట్ర సరిహద్దుకు తరలించి, అక్కడి నుంచి మరో వాహనంలో కేరళకు పంపుతున్నారు. పశుసంవర్ధక, రవాణా, పోలీసు శాఖల అనుమతి లేకుండా వెళ్లే వాహనాలను పోలీసులు, ఎంవీఐలు తనిఖీలు చేస్తారు. గో సంరక్షణ సంఘాలేవైనా ఫిర్యాదు చేస్తే పోలీసులు కేసులు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసి పశువుల్ని గోశాలకు తరలిస్తారు.



చిలకలూరిపేటలో..

చిలకలూరిపేటలో గత ప్రభుత్వంలో మాజీ మంత్రి సహకారంతో పశువుల దందా నడిపిన వ్యక్తి ఎన్నికల ముందు టీడీపీకి జై కొట్టి ఇప్పుడు అంతకుమించి వ్యవహారం నడిపిస్తున్నట్లు సమాచారం. ఆయనకు సహకరిస్తున్న పోలీసుల గుట్టు, మామూళ్ల వ్యవహారం బయటికి వస్తోంది. వైసీపీ హయాంలో అరాచకాలకు వంత పాడిన ఒక సీఐ మద్యం వ్యాపారుల్ని లంచం కోసం వేధిస్తుండగా తాజాగా ఏసీబీ అధికారులు అరెస్టు చేయడంతో పశువుల దందా వ్యవహారం వెలుగులోకి వచ్చింది. నాయుడుపేటలో హెడ్ కానిస్టేబుల్‌తో పాటు మరో కేసులో కర్నూలులో ఎస్‌ఐని లంచం తీసుకొంటుండగా అరెస్టు చేశారు. అవినీతి పోలీసులపై ఏసీబీ అధికారులకు ఫిర్యాదులు వస్తున్నాయి.

ఉత్తరాంధ్రలో మాఫియా డాన్

ఉత్తరాంధ్ర జిల్లాల్లో జామి శేఖర్ అనే వ్యక్తి మాఫియా డాన్‌లా తయారై వందల కోట్ల వ్యాపారం చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. ఇటీవల విశాఖపట్నంలో టన్నుల కొద్దీ సీజ్ చేసి భూమిలో పాతిపెట్టిన పశు మాంసం తరలింపులోనూ శేఖర్ పాత్ర బయట పడింది. పలుమార్లు పోలీసులు అరెస్టు చేసినా గ్యాంగులను ఏర్పాటు చేసుకుని పోలీసులకు మామూళ్లు ఇస్తూ వేలాది పశువుల్ని అక్రమంగా కబేళాకు తీసుకెళుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. కట్టడి చేసేందుకు కొందరు పోలీసులు ప్రయత్నించగా ఒక మంత్రి నుంచి ఫోన్లు వచ్చినట్లు తెలుస్తోంది.

వైసీపీ నేత దందా

రాజమహేంద్రవరంలో వైసీపీకి చెందిన ఒక నేత పశువులు అక్రమంగా తరలించే వాహనాల్ని ఆపి డబ్బులు కట్టకుండా కదలడానికి వీల్లేదంటూ దౌర్జన్యం చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. అక్కడి పోలీసులు హెచ్చరించడంతో నెల్లూరు జిల్లా సరిహద్దులకు వెళ్లి అక్కడ కొందరు పోలీసులతో కుమ్మక్కై దందా చేస్తున్నట్లు తెలుస్తోంది. అక్కడి సంతలో రైతులు పాడి కోసం పశువుల్ని కొనుగోలు చేసినా తనకు మామూళ్లు ఇవ్వాలంటూ దౌర్జన్యం చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. రైతులు మామూళ్లు ఇవ్వకుంటే తనకు అనుకూలమైన పోలీసులకు ఫోన్లు చేసి కేసులు పెట్టిస్తున్నట్లు ఆధారాలు లభించాయి. తూర్పు గోదావరి జిల్లాలో ఇద్దరు మాజీ మంత్రులతో సన్నిహితంగా ఉంటూ.. బియ్యం స్మగ్లర్‌గా పేరొందిన మాజీ ఎమ్మెల్యే అనుచరుడిగా దందాలు చేయడంతో గతంలో కేసులు నమోదయ్యాయి. ఆ వ్యక్తి ఇప్పుడు నెల్లూరు, సుళ్లూరుపేట ప్రాంత పోలీసులతో కుమ్మక్కై రైతుల్ని వేధిస్తున్నాడు. అతనికి వంత పాడుతున్న పోలీసులు ఎవరనే దానిపై అవినీతి కట్టడి చేసే అధికారులు కూపీ లాగారు.

రాష్ట్రంలో చట్టబద్ధ పాలన హైజాక్

- వామపక్షాల ధ్వజం

అమరావతి, గవర్నర్‌పేట, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చట్టబద్ధ పాలన హైజాక్ అవుతోందని, అక్రమ కేసులు, ఘర్షణల చుట్టూ తిప్పుతూ ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారని వామపక్ష పార్టీల నాయకులు ఆరోపించారు. బందరు రోడ్డులోని సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో బుధవారం వామపక్ష పార్టీల ముఖ్యనేతల సమావేశం జరిగింది. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో రూల్ ఆఫ్ లా హైజాక్ అయ్యిందని, చట్టబద్ధ పాలన జరుగుతుందా.. అనే అనుమానం వస్తోందన్నారు. యథేచ్ఛగా దోచుకుంటూ, కార్పొరేట్లకు భూములు కట్టబెడుతూ, ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి జైళ్లలో వేస్తున్నారన్నారు. మోహన్‌బాబు యూనివర్శిటీ విద్యాబుద్ధులు చెబుతోందా, రౌడీయిజం చేస్తోందా? అని ప్రశ్నించారు.

స్టాక్ మార్కెట్‌లో నష్టాలకు ఒకరు బలి!

- ప్రైవేటు కంపెనీ చీఫ్ ఇంజనీర్ ఆత్మహత్య
- దువ్వాడ సమీపంలో రైలు కిందపడి బలవన్మరణం
- స్వగ్రామం చిత్తూరు జిల్లా బొమ్మసముద్రం



హర్షవర్ధన్

కూర్మన్నపాలెం(విశాఖపట్నం), ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు కంపెనీలో చీఫ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ఒకరు స్టాక్ మార్కెట్‌లో నష్టపోవడంతో అప్పుల పాలై రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. దువ్వాడ రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం ఈ ఘటన జరిగింది. దువ్వాడ జీఆర్పీ ఎస్‌ఐ కేటీఆర్ లక్ష్మి తెలిపిన వివరాల మేరకు చిత్తూరు జిల్లా కాణిపాకం సమీపంలోని బొమ్మసముద్రం గ్రామానికి చెందిన చల్లగుండ్ల హర్షవర్ధన్(36).. భార్య, కుమార్తెతో కలిసి విశాఖ నగరం పెదగంట్యాడ వినాయకనగర్ వుడా కాలనీలో నివాసం ఉంటున్నారు. హర్షవర్ధన్ పదిహేనేళ్లుగా శ్రవణ్ షిప్పింగ్ కంపెనీలో పనిచేస్తున్నారు. ప్రస్తుతం చీఫ్ ఇంజనీర్‌గా ఉన్నారు. ఊరు వెళుతున్నానని చెప్పి బుధవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చిన హర్షవర్ధన్ దువ్వాడ రైల్వేస్టేషన్ సమీపంలో జన్మభూమి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. తాను మంచి కొడుకు, భర్త, తండ్రిని కాలేకపోయానంటూ ఇంటి నుంచి బయలుదేరడానికి ముందే భార్యకు ఫోన్‌లో మెసేజ్ పెట్టారు. స్టాక్ మార్కెట్‌లో నష్టాల వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయని పేర్కొన్నారు. కుమార్తెను బాగా చూసుకోవాలని సూచించారు. అనంతరం తన ఫోన్‌ను ఇంటి వద్దే వదిలేశారు. కొద్దిసేపటికి ఆ మెసేజ్ చూసిన భార్య వెంటనే న్యూపోర్టు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా, పోలీసులు అన్ని పోలీస్‌స్టేషన్లకు సమాచారం ఇచ్చి గాలింపు చేపట్టారు. రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్టు గుర్తించారు. మృతదేహాన్ని జీఆర్పీ పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ కాంట్రాక్టర్ల జేబు నింపేందుకే కొత్తచట్టం: షర్మిల

ధర్మవరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంలో పదేళ్లపాటు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అద్భుతంగా అమలైందని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి అన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ పథకాన్ని భ్రష్టును పట్టించారని మండిపడ్డారు. శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం రాఘవంపల్లి గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆమె పరిశీలించారు. గడ్డపారతో మట్టి తవ్వి, పార పట్టి మట్టిని ఎత్తారు. అనంతరం ఆమె కూలీలతో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకున్నారు. దేశ వ్యాప్తంగా గ్రామీణ పేద ప్రజలు పనులు లేక పట్టణాలకు వలస వెళుతుండటంతో ఆనాటి ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్, సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వలసలను నివారించేందుకు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టారని అన్నారు. ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు బీజేపీ కుట్ర పన్నుతోందని విమర్శించారు. దేశ వ్యాప్తంగా ఉపాధి హామీ పథకానికి ఏడాదికి రూ.86 వేల కోట్లు ఖర్చు అవుతోందని అన్నారు. బీజేపీ కాంట్రాక్టర్ల జేబులు నింపేందుకే కొత్త చట్టం తెచ్చారని ఆరోపించారు. వీబీజీ రామ్‌జీ పేరిట ఒక పనికిమాలిన చట్టం తెచ్చారని షర్మిల విమర్శించారు.

ఎస్‌ఎఫ్‌ఐ నేతల కిడ్నాప్ కేసులో 13 మంది అరెస్ట్

- 3 ఇన్నోవా కార్లు స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులపై దాడి, కిడ్నాప్, హత్యాయత్నాలకు సంబంధించిన కేసులో 13 మందిని అరెస్ట్ చేసినట్టు ఏఎస్పీ రవి మనోహరాచారి వెల్లడించారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న మోహన్‌బాబు యూనివర్శిటీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్, మరికొన్ని విద్యార్థి సంఘాల నాయకులు మంగళవారం ఉదయం కలెక్టరేట్ వద్దకు బయలుదేరారు. తిరుచానూరు బైపాస్ రోడ్డుపై ఎంబీయూకి చెందిన కొంత మంది బౌన్సర్లు, విద్యార్థులు, మరికొందరు బయటి వ్యక్తులు కలిసి వీరిని అడ్డగించారు. విద్యార్థి నేతలు అక్బర్, వినోద్‌కుమార్‌ను కిడ్నాప్ చేశారు. ఈ దాడి నుంచి తప్పించుకున్న మరో ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు రెడ్డికుమార్ ఫిర్యాదుపై పోలీసులు అత్యంత వేగంగా స్పందించారని ఏఎస్పీ తెలిపారు. ఎంబీయూ పీఆర్వో పి.హేమంత్, కె.సురేంద్ర, పి.విశ్వేక్‌ను అదుపులోకి తీసుకుని కిడ్నాపైన విద్యార్థి సంఘ నాయకులను గంటలోనే రక్షించినట్టు చెప్పారు. నిందితులు వినియోగించిన మూడు ఇన్నోవా కార్లను స్వాధీనం చేసుకున్నామని, ఆ మూడూ విద్యానికేతన్ పేరు మీదే ఉన్నాయని తెలిపారు. బాధితుడు అక్బర్ మోటార్ సైకిల్‌ను కూడా స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. దర్యాప్తులో భాగంగా బుధవారం ఎనిమిది మందిని అరెస్ట్ చేశామని. పరారీలో ఉన్న మరికొంత మంది నిందితులను కూడా త్వరలో అరెస్ట్ చేస్తామని ఏఎస్పీ వెల్లడించారు. ఈ కేసుకు సమాంతరంగా.. విద్యార్థి సంఘ నాయకులు తమను డబ్బు కోసం డిమాండ్ చేశారంటూ ఎంబీయూ పీఆర్వో సతీష్ చంద్రగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, ఆ కేసు కూడా దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

విద్యార్థి ఆత్మహత్యపై విచారణ జరపాలి

అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మోహన్‌బాబు యూనివర్సిటీలో బీటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థి బాలాజీ ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరిపించాలని ఐక్య విద్యార్థి సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. పోలీసులు నిష్పాక్షికంగా దర్యాప్తు చేసి నిజానిజాలు వెల్లడి చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్, పీడీఎస్‌యూ, ఏఐఎస్‌ఏల రాష్ట్ర కార్యదర్శులు కె.ప్రసన్నకుమార్, బందెల నాసర్‌జీ, వినోద్, సురేశ్, కిరణ్, నాగార్జున, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కో-ఆర్డినేటర్ వేముల శ్రీనివాస్ బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. మోహన్‌బాబు యూనివర్సిటీ యాజమాన్యం గత కొంతకాలంగా విద్యార్థులు, తల్లిదండ్రుల పట్ల వ్యవహరిస్తున్న తీరు వివాదాస్పదంగా మారిన నేపథ్యంలో ఓ విద్యార్థి మరణం అనుమానాలకు తావిస్తోందన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, చిత్రంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యేలు డాక్టర్ అరవిందబాబు, ప్రత్తిపాటి పుల్లారావు

సామాన్య భక్తులకే పెద్దపీట

- కోటప్పకొండ తిరునాళ్ల ఏర్పాట్లపై మంత్రుల సమీక్ష

కోటప్పకొండ(నరసరావుపేట), ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి సన్నిధిలో ఈ నెల 15న జరగనున్న తిరునాళ్లలో స్వామి దర్శనానికి సామాన్య భక్తులకు పెద్ద పీట వేస్తామని, ఎక్కువ మంది భక్తులకు స్వామి దర్శనం కల్పిస్తామని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. కోటప్పకొండ దేవస్థానం ప్రాంగణంలో బుధవారం ఆయన తిరునాళ్ల ఏర్పాట్లపై సమీక్షించారు. ఏర్పాట్ల కోసం ప్రభుత్వం నుంచి రూ.30 లక్షల నిధులు విడుదల చేస్తున్నామన్నారు. అన్ని శాఖ అధికారులు సమన్వయంతో పని చేసి తిరునాళ్లను విజయవంతం చేయాలని మంత్రి కోరారు. ఉచిత దర్శనం కూలైన్ల నిడివిని పెంచాలని.. పారిశుధ్యం, తాగునీరు సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని... భక్తులకు ఆరోగ్య సేవలు విస్తృతంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మరో మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ భారీ విద్యుత్ ప్రభలు తిరునాళ్లకు వస్తాయని, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకొవాలని అధికారులను ఆదేశించారు. 108 అంబులెన్సులను సిద్ధంగా ఉంచాలని చెప్పారు. సమావేశంలో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జూలకంటి బ్రహ్మారెడ్డి, కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ బి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
8
నవ్య
కుటుంబ కదంబం
గురువారం • 5 ఫిబ్రవరి 2026



చున్నీలో చమక్కుమనేలా...

చున్నీ ఎలా ధరించినా చూడముచ్చటగానే ఉంటుంది. సంప్రదాయ పద్ధతిలో ధరించినా, ఆధునికత జోడించి వినూత్న స్టైల్‌ను అనుసరించినా చున్నీ అందం ఏమాత్రం తరగదు. పలు రకాల చున్నీలు, వాటిని ధరించే స్టైల్స్ మీకోసం.

• చుడీదార్ అందమంతా చున్నీలోనే ఉంటుంది. లేత రంగు చుడీదార్‌కు కలర్‌ఫుల్ చున్నీ జోడిస్తే, మోడర్న్ వేర్‌ను మించిపోతుంది. కాబట్టే ఎన్ని రకాల ఆధునిక దుస్తులు మార్కెట్లో విడుదల అవుతున్నా, చుడీదార్‌లకు ఆదరణ తరగడం లేదు.

• గద్వాల్, పోచంపల్లి, కలంకారీ...ఏ రకం చుడీదార్ అయినా, వాటికి తగిన చున్నీలు మార్కెట్లో బోలెడన్ని! అయితే వేసుకున్న డ్రెస్‌కు తగ్గట్టు చున్నీ ధరించే స్టయిల్‌ను మారుస్తూ ఉండాలి.

• హై నెక్, లో నెక్, కాలర్ నెక్...చుడీదార్‌లు ఎలాంటి మోడల్‌లో కుట్టించుకున్నా చున్నీలు సూటవుతాయి. నెక్ మోడల్ కనిపించేలా చున్నీలను భుజం మీద వేసుకుంటే అందానికి అందం, స్టయిల్‌కు స్టయిల్!

కౌన్సెలింగ్

మడమ నొప్పి వేధిస్తే?

డాక్టర్! మడమ నొప్పితో కాలు కింద పెట్టలేకపోతున్నాను. పొద్దున్నే నడక నరకాన్ని చూపిస్తోంది. ఈ నొప్పి తగ్గే మార్గం వివరించండి

- ఓ సోదరి, హైదరాబాద్.

ఈ సమస్య... ప్లాంటార్ ఫాసియైటిస్. ప్రతి పది మందిలో ఒకరు జీవితంలో ఏదో ఒక సందర్భంలో ప్లాంటార్ ఫాసియైటిస్ సమస్యతో బాధపడతారు. ఈ సమస్య పురుషుల్లో కంటే స్త్రీలలోనే రెండింతలు ఎక్కువ. ఎక్కువ మందిలో ఒక పాదానికి అరుదుగా కొందరిలో రెండు పాదాలకు ఒకే సమయంలో ఈ సమస్య రావొచ్చు. అయితే ఎక్కువ సందర్భాల్లో ఈ నొప్పి ఎలాంటి చికిత్స అవసరం లేకుండానే దానంతటదే సర్దుకుంటూ ఉంటుంది. కానీ అలా తగ్గిపోకుండా అంతకంతకూ పెరుగుతుంటే చికిత్స తీసుకోవాల్సిందే!

విశ్రాంతి: ప్లాంటార్ ఫాసియా మీద ఒత్తిడి తగ్గితే నొప్పి తగ్గిపోతుంది. పాదానికి రెస్ట్ ఇవ్వటంవల్ల ఈ నొప్పిని అదుపు చేయొచ్చు.

చెప్పులు మార్చాలి: పాదంలోని ఒంపుకు సపోర్ట్ ఇచ్చే మెత్తని ఆర్థోపెడిక్ చెప్పులు ధరిస్తే చాలావరకూ నొప్పి తగ్గిపోతుంది. షూలో హీల్ ప్యాడ్స్ వాడటం అలవాటు చేసుకోవాలి.

స్ట్రెచింగ్: పాదం అడుగున ఉండే ప్లాంటార్ ఫాసియాను వదులు చేయటం కోసం ఫిజియోథెరపిస్ట్ సహాయంతో తేలికపాటి స్ట్రెచింగ్ ఎక్సర్‌సైజెస్ చేయాల్సి ఉంటుంది.

ఐస్ ప్యాక్: ఐస్ క్యూబ్స్‌తో నొప్పి ఉన్నచోట ప్యాక్ వేయటం వల్ల నొప్పి అదుపులోకొస్తుంది.



పెయిన్ కిల్లర్స్: నొప్పి అదుపు చేయటం కోసం కొంతకాలంపాటు పెయిన్ కిల్లర్స్ వాడక తప్పదు.

నైట్ స్ప్లింట్స్: ప్లాంటార్ ఫాసియా స్ట్రెచ్ అయ్యేందుకు రాత్రి పూట పాదానికి స్ప్లింట్స్ ధరించాలి. దీని వల్ల ఉపశమనం ఉంటుంది.

చికిత్స ఇలా...

షాక్‌వేవ్ థెరపీ: ఎక్స్‌ట్రా కార్పొరియల్ షాక్‌వేవ్ థెరపీ ద్వారా హై ఎనర్జీ సౌండ్ వేవ్స్ నొప్పి ఉన్న ప్రదేశంలో విడుదలయ్యేలా చేసే చికిత్స ఇది. దీని వల్ల ప్లాంటార్ ఫాసియా గాయం మాని నొప్పి తగ్గే అవకాశం ఉంటుంది.

స్టిరాయిడ్ ఇంజక్షన్: పై చికిత్సా పద్ధతుల వల్ల నొప్పి అదుపులోకి రాకపోతే మడమలోకి స్టిరాయిడ్ ఇంజక్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ ఇంజక్షన్‌తో రెండు రోజుల్లోనే నొప్పి పూర్తిగా తగ్గిపోతుంది.

సర్జరీ: ఇంజక్షన్ చేసినా నొప్పి మళ్లీ మళ్లీ తిరగబెడుతూ సంవత్సరకాలానికి మించి వేధిస్తుంటే తప్పనిసరి పరిస్థితుల్లోనే సర్జరీని ఆశ్రయించాలి. సర్జరీ ద్వారా ప్లాంటార్ ఫాసియా పట్టీకి కోత పెట్టి వదులు చేస్తారు. దాంతో నొప్పి తగ్గిపోతుంది.

- డాక్టర్ దశరథరామిరెడ్డి
సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్, హైదరాబాద్.

సంకల్పం

ఫేస్‌బుక్కే షోరూమ్

ఒకటికి నాలుగు దుకాణాలు తిరిగి, పలు రకాల చీరలను ప్రత్యక్షంగా పరిశీలించకుండా చీరల కొనుగోలు సాధ్యపడదు. కానీ కేవలం ఫేస్‌బుక్ లైవ్ ద్వారా మహిళల నమ్మకాన్ని చూరగొంటూ, ఇప్పటివరకూ పది లక్షల చీరలను విక్రయించారు హైదరాబాద్‌కు చెందిన సంగీత రాజేష్. ఎనిమిదిన్నర లక్షల ఫేస్‌బుక్ ఫాలోవర్లను కలిగి ఉన్న సంగీత... 'నవ్య'తో పంచుకున్న విశేషాలివి.

"చీరల వ్యాపారంలోకి నా ప్రవేశం యాదృచ్ఛికంగానే జరిగిపోయింది. అంతకంటే ముందు రెమిడియల్ టీచర్‌గా పని చేశాను. ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు బోధకురాలిగా పని చేయడంతో పాటు సొంత స్కూళ్లను కూడా నెలకొల్పాను. ఆ స్కూళ్లలో స్పీచ్, బిహేవియరల్ థెరపీలను బోధిస్తూ, ఆ పిల్లలను సాధారణ బడులకు సిద్ధం చేస్తూ ఉండేదాన్ని. అది సేవాధారిత రంగం. పైగా ఫ్రాంచేజీలను నెలకొల్పడం ఇష్టం లేదు. అలాంటప్పుడు ఎదుగుదల ఎలా సాధ్యపడుతుంది? అందుకే, నాకంటూ ప్రత్యేక గుర్తింపు పొందాలంటే, వినూత్నమైన ప్రయత్నానికి పూనుకోవాలని అనిపించింది. ఆ క్రమంలో ఉత్పత్తుల రంగంలోకి ప్రవేశించాలని నిర్ణయించుకున్నాను. అలా పదిహేనేళ్ల కిందట చీరల స్టోర్ మొదలుపెట్టాను. అప్పట్లో నాలాగే ఎంతోమంది మహిళలు ఈ రంగంలో ఉన్నారనే విషయం ఆలస్యంగా తెలిసింది. అలాంటప్పుడు వాళ్లందర్లో ప్రత్యేకంగా కనిపించడమెలా? అనే ఆలోచన మొదలైంది. దాంతో అవగాహన కోసం నిఫ్ట్‌లో కోర్సు పూర్తి చేశాను. చీరల డిజైనింగ్ మొదలుపెట్టాను. ఆ సమయంలోనే ఫేస్‌బుక్‌లో బిజినెస్ పేజీ అందుబాటులోకొచ్చింది.

వ్యూహాలు, ఆఫర్లతో ఆకట్టుకుని...

ఫేస్‌బుక్ బిజినెస్ పేజీని ప్రవేశపెట్టడంతో ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాను. చేనేత కళాకారుల దగ్గరకు వెళ్లి చీరల తయారీ వివరాలు సేకరించి, నేనే మోడల్‌గా మారి ఆ ఫొటోలు, వీడియోలు ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసేదాన్ని. క్రమేపీ వినియోగదారులు పెరగడం మొదలుపెట్టారు. అయితే చీరల నాణ్యత పట్ల వినియోగదారులకు నమ్మకం కలిగించడానికి ఎంతో కష్టపడవలసి వచ్చింది. వాళ్లను ఆకట్టుకోవడానికి మొదటి వంద కస్టమర్లకూ బహుమతులను అందించడం లాంటి వినూత్న ప్రయోగాలు ప్రారంభించాను. అలా నిలోఫర్ టీ పొడులు మొదలు, హెయిర్ క్లిప్పులు, బొట్టు బిళ్లల ప్యాకెట్లు, కుక్కర్లు లాంటి మహిళల మనసులను చూరగొనే ఆఫర్లను అందించాను. ఫేస్‌బుక్ లైవ్ ద్వారా చీరలను విక్రయించడంతో పాటు, మచిలీపట్నం, శ్రీకాళహస్తి, సూరత్, జైపూర్... ఇలా చీరలు తయారయ్యే ప్రాంతాలకు వెళ్లి, అక్కడి నుంచి లైవ్ షోలు చేస్తూ, ఆర్డర్లు తీసుకునేదాన్ని. అలా వ్యాపారం క్రమేపీ పుంజుకుంటున్న సమయంలో కొవిడ్ వచ్చింది. కొవిడ్, ప్రత్యక్ష వ్యాపారాలను దెబ్బతీసి ఉండొచ్చు. కానీ ఆ కాలంలో నా వ్యాపారం మరింత పుంజుకుంది.

> మాది తమిళనాడులోని దిండిగల్. మావారు రాజేష్. వాళ్ల కుటుంబం మూడు తరాలుగా హైదరాబాద్‌లో స్థిరపడడంతో పెళ్లి తర్వాత నేను కూడా ఇక్కడికే వచ్చేశాను. మాకు ఇద్దరు పిల్లలు. పాప దీప్తి ఫైనాన్షియల్ జర్నలిస్ట్. బాబు తరుణ్ వ్యాపారంలో నాకు సహాయపడుతూ ఉంటాడు.

నెలలో 15వేల చీరలు

ఒక లైవ్ సెషన్ నాలుగు నుంచి ఐదు గంటల పాటు కొనసాగుతుంది. విక్రయించే ప్రతి చీరనూ చూపించి, దాని ప్రత్యేకతలను వివరిస్తూ, వాట్సాప్ లింక్ ద్వారా అప్పటికప్పుడే విక్రయాలు జరుపుతూ ఉంటాను. ఒక లైవ్ షోలో 100 కాంచీపురం చీరలు విక్రయించిన సందర్భాలూ ఉన్నాయి. అలాగే గత నెలలో ఏకంగా ఒకటిన్నర కోట్ల ఖరీదైన 15 వేల చీరలను ఆన్‌లైన్‌లో విక్రయించాను. కొన్నిసార్లు చీరలు మిగిలిపోతూ ఉంటాయి. ఈ డెడ్‌స్టాక్‌ను పండుగ రోజుల్లో కేవలం కొరియర్ రుసుము తీసుకుని ఉచితంగా పంపించేస్తూ ఉంటాను. ఇలా వినియోగదారుల నమ్మకంతో పాటు అభిమానాన్ని చూరగొనగలిగాను. అలాగే ఒక చీర మాత్రమే చూపించి, దొంతరలోని ఏదో ఒక చీర కొనుక్కోండి అన్నప్పుడు, మహిళలు ఆసక్తి కనబరిచారు. ఈ ఆలోచన నాకు లబుబు టాయిస్ నుంచి వచ్చింది. బయటకు కనిపించే వీల్లేకుండా ప్యాక్ చేసి బొమ్మను విదేశాల్లో విక్రయిస్తూ ఉంటారు. ఉత్సుకత అనే సూత్రం ఆధారంగా వ్యాపారాన్ని ఎలా పెంచుకోవచ్చో గ్రహించాను. క్రమం తప్పకుండా బెంగుళూరు, విశాఖపట్టణం, కొయంబత్తూరు, చెన్నై, బెంగుళూరు, పూణె, ఢిల్లీ, ముంబయిల్లో చీరల ప్రదర్శనలు కూడా ఏర్పాటు చేస్తుంటాను.





సవాళ్లు లేకపోలేదు...


ఫేస్‌బుక్ లైవ్‌లో ఆర్డర్లు తీసుకుని చీరలను విక్రయించడం చూడడానికి సులభంగా కనిపించవచ్చు. కానీ తెర వెనక ఎంతో కష్టం దాగి ఉంటుంది. గంటల తరబడి వినియోగదారులను ఎంగేజ్ చేయగలగాలి. వాళ్లకు ఓ పక్క వినోదాన్ని పంచుతూ ఆసక్తికరంగా చీరల గురించి వివరించగలగాలి. ఇదంతా ఒక ఎత్తైతే, చీరలను వినియోగదారులకు వీలైనంత త్వరగా అందించడం మరొక ఎత్తు. చీరల వ్యాపారం సులభతరమనీ, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు సంపాదించవచ్చని ఎంతోమంది మహిళలు ఈ రంగంలోకి అడుగుపెట్టి దెబ్బతింటూ ఉంటారు. వాళ్లకు కొన్ని సలహాలు ఇవ్వాలనుకుంటున్నాను. ఎవర్నో చూసి మనం కూడా ఈ వ్యాపారం చేద్దామని అనుకోకూడదు. ఈ రంగంలో ఎదగాలనే బలమైన సంకల్పంతో పాటు టెక్స్‌టైల్స్, ఫ్యాబ్రిక్స్, మార్కెట్ గురించి అవగాహన పెంచుకొని, ఎప్పటికప్పుడు కొత్త వ్యూహాలతో, ఆఫర్లతో వినియోగదారులను ఆకట్టుకోగలగాలి."

• గోగుమళ్ల కవిత

ఇంటి లోపలే ఒక 'కేఫ్ వైబ్'

కేఫ్‌లకు వెళ్లి కాఫీ తాగుతూ గడిపే సమయాన్ని ఇప్పుడు ప్రజలు తమ ఇంట్లోనే ఆస్వాదించాలని కోరుకుంటున్నారు. అందుకే ఒక ఇంటి మూలన 'మినీ కాఫీబార్' లేదా 'టీ స్టేషన్' ఏర్పాటు చేయడం లేటెస్ట్ డెకర్ ట్రెండ్.

ఎలా డిజైన్ చేయాలి: లివింగ్ రూమ్ లేదా డైనింగ్ ఏరియాలో చిన్న ఖాళీ మూలను ఎంచుకోవాలి. అక్కడ వింటేజ్ స్టైల్ చెక్క టేబుల్ లేదా కన్సోల్ టేబుల్ ఉంచి దానిపై కాఫీ మెషీన్, రకరకాల మగ్గులు, టీ పొడుల డబ్బాలను అందంగా సర్దాలి. పైన గోడకు చిన్నచిన్న హుక్స్ తగిలించి మగ్గులను వేలాడదీస్తే అది పక్కా కేఫ్ లుక్ ఇస్తుంది.



పర్సనలైజ్డ్ టచ్: ఆ మూలనే ఒక చిన్న చాక్‌బోర్డ్ పెట్టి, దానిపై రోజుకో మంచి కోట్ రాయడం లేదా ఆ రోజు మెనూ రాయడం ఇంటికి వచ్చే అతిథులను ఆకట్టుకుంటుంది. అక్కడ చిన్న బార్‌స్టూల్ వేసి వార్మ్ లైటింగ్ పెడితే అది కేవలం కాఫీతాగడానికే కాదు, ప్రశాంతంగా కూర్చుని పుస్తకం చదవడానికి కూడా అద్భుతమైన ప్రదేశంగా మారుతుంది. ఇది ఇంటికి ఒక మోడ్రన్, యూత్‌ఫుల్ వైబ్‌ని తెస్తుంది.

లైకుల వేటలో..!

కొన్ని విషాదాలు గుండెలను పిండేస్తాయి. హిమాచల్ ప్రదేశ్‌లోని మంచుకొండల్లో గడ్డకట్టుకుపోయిన రెండు ప్రాణాలు ఓ మొబైల్ ఫోన్ ఇచ్చిన శాపాలు. సోషల్ మీడియాలో లైకుల కోసం ప్రాణాలనే పణంగా పెడుతున్న నేటి తరం పోకడలకు నిదర్శనం.

19 ఏళ్ల వీక్షిత్ రాణా, 13 ఏళ్ల పియూష్ కుమార్‌లకు హిమాచల్‌లోని మంచు కొండలు, కోనలతోపాటు వారి వెంట ఉండే కుక్కలే ప్రపంచం. కానీ ఈ అన్నదమ్ములకు తల్లిదండ్రులు ప్రేమతో ఇచ్చిన స్మార్ట్‌ఫోన్ వారి జీవితాల్లోకి ప్రవేశించాక ఆ ప్రపంచమే మారిపోయింది. ఆ చిన్న తెరపై కనిపించే రీల్స్, కంటెంట్ క్రియేషన్ మాయలో పడి ప్రకృతి వైపరీత్యాన్ని కూడా గమనించలేకపోయారు. వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్ జారీచేసినా, సోషల్ మీడియాలో ఫాలోవర్లను మెప్పించే సాహసం కోసం వారు మంచు శిఖరాల వైపు అడుగులేశారు. చివరికి మంచు తుపానులో చిక్కుకుని వారు శవాలుగా మారినా, వారి పెంపుడు కుక్క నాలుగు రోజుల పాటు తిండీతిప్పలు లేక ఆ దేహాలను కాపలా కాయడం ప్రతి ఒక్కరితో కంటతడి పెట్టించింది.



డిజిటల్ డిటాక్స్

అయితే 'జెన్‌జీ' అని పిలిచే నేటి యువతలో ఇప్పుడిప్పుడే కొంత మార్పు కనిపిస్తోంది. నిరంతరం అల్గారిథమ్స్ గుప్పిట్లో బతకడం కంటే, ఆఫ్‌లైన్ జీవితమే ప్రశాంతమని వారు గుర్తిస్తున్నారు. ఓ నివేదిక ప్రకారం.. యువత ఇప్పుడు 'పోస్టింగ్ జీరో' వైపు మొగ్గు చూపుతోంది. అంటే కంటెంట్‌ను కేవలం వినోదం కోసమే చూస్తున్నారు తప్ప, లైకుల కోసం తాము పరితపించడం తగ్గుతోంది. డిజిటల్ తెరలను పక్కనపెట్టి నిజమైన స్నేహాలు, అభిరుచులకు సమయం కేటాయిస్తున్నారు.

నిషేధాల వెనుక నిజమెంత?

ఈ విషాదం ఒక్క హిమాచల్ ప్రదేశ్‌ది మాత్రమే కాదు, ప్రపంచ వ్యాప్త సమస్య. అందుకే ఫ్రాన్స్ ప్రభుత్వం 15 ఏళ్లలోపు పిల్లలపై సోషల్ మీడియా నిషేధానికి చట్టం తెస్తోంది. ఆస్ట్రేలియా కూడా అదే బాటలో ఉంది. ఇక మన దేశంలో ఆంధ్రప్రదేశ్, గోవా వంటి రాష్ట్రాలు కూడా ఈ దిశగా ఆలోచన చేయడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. అయితే, కేవలం చట్టాలు చేస్తే సమస్య తీరిపోతుందా? అనేదే అసలు ప్రశ్న.

తల్లిదండ్రులూ...

ఇక్కడ అసలు సిసలైన సమస్య 'ఎలిఫెంట్ ఇన్ ది రూమ్' (అందరికీ తెలిసినా విస్మరించే పెద్ద సమస్య) లాంటి తల్లిదండ్రుల ప్రవర్తనే. నేటి మిలీనియల్స్, అంతకంటే పెద్దవారు గుర్తింపు కోసం, సోషల్ స్టేటస్ కోసం ఫోన్లలో గంటల తరబడి గడుపుతున్నారు. పిల్లలను ఫోన్ పక్కన పెట్టమని శాసించే పెద్దలు, తాము మాత్రం ఆ మాయలో మునిగిపోవడం తగదనేది మానసిక నిపుణుల మాట.

ఎత్నిక్ ఫ్యూజన్ డెకార్

ఆధునిక ఫ్లాట్లలో సైతం మన మూలాలను వెతుక్కునే ప్రయత్నమే ఈ 'ఎత్నిక్ ఫ్యూజన్'. పాశ్చాత్య శైలి సోఫాలు ఉన్నప్పటికీ అక్కడక్కడా మన భారతీయ కళాఖండాలను జోడించడం ద్వారా ఒక విలక్షణమైన అందం వస్తుంది.



చేనేత, టెక్స్‌టైల్స్:
హోం డెకర్‌లో ఇప్పుడు మన దేశీ చేనేతలకు ప్రాధాన్యం పెరిగింది. కలంకారీ ప్రింట్స్ ఉన్న కుషన్లు, ఇక్కత్ రగ్గులు, రాజస్థానీ జరోకా స్టైల్ మిర్రర్స్ ఇంటికి సంప్రదాయబద్ధమైన హంగును తెస్తాయి. సోఫా పక్కన ఒక పాతకాలపు చెక్కకుర్చీ లేదా ఉయ్యాల వేయడం ఇప్పుడు పెద్ద ట్రెండ్.

ఇత్తడి, రాగి వస్తువులు:
అమ్మమ్మల కాలం నాటి ఇత్తడి గంగాళాలు, దీపపు కుందులు, విగ్రహాలను పాలిష్ చేయించి లివింగ్ రూమ్‌లో అందంగా అమర్చుతున్నారు. ముఖ్యంగా ఉరులి పాత్రలో నీళ్లు పోసి, అందులో పూరేకులు, తేలియాడే దీపాలు పెట్టడం వల్ల ఇంటికి ప్రశాంతతోపాటు ఐశ్వర్యవంతమైన లుక్ వస్తుంది.

టెర్రకోట, మట్టి కళలు:
ప్లాస్టిక్ వస్తువులను పక్కనపెట్టి మట్టితో చేసిన కళాఖండాలకు ప్రాధాన్యం ఇవ్వడం ఈ ట్రెండ్‌లో భాగం. గోడలపై కొండపల్లి బొమ్మలు లేదా నిర్మల్ పెయింటింగ్స్ పెట్టడం, టేబుల్స్ మీద మట్టితో చేసిన డెకర్ పీసులు ఉంచడం వల్ల ఇల్లు సహజంగా కనిపిస్తుంది. ఇది కేవలం అలంకరణ మాత్రమే కాదు, మన కళాకారులను ప్రోత్సహించే ఒక చక్కని మార్గం కూడా.

లేటు వయసులో...
అలుపులేని పరుగు

74 ఏళ్ల దక్షా కనావియా పరుగుకు పర్యాయపదం. ఉద్యోగ విరమణ తరువాత విశ్రాంతి తీసుకోవాల్సిన వయసులో మారథాన్‌లలోకి అడుగుపెట్టిన ఆమె రికార్డుల మోత మోగిస్తున్నారు. '50కె పింక్‌మారథాన్'కు మస్కట్‌గానూ వ్యవహరించిన ఆమె క్రమశిక్షణ, అంకితభావం ఉంటే విజయం ఏ వయసులోనైనా సాధ్యమేనని నిరూపిస్తున్నారు.

"చిన్న వయసులో కుటుంబ ఆర్థిక ఇబ్బందులు, చదువు, ఉద్యోగం... జీవితం వెనుక పరుగెత్తి అలిసిపోయాను. బ్యాంక్ మేనేజర్‌గా రిటైరయ్యాక... హాయిగా విశ్రాంతి తీసుకోవచ్చనుకున్నాను. కానీ మళ్లీ పరుగు అందుకోవాల్సి వచ్చింది. ఈసారి జీవితంలో కాదు, ట్రాక్ మీద. నేను పుణేలో పుట్టాను. ముంబయిలో పెరిగాను. మాది దిగువ మధ్యతరగతి కుటుంబం. చదువులో, ఆటల్లో నా తల్లిదండ్రులు బాగా ప్రోత్సహించేవారు. హైస్కూల్లో ఉన్నప్పుడు ఎన్నో పోటీల్లో పాల్గొని బహుమతులు గెలుచుకున్నాను. ఈలోగా... కొన్ని కారణాలవల్ల మా నాన్న త్వరగా రిటైర్ కావాల్సి వచ్చింది. చిన్న ఇంట్లో అందరం సర్దుకోవాల్సి వచ్చేది. దీంతో కుటుంబానికి నా వంతుగా ఎలా సాయపడాలని ఆలోచించేదాన్ని. పదో తరగతి పూర్తికాగానే... పొద్దున్న కాలేజీకి వెళ్లి, సాయంత్రం దుకాణాల్లో పని చేసేదాన్ని. డిగ్రీ తరువాత టెలికాం శాఖలో, మున్సిపల్ కార్పొరేషన్‌లో విధులు నిర్వహించాను. పెళ్లి, పిల్లలు, సంసారం... వీటిని నెరవేరుస్తూనే బ్యాంక్ పరీక్షలు రాశాను. బ్యాంక్ ఉద్యోగినయ్యాను. 38 ఏళ్ళు ఉద్యోగాలు చేశాక బ్యాంక్ మేనేజర్‌గా రిటైరయ్యాను. కానీ ఒక కొత్త అధ్యాయం నాకోసం ఎదురు చూస్తోందని నాకు తెలీదు.

దినచర్యలో భాగంగా...

2011లో... నాకు ఆస్టియోపోరోసిస్ ఉందని నిర్ధారణ అయింది. నడవడం కష్టమయ్యేది. దానికితోడు అంతకుముందు నుంచీ ఉన్న మధుమేహం... ఆరోగ్యపరంగా చాలా ఇబ్బందులు పడ్డాను. 'కొన్నాళ్ళు ఇలాగే ఉండిపోతే... మంచానికే పరిమితమైపోతానేమో?' అని భయపడ్డాను. ఫిజియోథెరపీకి వెళ్ళాను. వైద్య నిపుణుల సలహాతో యోగ, సూర్యనమస్కారాలు, స్విమ్మింగ్ మొదలుపెట్టాను. మరింత ఫిట్‌నెస్ కోసం రన్నింగ్ చేయాలని మిత్రులు సూచించారు. అలా... 63 ఏళ్ళ వయసులో పరుగును నా దినచర్యలో భాగం చేసుకున్నాను. ఈ క్రమంలో పింక్ మారథాన్ కమ్యూనిటీతో పరిచయమయింది. నన్ను కూడా ఆ బృందంలో చేరాలని ప్రోత్సహించారు. అది నా జీవితంలో చాలా పెద్ద మలుపు. అప్పటివరకూ మారథాన్ అంటే నాకు తెలీదు. నొప్పి లేకుండా నడవడం ఒక్కటే అప్పట్లో నా లక్ష్యం. కానీ క్రమంగా నా దృక్పథంలో మార్పు వచ్చింది. 5కె రన్ తో మొదలైన నా పరుగు 10కె, అల్ట్రాస్, 24 గంటల రేసుల నుంచి 100 కిలోమీటర్ల ఛాలెంజ్‌ల వరకూ సాగింది. ముంబయి నుంచి పుణే, సిల్వాసా నుంచి ముంబయి, గ్వాలియర్ నుంచి ఢిల్లీ, భారత సైన్యంతో పాటు అమృతసర్ నుంచి వాఘా సరిహద్దు... ఇలా దేశంలో వివిధ ప్రాంతాల్లో పరుగులు పెట్టాను. 100 కిలోమీటర్ల దూరాన్ని 19 గంటల్లో అధిగమించాను. మహారాష్ట్ర రాష్ట్ర క్రీడా పోటీలు, జాతీయ క్రీడా పోటీల్లో మూడు స్వర్ణ పతకాలు అందుకున్నాను. ఈ వయసులో నేను సాధించిన విజయాలతో రెండు గిన్నిస్ రికార్డులు, మూడు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డులు, ఏడు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ (బ్రిటన్) నమోదు చేశాను. ఇటీవల '50కె పింక్ మారథాన్'కు మస్కట్‌గా వ్యవహరించాను.



మనసు చెప్పేది వినండి...

పరుగు కోసం, మారథాన్ల కోసం నేను ఎలాంటి శిక్షణ తీసుకోలేదు. సానుకూల దృక్పథంతో ఆలోచించడం, సంతోషంగా ఉండడం నా రహస్యం. రోజూ పొద్దున్నే యోగా... ఆ తరువాత రన్నింగ్ చేస్తాను, కాసేపు నాకు ఇష్టమైన డ్యాన్స్ చేస్తాను. ఒక స్వచ్ఛంద సంస్థలో వాలంటీర్‌గా కూడా పని చేస్తున్నాను. అలాగని అంతా సజావుగా జరిగిపోలేదు. సయాటికా, వెన్నెముక సమస్యలతో కొన్నేళ్ళ క్రితం రెండు నెలలు మంచానికే పరిమితమయ్యాను. బాగా విశ్రాంతి తీసుకొని కోలుకున్నాను. కానీ అప్పుడు కూడా పరుగు ఆపాలని అనుకోలేదు. 100 కిలోమీటర్లు కుదరకపోతే 50 కిలోమీటర్లు చేస్తాను, లేదంటే 20, 10, 5.... కానీ ఓపిక ఉన్నంతవరకూ పరుగు కొనసాగిస్తూనే ఉంటాను. "ఈ వయసులో ఇంత ఉత్సాహంగా ఎలా ఉంటున్నారు'ని చాలామంది అడుగుతూ ఉంటారు. వయసు గురించి ఆలోచించడం మానేయండి. ఎందుకంటే వృద్ధాప్యం అనేది ఒక వాస్తవం. కాబట్టి మీ శరీరం చెప్పేది వినండి, మార్పును ఆమోదించండి. ఆరోగ్యం గురించి నిరంతరం శ్రద్ధ తీసుకోండి. నా స్ఫూర్తితో కొందరైనా లేటు వయసులో కొత్తగా ఏదైనా ప్రారంభించి, తమ కలల్ని నిజం చేసుకుంటే... నాకు అంతకుమించిన సంతృప్తి మరేదీ ఉండదు."

'భారత్ ట్యాక్సీ' యాప్ వచ్చేస్తోంది

» నేడు అధికారికంగా ప్రారంభించనున్న హోంమంత్రి అమిత్‌షా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: దేశ రాజధాని ఢిల్లీతో పాటు గుజరాత్‌లో పైలట్ ప్రాజెక్టుగా రెండు నెలల పాటు విజయవంతంగా కొనసాగిన 'భారత్ ట్యాక్సీ' యాప్ త్వరలోనే దేశవ్యాప్తంగా అందుబాటులోకి రానుంది. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా గురువారం ఈ యాప్‌ను అధికారికంగా ప్రారంభించనున్నారు. సహకార సంఘాల ఆధ్వర్యంలో నడిచే ప్రపంచంలోనే తొలి, అతిపెద్ద క్యాబ్ అగ్రిగేటర్‌గా ఈ యాప్ నిలవనుందని కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ తెలిపింది. మార్కెట్లో ఇప్పటికే ఉన్న ఉబర్, ఓలా, ర్యాపిడోలకు ప్రత్యామ్నాయంగా ఈ యాప్ నిలుస్తుందని పేర్కొంది. ఇది పూర్తిగా జీరో కమీషన్ మోడల్‌పై ఆధారపడి పనిచేస్తూ, లాభాలను నేరుగా డ్రైవర్లకే పంపిణీ చేస్తుంది. డ్రైవర్లే యజమానులుగా పేర్కొంటూ వారికి షేర్ సర్టిఫికేట్లు అందజేస్తుంది. ఇందులో నమోదైన ప్రతి డ్రైవర్‌కు రూ.5 లక్షల వ్యక్తిగత ప్రమాద బీమా, రూ.5 లక్షల కుటుంబ ఆరోగ్య బీమా సదుపాయాన్ని కల్పిస్తారు. ఈ యాప్‌లో నమోదైన డ్రైవర్లకు ఇతర ప్లాట్‌ఫామ్‌లపై కూడా పనిచేసుకునే స్వేచ్ఛ ఉంటుంది.

బిల్‌గేట్స్‌కు లైంగిక సంబంధాలు నిజమే

» అందుకే విడాకులు ఇచ్చేశా: మెలిండా



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: తన భర్త బిల్‌గేట్స్ వేరే మహిళలతో సన్నిహితంగా ఉంటున్నారని తెలిసిన తర్వాతే ఆయనకు విడాకులు ఇచ్చానని మెలిండా గేట్స్ తాజాగా వెల్లడించారు. ఆ విషయం తెలిసినప్పుడు ఎంతో వేదనను అనుభవించానని చెప్పారు. చివరికి వివాహ బంధం నుంచి బయటకు వచ్చానన్నారు. తద్వారా ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో గేట్స్ గురించి ఉన్నది నిజమేనని ఆమె ఒప్పుకొన్నారు. మెలిండా గేట్స్ ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఇంటర్వ్యూ చేసే వ్యక్తి ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో బిల్ గేట్స్ పేరు ఉండటంపై ఆమెను ప్రశ్నించారు. బిల్‌గేట్స్‌కు రష్యా అమ్మాయిలతో లైంగిక సంబంధాలు ఉన్నాయని, ఫలితంగా సుఖవ్యాధులు వచ్చాయని, ఆయన తన భార్య మెలిండాకు తెలియకుండా ఆమెకు డ్రగ్స్ ఇవ్వడానికి ప్రయత్నించారని ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ఉన్న వివరాలనూ ప్రస్తావించారు. దీనికి మెలిండా పై విధంగా స్పందించారు. "వాటి గురించి నన్ను అడగడం అంటే మానని గాయాలను మళ్లీ రేపడమే. నిజం తెలిసినప్పుడు నేను నమ్మలేకపోయా. బిల్‌గేట్స్‌తో వైవాహిక బంధంలో నేను ఎంతో క్షోభపడ్డాను. ఇది నిజం" అని చెప్పారు. బిల్ గేట్స్, మెలిండా 27ఏళ్లు వివాహబంధంలో ఉన్నారు. 2021లో మే నెలలో విడాకులు తీసుకున్నారు. వారికి ముగ్గురు పిల్లలు.

మణిపూర్ కొత్త సీఎంగా ఖేమ్‌చంద్ ప్రమాణం



ఇంఫాల్, ఫిబ్రవరి 4: మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన ముగిసి బీజేపీ నేత వై.ఖేమ్‌చంద్ సింగ్ కొత్త ముఖ్యమంత్రి అయ్యారు. లోక్ భవన్‌లో గవర్నర్ అజయ్ కుమార్ భల్లా ఆయనతో ప్రమాణం చేయించారు. కుకీ తెగకు చెందిన బీజేపీ ఎమ్మెల్యే నేమ్చా కిప్‌జెన్, నాగా పీపుల్స్ ఫ్రంట్‌కు చెందిన ఎల్.డిఖో ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణం చేశారు. మహిళా ఉప ముఖ్యమంత్రి నేమ్చా కిప్‌జెన్ ఢిల్లీలోని మణిపూర్ భవన్ నుంచి వర్చువల్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను ఎత్తేశారు. మంగళవారం బీజేపీ ఎమ్మెల్యేలు ఖేమ్‌చంద్‌ను శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నారు.

వాంగ్‌చుక్ నిర్బంధాన్ని సమీక్షించండి: సుప్రీం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: ప్రముఖ పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితి బాగోలేదని, వీలైతే ఆయన నిర్బంధాన్ని సమీక్షించాలని కేంద్రానికి సుప్రీంకోర్టు సూచించింది. వాంగ్‌చుక్ అరెస్టును సవాలు చేస్తూ ఆయన భార్య గీతాంజలి జె. ఆంగ్మో దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ అరవింద్ కుమార్, పీబీ వరాలేతో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితి బాగోలేదని, ఆయనకు వయసు సంబంధిత సమస్యలు కూడా ఉన్నాయని తెలిపింది. ఆయన నిర్బంధంపై పునఃసమీక్షించాలని సొలిసిటర్ జనరల్ కె.ఎం. నటరాజ్‌కు మౌఖికంగా సూచించింది.

ఆదాయార్జనలో మస్క్ రికార్డు

» 800 బిలియన్ డాలర్లు దాటిన సంపద



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: ప్రపంచ కుబేరుడు, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ఆదాయార్జనలో రికార్డులు సృష్టిస్తూ దూసుకెళ్తున్నారు. స్పేస్‌ఎక్స్, ఎక్స్ ఏఐ విలీనంతోపాటు, టెస్లా షేర్ల విలువ కూడా పెరగడంతో ప్రపంచంలోనే 800 బిలియన్ డాలర్ల నికర సంపదను అధిగమించిన మొదటి వ్యక్తిగా మాస్క్ రికార్డులకెక్కారు. ఫోర్బ్స్ నివేదిక ప్రకారం మస్క్ రాకెట్ కంపెనీ స్పేస్‌ఎక్స్, కృత్రిమ మేధ కంపెనీ ఎక్స్‌ఏఐ విలీనం తర్వాత ఆయన వ్యక్తిగత సంపద భారీగా పెరిగి 852 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.70లక్షల కోట్లు)కు చేరుకుంది. గత నాలుగైదు నెలలుగా మస్క్ సంపద జెట్ స్పీడుతో పెరుగుతూ పోతోంది. ఇదే వేగం కొనసాగితే.. మరి కొన్ని రోజుల్లోనే ఆయన ప్రపంచంలోనే మొదటి ట్రిలియనీర్ (1 ట్రిలియన్ డాలర్ల సంపద) అయ్యే అవకాశం ఉంది.

24న రాష్ట్ర ఎన్నికల కమిషనర్ల జాతీయ సదస్సు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: దేశంలో ఎన్నికల నిర్వహణ, ఓటర్ల జాబితాల రూపకల్పనలో మరింత పారదర్శకత, సమన్వయం సాధించే దిశగా కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) కీలక నిర్ణయం తీసుకుంది. దాదాపు రెండున్నర దశాబ్దాల సుదీర్ఘ విరామం తర్వాత, అన్ని రాష్ట్రాల ఎన్నికల కమిషనర్లతో జాతీయ సదస్సును నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రతిష్ఠాత్మక సదస్సు ఈనెల 24న న్యూఢిల్లీలో జరగనుంది. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాల మధ్య పరస్పర సమన్వయం పెంచడమే ఈ సదస్సు ఉద్దేశం. ముఖ్యంగా ఎన్నికల చట్టాలు, ఓటర్ల అర్హతలు, ఎన్నికల నిర్వహణలో వస్తున్న సాంకేతిక మార్పులపై విస్తృతంగా చర్చించనున్నారు. చివరిసారిగా ఇటువంటి జాతీయ స్థాయి సదస్సును 1999లో నిర్వహించారు.

పంచాయతీరాజ్‌లో మరో 1392 రోడ్ల పనులు

» ఏపీఆర్‌ఆర్ఎస్‌పీ నిధులు రూ.2123 కోట్లతో నిర్మాణం

అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): సాస్కి నిధులతో ఇప్పటికే పంచాయతీరాజ్ గ్రామీణ రోడ్ల నిర్మాణానికి రూ.2 వేల కోట్లు మంజూరు చేసిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ తాజాగా మరో రూ.2,123 కోట్లతో రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఆంధ్రప్రదేశ్ రూరల్ రోడ్స్ స్ట్రెంతెనింగ్ ప్రాజెక్టు(ఏపీఆర్‌ఆర్ఎస్పీ)-పీఆర్ఆర్ (మైదాన) గ్రాంట్ కింద 26 జిల్లాల్లో ఈ పనులు చేపట్టనున్నారు. రాష్ట్రంలో అత్యధికంగా దెబ్బతిన్న గ్రామీణ రోడ్లను ప్రాతిపదికగా తీసుకుని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం రూపొందించిన పోర్టల్ ఆధారంగా ఈ రోడ్లను మంజూరు చేశారు.

పంచాయతీల్లో జోరుగా పన్ను వసూళ్లు

» ఇప్పటికే ట్యాక్స్, నాన్‌ట్యాక్స్ వసూళ్లు రూ.400 కోట్లు

అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో తెచ్చిన సంస్కరణల ఫలితంగా గ్రామ పంచాయతీల ఆదాయం గణనీయంగా పెరుగుతోంది. దీంతోపాటు పంచాయతీల్లో పన్ను, పన్నేతర వసూళ్లు కూడా పెరిగాయి. సాధారణంగా మార్చి నెలాఖరులో స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టి పంచాయతీల్లో పన్నులు వసూలు చేస్తుంటారు. అయితే పంచాయతీరాజ్ అధికారులు ముందుగానే సిబ్బందిని అప్రమత్తం చేసి పన్నుల వసూళ్లు చేపట్టారు. గ్రామ పంచాయతీలకు పన్ను రూపంలో వచ్చే ఆదాయం గతంలో కేవలం రూ.600 కోట్లు డిమాండ్ ఉంటే, ఇప్పుడు అది రూ.985 కోట్లకు చేరుకుంది. అదేవిధంగా నాన్ ట్యాక్స్ కూడా రూ.131 కోట్లకు చేరుకుంది. గతంలో ఈ చెల్లింపులకు పంచాయతీల వద్ద లెక్కలుండేవి కావు. ఇప్పుడు స్వర్ణ పంచాయతీ పోర్టల్ తీసుకురావడంతో ప్రతిపైసాకు జవాబుదారీతనం ఏర్పడింది. దీంతో గ్రామాల్లో పన్నులు, పన్నేతర చెల్లింపులు కూడా విరివిగా జరుగుతున్నాయి. ఇప్పటికే పన్ను, పన్నేతర చెల్లింపులు రూ.400 కోట్లకు పైగా జమ అయింది. అంటే మార్చి లోపునే పన్నుల చెల్లింపులు పూర్తవతాయని అధికారులు భావిస్తున్నారు.

లోక్‌సభలో 'పుస్తక' పోరు!

నరవణే ఆత్మకథను సభలో ప్రదర్శించిన రాహుల్.. బోఫోర్సుపై పుస్తకాన్ని ప్రస్తావించిన బీజేపీ ఎంపీ

» సభలో తీవ్ర గందరగోళం

» స్పీకర్‌కు పరస్పరం ఫిర్యాదులు



నరవణే పుస్తకంతో పార్లమెంటు ఆవరణలో రాహుల్, సోనియాకు సంబంధించిన పుస్తకంతో దూబే

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: మాజీ సైనికాధిపతి ఎం.ఎం.నరవణే అముద్రిత ఆత్మకథలోని అంశాలు ఇప్పటికే పార్లమెంటును కుదిపేస్తుండగా, 'బోఫోర్స్'పై ప్రచురించిన పుస్తకాలను అధికార పక్షం ప్రదర్శించడం మరింత కలకలం రేపింది. ఆ పుస్తకాల ఆధారంగా గాంధీల కుటుంబంపై మాట్లాడేందుకు బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబేను అనుమతించడంపై కాంగ్రెస్ ఎంపీలు అభ్యంతరం వ్యక్తం చేశారు. స్పీకర్ ఓం ప్రకాశ్ బిర్లాకు తమ నిరసన తెలిపారు. చైనా దురాక్రమణపై నరవణే పుస్తకంలోని భాగాలను ప్రచురించిన ఆర్టికల్‌ను చదువుతానంటూ విపక్ష నేత రాహుల్ గాంధీ పట్టుబట్టడంతో గత రెండురోజులుగా సభ స్తంభించిన విషయం తెలిసిందే. బుధవారం సమావేశాలు మొదలుకాగానే బీజేపీ ఎంపీ దూబే పలు పుస్తకాలను తనతో సభలోకి తెచ్చారు. వాటి పేర్లు చదువుతూ, బోఫోర్సు కుంభకోణం సహా గాంధీల కుటుంబ వ్యవహారాలపై వాటిలో ఏం రాశారనేది మాట్లాడటం మొదలుపెట్టారు. దీంతో సభలో పెద్దఎత్తున గందరగోళం నెలకొంది. 12 గంటలకు సభ తొలిసారి వాయిదా పడింది. ఈ సమయంలో దీపేందర్ సింగ్ హూడా సహా పలువురు కాంగ్రెస్ ఎంపీలు సభాపతి కార్యాలయానికి చేరుకుని, దూబేపై ఓం ప్రకాశ్ బిర్లాకు ఫిర్యాదు చేశారు. దూబేకు మద్దతుగా కేంద్ర మంత్రి కిరెన్ రిజిజు, ఇతర బీజేపీ ఎంపీలు కూడా అక్కడకు చేరుకున్నారు. రాహుల్ తీరుపై వారూ ఫిర్యాదు చేశారు. ఇరువర్గాలూ స్పీకర్ సమక్షంలోనే కొద్దిసేపు వాగ్యుద్ధం సాగించాయి. మధ్యాహ్నం రెండు గంటలకు తిరిగి సభ ప్రారంభం కాగానే, దూబే తిరిగి గాంధీల కుటుంబంపై ప్రస్తావనలు ఉన్న పుస్తకాల్లోని భాగాలను చదవడం ప్రారంభించగా, స్పీకర్ ఆయనను వారించారు. సభా వ్యవహారాలతో నేరుగా సంబంధం లేని పుస్తకాలు లేక వార్తాపత్రికలు లేక ఉత్తరాల్లోని భాగాలను చదవడం నిబంధనల ఉల్లంఘన అవుతుందని, స్పీకర్ దీనిపై ఇప్పటికే నిర్ణయం ప్రకటించారన్నారు. రాష్ట్రపతి ప్రసంగంపై చర్చను మాత్రమే అనుమతిస్తానని స్పష్టం చేశారు. ఆ తర్వాత సభ సాయంత్రం ఐదు గంటల వరకు వాయిదా పడింది. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానానికి సాయంత్రం 5 గంటలకు లోక్‌సభలో జవాబివ్వాల్సిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అసలు సభకే రాలేదు. సభ 5 గంటలకు సమావేశం కాగానే అధికార పక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకువచ్చారు. ఎనిమిది మంది విపక్ష సభ్యులను సస్పెండ్ చేయడానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాగా, కేంద్రంలోని అగ్ర నాయకత్వం యుద్ధ సమయంలో ప్రతిస్పందించిన తీరు బట్టబయలు అవుతుందనే భయంతోనే రాహుల్‌ను నరవణే పుస్తకంలోని భాగాలను సభలో చదవనీయడం లేదని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా వాద్రా విమర్శించారు.

ఇదిగో.. ఇదే ఆ పుస్తకం

కాంగ్రెస్ ఎంపీలు మాజీ సైనికాధిపతి నరవణేను, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను సూచించే పోస్టర్లు, బ్యానర్లతో సభకు వచ్చారు. నరవణే ఆత్మకథ 'ఫోర్ స్టార్స్' పుస్తకాన్ని రాహుల్ సభ లోపలా, బయటా ప్రదర్శించారు. ఆ పుస్తకాన్ని చూపిస్తూ పార్లమెంటు వెలుపల మీడియాతో ఆయన మాట్లాడారు. ఈ రోజు ప్రధాని మోదీ వస్తారని తాను అనుకోవడం లేదని, ఒకవేళ ఆయన వస్తే ఈ పుస్తకాన్ని ఆయనకు అందిస్తానని రాహుల్ వ్యాఖ్యానించారు. "ఇలాంటి పుస్తకమేదీ లేదని స్పీకర్ నుంచి, ప్రభుత్వం, రక్షణ మంత్రి వరకు సభలో చెబుతున్నారు. కానీ, ఇదిగో పుస్తకం ఉంది. ఈ విషయం దేశ యువత తెలుసుకోవాలి" అని పేర్కొన్నారు. 2020లో చైనా దురాక్రమణ సమయంలో ప్రధాని మోదీ తన కర్తవ్యాన్ని నిర్వర్తించలేదని, అప్పటి ఆర్మీ చీఫ్ నరవణేపైనే మొత్తం బాధ్యతను వదిలేశారని విమర్శించారు. చైనా దురాక్రమణ సమయంలో లద్దాక్‌లో ఏం జరిగిందనేది నరవణే వివరంగా రాశారన్నారు. యుద్ధ సమయంలో 'మీకు ఏది తోస్తే అది చేయండి' అని తనతో మోదీ అన్న మాటలను ఈ పుస్తకంలో ప్రధానంగా నరవణే ప్రస్తావించారని రాహుల్ తెలిపారు.



బిట్టూ 'ద్రోహి'.. రాహుల్ 'దేశ విరోధి'

రాహుల్ గాంధీ ఒకప్పటి తన సహచరుడు, ప్రస్తుత కేంద్రమంత్రి రవనీత్‌సింగ్ బిట్టూను ద్రోహిగా అభివర్ణించారు. మంత్రి కూడా తన మాజీ నాయకుడిని దేశానికి శత్రువుగా పేర్కొన్నారు. బుధవారం పార్లమెంటు మకర ద్వారం వద్ద ఈ ఘటన జరిగింది. తమ ఎంపీలను లోక్‌సభ నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ రాహుల్, ఆయన పార్టీ ఎంపీలు ద్వారం వద్ద ధర్నా చేస్తుండగా.. బిట్టూ సభ లోపలకు వెళ్లేందుకు వచ్చారు. ధర్నా చేస్తున్న ఎంపీలను చూసి.. ఏదో యుద్ధంలో గెలిచినట్లుగా ఇక్కడ కూర్చున్నారని ఆయన అన్నారు. అక్కడే ఉన్న రాహుల్.. 'ఓ ద్రోహి ఇటుగుండా నడచుకుంటూ వస్తున్నాడు' అంటూ ఆయన్ను చూసి.. 'హలో సోదరా.. మిత్ర ద్రోహి.. ఆందోళన చెందకు.. మళ్లీ కాంగ్రెస్‌లోకి వస్తావు' అని కరచాలనానికి చేయి ముందుకు చాపారు. షేక్‌హ్యాండ్ ఇచ్చేందుకు నిరాకరించిన బిట్టూ.. రాహుల్‌ను దేశ విరోధి అంటూ ముందుకు సాగారు.

ఆత్మరక్షణలో బీజేపీ సర్కారు!

» నరవణే ప్రకటనపై రాహుల్ గాంధీ ప్రసంగించాల్సిందేనంటున్న విపక్షం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ నరవణే తన పుస్తకంలో రాసిన వ్యాఖ్యలను ఉటంకిస్తూ విపక్షనేత రాహుల్ గాంధీ లోక్‌సభలో తన ప్రసంగాన్ని పూర్తి చేసేంతవరకూ సభ కార్యకలాపాలకు అడ్డు తగులుతూనే ఉంటామని ప్రతిపక్షాలు స్పష్టం చేయడంతో బుధవారం కూడా లోక్‌సభా సమావేశాలు స్తంభించిపోయాయి. ఒకరిద్దరు సభ్యులు ప్రసంగించినప్పటికీ ప్రతిపక్షాల హోరు మధ్య సభను వాయిదా వేయాల్సివచ్చింది. ఈ విషయంలో బీజేపీ సర్కారు ఆత్మరక్షణలో పడినట్టు కనిపిస్తోంది. సరిహద్దుల్లో చైనా సైన్యాలు ప్రవేశించినప్పటికీ తమకు ఎలాంటి దిశా నిర్దేశం చేయకుండా ప్రధాని, రక్షణ మంత్రి తప్పించుకున్నారంటూ నరవణే రాసిన పుస్తకం ప్రతులను ప్రధానికి స్వయంగా సభలో ఇస్తానని రాహుల్ ప్రకటించడం, రోజంతా సభా కార్యకలాపాలకు అడ్డుతగులుతుండడంతో ప్రభుత్వం దిక్కుతోచని పరిస్థితిలో పడిపోయింది. "ప్రధానమంత్రి భయపడ్డారు. ఆయన సభకు హాజరుకారు" అని రాహుల్ బుధవారం ఉదయం మీడియా ముందు అన్నట్టుగానే.. మోదీ సభకు హాజరు కాకపోవడం గమనార్హం. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతూ జరిగిన చర్చకు సాయంత్రం 5 గంటలకు జవాబివ్వాల్సిన ప్రధాని మోదీ అసలు ఉదయం నుంచే సభకు హాజరు కాకపోవడం.. స్పీకర్ ఓం బిర్లా కూడా చాంబర్‌కే పరిమితం కావడంతో.. ఏమి జరుగుతుందా? అనే ఉత్కంఠ రాజకీయ వర్గాల్లో నెలకొన్నది. ఇప్పటికే ఎనిమిది మంది సభ్యులను సస్పెండ్ చేసిన స్పీకర్.. పరిస్థితి ఇలాగే కొనసాగితే లోక్‌సభలో 220 మందికి పైగా ప్రతిపక్ష సభ్యులను సస్పెండ్ చేయలేరని, అలా చేస్తే తీవ్ర రాజకీయ సంక్షోభం ఏర్పడుతుందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. స్పీకర్ ఓం బిర్లా కూడా.. అది సాధ్యం కాదని చెప్పినట్లు తెలుస్తోంది. తెర వెనుక మంత్రాంగంతో ప్రధాని ప్రసంగానికి వీలు కల్పించేందుకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రయత్నిస్తున్నప్పటికీ.. విపక్షాలు అందుకు ససేమిరా అంటున్నట్టు సమాచారం. రాహుల్ ప్రసంగాన్ని అనుమతించి ఉంటే సమస్య సమసిపోయేదని.. అనవసరంగా అడ్డుకుని చిక్కుల్లో పడిపోయామని బీజేపీ వర్గాలు కూడా భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో.. రాష్ట్రపతి ప్రసంగంపై చర్చను పూర్తి చేయకుండానే లోక్‌సభను వాయిదా వేయాల్సి వస్తుందా, రాజ్యసభలో మాత్రమే చర్చ జరిగి ప్రధాని జవాబిస్తారా అనే ప్రశ్నలకు ఎవరూ సమాధానం చెప్పలేకపోతున్నారు. దీంతోపాటు.. భారత-అమెరికా వాణిజ్య ఒప్పందం వివరాలను బయటపెట్టాలంటూ ప్రతిపక్షాలు చేస్తున్న డిమాండ్‌పై కూడా మోదీ ప్రభుత్వం ఆత్మరక్షణలో పడింది. ఇంకా ఒప్పందంపై సంతకాలు కాలేదని, అనేక వ్యవసాయ ఉత్పత్తులను అనుమతించాలని అమెరికా డిమాండ్ చేస్తోందని వాణిజ్య మంత్రిత్వశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఒప్పందంపై సంతకం కాకుండానే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన చేయడం, వ్యవసాయ ఉత్పత్తులు సహా.. 500 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.45 లక్షల కోట్లు) మేర అమెరికా ఉత్పత్తులను భారత్ కొనుగోలు చేస్తుందని, రష్యా నుంచి చమురు కొనడం మానివేస్తుందని ప్రకటించడంపై కూడా మోదీ సర్కార్ జవాబు చెప్పలేని పరిస్థితుల్లో పడింది. కాగా భవిష్యత్ కార్యాచరణను నిర్ణయించేందుకు ప్రతిపక్షాలు గురువారం ఉదయం పది గంటలకు సమావేశమవుతున్నాయి. లోక్‌సభలో చర్చను అనుమతించకపోతే రాజ్యసభనూ స్తంభింపజేయాలని, ప్రధాని ప్రసంగాన్ని అడ్డుకోవాలని ప్రతిపక్షాలు భావిస్తున్నాయి. అయితే.. మోదీ పార్లమెంట్‌కు వచ్చే అవకాశాల్లేవని ఎన్డీయే నాయకుడొకరు తెలిపారు.

లాయర్ దీదీ

» బెంగాల్‌లో ఎస్ఐఆర్‌పై సుప్రీంకోర్టులో స్వయంగా వాదనలు వినిపించిన మమత



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: టీఎంసీ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ సీఎం మమత బుధవారం లాయర్ అవతారమెత్తారు. బెంగాల్‌లో ఓటర్ల జాబితా సవరణ(సర్)కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో సీజేఐ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఎదుట స్వయంగా వాదనలు వినిపించారు. తద్వారా సుప్రీంకోర్టులో వాదించిన తొలి సీఎంగా రికార్డు సృష్టించారు. ఓటర్లను చేర్చటానికి కాకుండా తొలగించే లక్ష్యంతోనే ఎస్ఐఆర్‌ను తీసుకొచ్చినట్లు కనబడుతోందని మమత తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు సాధారణంగా రెండేళ్లు పడుతుందని, కానీ, ఎన్నికల సంఘం(ఈసీ) కేవలం 3నెలల్లో పూర్తి చేయాలని చూస్తోందన్నారు. ఒత్తిడి భరించలేక ఎస్ఐఆర్ ప్రక్రియలో పాలుపంచుకుంటున్న ఉద్యోగులు మరణిస్తున్నారని మమత గుర్తు చేశారు. తాను తన పార్టీ తరఫున రాలేదని, బెంగాల్‌లోని ఓ కార్మికుడి తరఫున ఇక్కడికి వచ్చానని, తమకు న్యాయం అందించాలని మమత విజ్ఞప్తి చేశారు. వాదనల మధ్యలో ఈసీ తరఫు న్యాయవాది రాకేశ్ ద్వివేది కల్పించుకోబోగా.. మమత చేతులు జోడించి 'నన్ను మాట్లాడనివ్వండి సర్' అని విజ్ఞప్తి చేశారు. రాకేశ్ ద్వివేది మళ్లీ ఏదో మాట్లాడబోగా.. సీజేఐ కల్పించుకుంటూ.. 'ఇక్కడ మాట్లాడటానికి మేడమ్ చాలా దూరం నుంచి వచ్చారు' అని పేర్కొన్నారు. కాగా, వాదనల సందర్భంగా మమతతోపాటు ఆమె తరఫు న్యాయవాదులు కపిల్ సిబల్, శ్యాం దివాన్ కూడా కోర్టు హాలులో ఉన్నారు. తనకు ఐదు నిమిషాల సమయం ఇవ్వాలని మమత విజ్ఞప్తి చేయగా.. సీజేఐ '5 నిమిషాలు కాదు.. 15 నిమిషాలు తీసుకోండి' అని చెప్పారు. వాదనలు ముగించిన తర్వాత మమత.. ధర్మాసనానికి కృతజ్ఞతలు తెలియజేశారు. వాదనల కోసం మమత సుప్రీంకోర్టు ఆవరణలోకి ఉదయం 10 గంటలకు చేరుకున్నారు. మధ్యాహ్నం 12.55కి సీజేఐ ధర్మాసనం విచారణ ప్రారంభించింది.

అనిల్ అంబానీ కంపెనీల అక్రమాల విచారణలో జాప్యంపై సుప్రీం ఫైర్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: అనిల్ అంబానీ గ్రూప్(అడాగ్) కంపెనీలకు సంబంధించిన రూ.40,000 కోట్ల బ్యాంకింగ్, కార్పొరేట్ అక్రమాలపై సీబీఐ, ఈడీ విచారణలో తీవ్ర జాప్యం నెలకొనడంపై సుప్రీంకోర్టు బుధవారం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ అక్రమాలపై వేగంగా సరైన విచారణ జరపాలని ఆదేశాలు జారీ చేసింది. నాలుగు వారాల్లో దర్యాప్తు నివేదికలను సమర్పించాలని సీబీఐ, ఈడీలను కోరింది. సిట్‌ను ఏర్పాటు చేసి ఈ కేసు దర్యాప్తును సజావుగా పూర్తిచేయాలని ఈడీని ఆదేశించింది. కాగా అనిల్ అంబానీ దేశం విడిచి పారిపోయే ప్రమాదం ఉందని శర్మ అనుమానం వ్యక్తం చేయడంతో సుప్రీంకోర్టు అనుమతి లేకుండా ఆయన దేశం విడిచి వెళ్లరని ఆయన తరఫు న్యాయవాది ముకుల్ రోహత్గి తెలిపారు.

భారత్‌లో సున్నా టారిఫ్!

అమెరికా ఉత్పత్తులపై..

పండ్లు, కూరగాయలు సహా 98శాతం ఉత్పత్తులపై సుంకాలు ఉండవు

» భారత్‌పై మాత్రం 18% టారిఫ్ అమలు

» వైట్‌హౌస్ ప్రతినిధి కరోలిన్ లీవిట్, అమెరికా వాణిజ్యశాఖ ప్రతినిధి గ్రీర్ వెల్లడి



కరోలిన్ లీవిట్

న్యూయార్క్/వాషింగ్టన్, ఫిబ్రవరి 4: అమెరికా నుంచి దిగుమతి చేసుకునే దాదాపు అన్ని ఉత్పత్తులపైనా భారత్ సుంకాలను సున్నాకు తగ్గిస్తుందని అమెరికా అధ్యక్ష కార్యాలయం వైట్‌హౌజ్ ప్రెస్ సెక్రెటరీ కరోలిన్ లీవిట్ పేర్కొన్నారు. అదే సమయంలో భారత ఉత్పత్తులపై అమెరికా 18శాతం సుంకాలు వసూలు చేస్తుందని, భారత్‌తో వాణిజ్య లోటు భారీగా ఉండటమే దీనికి కారణమని చెప్పారు. వాణిజ్య ఒప్పందంలో భాగంగా రష్యా చమురు కొనుగోళ్లను పూర్తిగా నిలిపివేస్తామని.. అమెరికా, వెనెజువెలా నుంచి చమురు కొనుగోళ్లను పెంచుతామని భారత్ హామీ ఇచ్చిందని వెల్లడించారు. మంగళవారం మధ్యాహ్నం ఆమె వైట్‌హౌజ్ వద్ద మీడియాతో మాట్లాడారు. "ప్రధాని మోదీతో అధ్యక్షుడు ట్రంప్ నేరుగా చర్చించి.. వాణిజ్య ఒప్పందంపై అంగీకారానికి వచ్చారు. అమెరికాలో రవాణా, ఇంధనం, వ్యవసాయ ఉత్పత్తుల కోసం రూ.45 లక్షల కోట్లు(500 బిలియన్ డాలర్లు) పెట్టుబడులు పెడతామని ప్రధాని మోదీ మాటిచ్చారు" అని కరోలిన్ లీవిట్ పేర్కొన్నారు. ఇక పండ్లు, కూరగాయలు వంటి చాలా వ్యవసాయ ఉత్పత్తులు, రసాయనాలు, ఎలక్ట్రానిక్స్‌తోపాటు ఇతర పారిశ్రామిక ఉత్పత్తులపై భారత్ సుంకాలను సున్నాకు తగ్గిస్తుందని అమెరికా వాణిజ్య శాఖ ప్రతినిధి జేమీసన్ గ్రీర్ కూడా పేర్కొన్నారు. కొన్ని రకాల వ్యవసాయ, పాడి ఉత్పత్తులపై మాత్రం భారత్ రక్షణ సుంకాలు విధించుకునేందుకు అంగీకారం కుదిరిందని తెలిపారు. "భారత్ ప్రస్తుతం అమెరికా నుంచి దిగుమతి చేసుకుంటున్న పారిశ్రామిక ఉత్పత్తులపై సగటున 13.5% సుంకాలు వసూలు చేస్తోంది. ఇకపై ఇవి సున్నాకు తగ్గిపోతాయి. అవేకాదు ఆల్కహాల్, పండ్లు, కూరగాయలు సహా 98% ఉత్పత్తులపై సుంకాలు సున్నాకు తగ్గిపోతాయి" అన్నారు. అయితే, అమెరికాతో వాణిజ్య ఒప్పందంలో భారత వ్యవసాయం, ఇతర కీలక, సున్నిత రంగాలకు రక్షణలు ఉంటాయని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ పునరుద్ఘాటించారు. ఇదిలా ఉండగా, అమెరికా-ఇరాన్ మధ్య యుద్ధ వాతావరణం నేపథ్యంలో ఇరాన్‌లోని చాబహార్ పోర్టు ప్రాజెక్టుపై భారత్ వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టు కోసం ప్రతి బడ్జెట్‌లో రూ.100కోట్లు కేటాయించే కేంద్రం ఈసారి మాత్రం ఎలాంటి కేటాయింపులు జరపలేదు.

భారత్ ఏ దేశం నుంచైనా చమురు కొనొచ్చు: రష్యా

భారత్‌కు రష్యా ఒక్కటే చమురు సరఫరా చేయడం లేదని, ఇతర దేశాల నుంచి కూడా కొనుగోలు చేస్తుందని రష్యా అధ్యక్ష కార్యాలయం ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ పేర్కొన్నారు. రష్యా చమురు కొనుగోలు నిలిపేస్తామని భారత్ హామీ ఇచ్చిందన్న ట్రంప్ వ్యాఖ్యలను మీడియా ప్రస్తావించగా.. ఆయన ఈ విధంగా స్పందించారు. ఏ దేశం నుంచి అయినా చమురు కొనుగోలు చేసుకునే హక్కు భారత్‌కు ఉందని, ఇందులో కొత్తేమీ లేదని పెస్కోవ్ స్పష్టం చేశారు.

వెనెజువెలా చమురుతో భారీ లబ్ధి

» 3 బిలియన్ డాలర్ల మేరకు ఆదా

» ఎస్‌బీఐ రిసెర్చ్ నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: వెనెజువెలా నుంచి చమురు కొనుగోలు చేయడం ద్వారా భారత్‌కు భారీ లబ్ధి చేకూరుతుందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) పరిశోధనలో పేర్కొంది. ఒక్కొక్క బ్యారెల్‌కు 10-12 డాలర్ల మేరకు స్థిరమైన తగ్గింపు ఉంటుందని, ఫలితంగా 3 బిలియన్ డాలర్ల మేరకు ఆదా అవుతుందని తెలిపింది. రాయితీపై కొనుగోలు చేస్తున్న రష్యా చమురును తగ్గించినప్పటికీ వెనిజువెలాతో మేలు కలుగుతుందని పేర్కొంది. దేశ వార్షిక ముడి చమురు దిగుమతి బిల్లులో 3 బిలియన్ డాలర్ల మేరకు తగ్గుతుందని తెలిపింది. చమురు దిగుమతిలో ఇదొక వ్యూహాత్మక మలుపుగా ఎస్‌బీఐ అభివర్ణించింది. ప్రస్తుతం రష్యా 60 డాలర్లకు బ్యారెల్ చమురు విక్రయిస్తోందని, వెనెజువెలా క్రూడాయిల్ బ్యారెల్ ధర 51 డాలర్లుగా ఉందని తెలిపింది. వాణిజ్య వ్యూహాలలో భాగంగా ఒక్కరిపైనే ఆధారపడకుండా వైవిధ్య భరితమైన మార్పుతో దీర్ఘకాలిక విజయం సాధించవచ్చని తెలిపింది.

ఆన్‌లైన్ గేమ్‌కు బానిసలై..
అక్కాచెల్లెళ్ల ఆత్మహత్యలు


(మొదటిపేజీ తరువాయి)

ఘజియాబాద్‌లో చోటుచేసుకుంది. కొరియా ఆన్‌లైన్ గేమ్‌కు బానిసలై ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఆత్మహత్య చేసుకున్నారు. తల్లిదండ్రులు వారికి ఫోన్ ఇవ్వకపోవడం వల్ల మనస్తాపానికి గురై 9వ అంతస్తు నుంచి దూకేశారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో ఓ రెసిడెన్షియల్ టౌన్‌షిప్‌లో నివసిస్తున్న చేతన్‌కుమార్‌కు ఇద్దరు భార్యలు. ఐదుగురు సంతానం. వారిలో ముగ్గురు అక్కాచెల్లెళ్లు నిషిక(16), ప్రాచి(14), పాఖి(12)లకు కరోనా సమయంలో మొబైల్ ఫోన్ అలవాటైంది. తర్వాత ఆన్‌లైన్ గేమ్స్ ఆడడం వ్యసనంగా మారింది. చదువును కూడా పక్కనపెట్టేశారు. బడి మానేశారు. వారి ప్రవర్తనపై ఆందోళనకు గురైన తల్లిదండ్రులు.. ఫోన్ వాడకం తగ్గించాలంటూ పిల్లలను మందలించేవారు. వారికి ఫోన్ అందుబాటులో లేకుండా చేశారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి అక్కాచెల్లెళ్లు ముగ్గురూ గదిలోకి వెళ్లి గడియ పెట్టుకున్నారు. చేతన్‌కుమార్ ఉంటున్న ఫ్లాట్ 9వ అంతస్తులో ఉంది. అర్ధరాత్రి 2 గంటల సమయంలో అక్కాచెల్లెళ్లు బాల్కనీలోకి వెళ్లి, ఒకరి తర్వాత ఒకరు కిందకి దూకేశారు. వెంటనే వారిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆ బాలికలు చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాగా, గేమ్ టాస్క్‌లో భాగంగానే వారు ఆత్మహత్య చేసుకున్నారన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

సూసైడ్ నోట్ స్వాధీనం..

అక్కాచెల్లెళ్లు ముగ్గురు ఉండే గదిలో పోలీసులు సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకొన్నారు. 'ఈ డైరీలో ఉన్న సమాచారం మొత్తాన్ని చదవండి. ఎందుకంటే అదంతా నిజం. ఇప్పుడే చదవండి. రియల్లీ సారీ, సారీ నాన్నా' అని వారు అందులో రాశారు. ఆ డైరీలో తాము కొరియా సంస్కృతిని ప్రేమిస్తున్నట్లు బాలికలు రాసుకున్నారు. కాగా, ఆ ముగ్గురూ కొరియన్ గేమ్‌కు బానిసలైనట్లు ప్రాథమికంగా గుర్తించామనిఏసీపీ అతుల్‌కుమార్ చెప్పారు. కొరియన్ గేమ్‌ను ముగ్గురూ కలిసే ఆడేవారని పోలీసులు వెల్లడించారు. అయితే, టాస్క్ గేమ్ వల్లే చనిపోయారా అనేది తేలాల్సి ఉందన్నారు. తన కుమార్తెలు ఆడే కొరియన్ గేమ్‌కు టాస్క్ ఉందని తనకు తెలియదని తండ్రి చేతన్‌కుమార్ వాపోయారు. "రెండున్నరేళ్లుగా వారు ఆన్‌లైన్ గేమ్ ఆడుతున్నారు. ఎప్పుడూ ఫోన్లు పట్టుకొని గదిలోనే ఉండేవారు" అని తెలిపారు. కుమార్తెలు తరచూ తాము కొరియా వెళ్తామని చెప్పేవారన్నారు.

పిల్లలు దూకిన భవనం ఇదే



టెన్త్ ఇన్విజిలేషన్‌లో ఆటోమేషన్

» సాఫ్ట్‌వేర్‌తో ఇన్విజిలేటర్ల నియామకం

» మాన్యువల్ విధానానికి విద్యాశాఖ స్వస్తి



అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణలో పాఠశాల విద్యాశాఖ కీలక మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇన్విజిలేషన్ అంశాల్లో ముఖ్యమైన మార్పులు తీసుకొస్తోంది. దీనిలో భాగంగా ఇన్విజిలేటర్లను మాన్యువల్‌గా కేటాయించే విధానానికి స్వస్తి పలకనుంది. ఈ స్థానంలో ఆటోమేషన్ విధానాన్ని తీసుకురానున్నారు. ఈ మేరకు విద్యా శాఖ కీలక ప్రతిపాదనలు సిద్ధం చేసింది. గురువారం మంత్రి నారా లోకేశ్ వద్ద ఈ అంశాలపై చర్చించి తుది నిర్ణయం తీసుకుంటారు. టెన్త్ పబ్లిక్ పరీక్షలకు తొలి నుంచీ మాన్యువల్ విధానంలోనే ఇన్విజిలేటర్లను కేటాయిస్తున్నారు. డీఈవో, ఎంఈవోల విచక్షణాధికారంతో ఇన్విజిలేటర్లను పరీక్షా కేంద్రాలకు పంపుతున్నారు. అయితే, ఇక నుంచి మాన్యువల్ స్థానంలో ఆటోమేషన్ విధానం తీసుకొస్తున్నారు. దీనికిగాను సాఫ్ట్‌వేర్ కూడా రూపొందించారు. ఏ టీచర్‌ను ఎక్కడకు పంపాలనేది ఆటోమేషన్‌లో భాగంగా సాఫ్ట్‌వేరే నిర్ణయిస్తుంది. ఈ విధానంలో 8 నుంచి 10 కిలోమీటర్ల పరిధిని పెట్టనున్నారు. టీచర్ ప్రస్తుత పాఠశాల నుంచి ఆ దూరంలోని పరీక్ష కేంద్రానికే కేటాయిస్తారు. అలాగే ప్రస్తుత విధానంలో ఏదైనా ఒక సబ్జెక్టు పరీక్ష జరిగే సమయంలో ఆ సబ్జెక్టు టీచర్లకు ఇన్విజిలేషన్ డ్యూటీ వేయరు. ఇకపై గణితం, సైన్స్, సోషల్(గ్రూపు సబ్జెక్టులు) పరీక్షలు జరిగేటప్పుడు భాషా సబ్జెక్టుల టీచర్లను.. భాషా పరీక్షలు జరిగే సమయంలో గ్రూపు సబ్జెక్టుల టీచర్లను ఇన్విజిలేటర్లుగా నియమించాలని నిర్ణయించారు. అలాగే అనారోగ్య సమస్యలున్న టీచర్లకు కొన్ని మినహాయింపులుంటాయి. ఈ నిబంధనల ప్రామాణికంగానే టీచర్లకు సాఫ్ట్‌వేర్ ఇన్విజిలేటర్ బాధ్యతలు కేటాయిస్తుంది. ఫలితంగా ఇన్విజిలేషన్ కేటాయింపు విషయంలో టీచర్లు, అధికారుల జోక్యం, నిబంధనల ఉల్లంఘనలు ఉండవని పాఠశాల విద్యాశాఖ భావిస్తోంది. ఇక, ఇన్విజిలేషన్‌కు ప్రైవేటు టీచర్లను కూడా వినియోగించాలని పాఠశాల విద్యాశాఖ ప్రతిపాదించింది. టెన్త్ పరీక్షల నిర్వహణకు 33వేల మంది టీచర్లు అవసరమవుతారు. ప్రైవేటు బడుల్లోనూ ప్రభుత్వ టీచర్లే ఇన్విజిలేటర్లుగా వ్యవహరిస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వ పాఠశాలల్లో బోధన, అభ్యసన కార్యకలాపాలు దెబ్బతింటున్నాయి. ప్రైవేటు పాఠశాలల్లో అడ్మిషన్లు, అకడమిక్ పనులు కొనసాగుతున్నాయి. దీనివల్ల 20 శాతం మంది ప్రైవేటు టీచర్లను ఇన్విజిలేటర్లుగా నియమించాలని భావిస్తున్నారు.

టెన్త్ విద్యార్థులకు సీజనల్ హాస్టళ్లు

» రాష్ట్రవ్యాప్తంగా సుమారు 50 ఏర్పాటు

అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): బడులకు దీర్ఘకాలికంగా సెలవు పెట్టిన, సక్రమంగా రాని విద్యార్థుల కోసం సీజనల్ హాస్టళ్లు ఏర్పాటు చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలులో భాగంగా వీటిని ఏర్పాటు చేయనున్నారు. సమగ్రశిక్ష నిధులతో రాష్ట్రవ్యాప్తంగా డివిజన్ స్థాయిలో సుమారు 50 హాస్టళ్లను వచ్చే సోమవారం నుంచి అందుబాటులోకి తీసుకురానున్నారు. దీనికిగాను క్షేత్రస్థాయిలో పాఠశాల విద్యాశాఖ అధికారులు చర్యలు ప్రారంభించారు. పాఠశాలలకు సక్రమంగా రాని విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్నారు. సీజనల్ హాస్టళ్లలో వసతితో పాటు భోజనం సౌకర్యం కల్పిస్తారు. కొందరు టీచర్లను కేటాయించి తరగతులు నిర్వహిస్తారు. రోజూ కొన్ని సబ్జెక్టుల టీచర్లను సీజనల్ హాస్టళ్లకు నియమిస్తారు. విద్యార్థుల భద్రత కోసం వాచ్‌మెన్, నిర్వాహకులను నియమించనున్నారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలులో భాగంగా రోజూ స్లిప్ టెస్టులు నిర్వహించి, మార్కులు 'లీప్' యాప్‌లో అప్‌లోడ్ చేయాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది. వాటిని పరిశీలించిన ఉన్నతాధికారులు సుమారు 20వేల మంది టెస్టులు రాయడం లేదని గుర్తించారు. వారంతా దీర్ఘకాలికంగా సెలవులో ఉన్నారని తేలింది. అలాంటి వారిని తిరిగి బడులకు రప్పించే లక్ష్యంతో సీజనల్ హాస్టళ్లను నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది.

ఆ మార్గదర్శకాలపై పోలీసులు, మేజిస్ట్రేట్‌లకు శిక్షణ ఇప్పించండి

» ఏడేళ్లలోపు శిక్షకు వీలున్న కేసుల అంశంపై హైకోర్టులో పిల్

» న్యాయవాది శివప్రసాద్‌రెడ్డి వైఖరిపై ధర్మాసనం మండిపాటు

» దూకుడు తగ్గించుకోవాలని హితవు.. పిల్ కొట్టివేత

అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):ఏడేళ్లలోపు శిక్షకు వీలున్న కేసుల్లో సైతం నిందితులను పోలీసులు అరెస్ట్ చేస్తున్నారని, మేజిస్ట్రేట్‌లు వారికి యాంత్రికంగా రిమాండ్ విధిస్తున్నారని, అర్నేష్‌కుమార్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలపై పోలీసులకు, మేజిస్ట్రేట్‌లకు శిక్షణ ఇప్పించాలని దాఖలైన పిల్‌ను హైకోర్టు కొట్టివేసింది. బుధవారం పిల్‌పై విచారణ ప్రారంభమైన వెంటనే ప్రభుత్వ న్యాయవాది అభ్యర్థన మేరకు కౌంటర్ వేసేందుకు మరికొంత సమయం ఇస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది. ఈ దశలో పిటిషనర్ తరపు న్యాయవాది గుండాల శివప్రసాద్ రెడ్డి అనుచితంగా ప్రవర్తించారు. దీంతో ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. కోర్టు విచారణలకు అవరోధం కలిగిస్తే చర్యలకు ఆదేశిస్తామని హెచ్చరించింది. దూకుడు తగ్గించుకోవాలని హితవు పలికింది. న్యాయవాది వైఖరితో విసుగెత్తిన ధర్మాసనం పిల్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. తమ ఉత్తర్వులపై అభ్యంతరం ఉంటే సుప్రీంకోర్టుకు వెళ్లాలని తేల్చిచెప్పింది. బుధవారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చింది. న్యాయవాది పామర్తి రత్నాకర్ హైకోర్టులో ఈ పిల్ దాఖలు చేశారు.

చట్టాన్ని అనుసరించాల్సిందే దాని ప్రకారమే శాంతి భద్రతలు

» పోలీసులకు హైకోర్టు స్పష్టీకరణ

అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలు కాపాడే క్రమంలో పోలీసులు చట్ట నిబంధనలు అనుసరించాల్సిందేనని హైకోర్టు స్పష్టం చేసింది. వివిధ కేసుల్లో అరెస్టు చేసిన నిందితులను ఎందుకు నిర్వహిస్తున్నారో పోలీసులను ప్రశ్నించింది. నేర నిరూపణ జరిగే వరకు నిందితులు అమాయకులేనని పేర్కొంది. నిందితులతో పరేడ్ నిర్వహిస్తున్నారంటూ దాఖలైన పిల్‌పై కౌంటర్ దాఖలు చేయాలని వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న హోంశాఖ ముఖ్యకార్యదర్శి, డీజీపీ, తూర్పుగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల ఎస్పీలకు నోటీసులు జారీచేసింది. విచారణను ఏప్రిల్ 18 వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. నిందితులను వీధుల్లో నడిపిస్తూ పరేడ్ నిర్వహించడంతో పాటు వారిని మీడియా ముందు ప్రవేశ పెట్టడాన్ని సవాల్ చేస్తూ.. సొసైటీ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ ప్రాపర్టీ, ఎన్విరాన్‌మెంటల్ సంస్థ అధ్యక్షుడు పరసా సురేశ్‌కుమార్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. న్యాయవాది జడ శ్రవణ్‌కుమార్ వాదనలు వినిపించారు.

జిల్లా న్యాయవాద సంఘాల ఎన్నికల్లో.. మహిళలకు 33% రిజర్వేషన్ కల్పించండి

అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని జిల్లా న్యాయవాద సంఘాల ఎన్నికల్లో మహిళా న్యాయవాదులకు 33శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ న్యాయవాది తోట సునీత దాఖలు చేసిన పిల్‌పై హైకోర్టు స్పందించింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, ఏపీ బార్ కౌన్సిల్‌కు నోటీసులిచ్చింది. తదుపరి విచారణను ఏప్రిల్ 16 వాయిదా వేసింది. ఈమేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్ ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది.

బీసీ జనగణన తర్వాతే స్థానిక ఎన్నికలు.. హైకోర్టులో పిల్

అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీ జనగణన జరిపిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు దాఖలు చేసిన పిల్ బుధవారం మరోసారి విచారణకు వచ్చింది. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ఎస్.ప్రణతి స్పందిస్తూ కౌంటర్ వేసేందుకు మరికొంత సమయమివ్వాలని అభ్యర్థించారు. అంగీకరించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్ ధర్మాసనం తదుపరి విచారణను ఈనెల 18కి వాయిదా వేసింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సత్యప్రసాద్ వాదనలు వినిపించారు.

లండన్ నుంచి ఖతార్‌కు నారాయణ బృందం



ఒలింపిక్ ఇంటర్నేషనల్ స్టేడియంలో మంత్రి నారాయణ, అధికారుల బృందం

అమరావతి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): లండన్‌లో మంత్రి నారాయణ బృందం రెండో రోజు పర్యటనలో భాగంగా బుధవారం లండన్ స్ట్రాట్‌ఫోర్డ్‌లోని క్వీన్ ఎలిజబెత్ ఒలింపిక్ పార్క్‌ను సందర్శించింది. లండన్ స్టేడియం, లండన్ ఆక్వాటిక్స్ సెంటర్, హైస్‌పార్క్, లీవ్యాలీ వెలోపార్క్‌ల నిర్వహణను అధ్యయనం చేసింది. ఫుట్‌బాల్, రగ్బీ, బేస్‌బాల్ గేమ్స్ నిర్వహించే లండన్ స్టేడియంలో ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. అనంతరం మంత్రి బృందం.. ఖతార్ బయలుదేరి వెళ్లింది. ఖతార్ రాజధాని దోహాలో స్పోర్ట్స్ సిటీని సందర్శించారు. అమరావతిలో అంతర్జాతీయ స్పోర్ట్స్ సిటీ నిర్మాణానికి ప్రణాళిక గురించి దోహా అధికారులతో మంత్రి చర్చించారు.

మంత్రి కొండపల్లికి అంతర్జాతీయ అవార్డు

అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు అంతర్జాతీయ పురస్కారం లభించింది. అమెరికాలోని వాషింగ్టన్ డీసీ కేంద్రంగా చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి కోసం పనిచేస్తున్న యూఎస్-ఇండియా ఎస్ఎంఈ కౌన్సిల్ ఈ అవార్డును ప్రకటించింది. అమెరికా అధ్యక్షుడి పేరుతో ఇచ్చే 'ది ప్రెసిడెంట్స్ వాలంటీర్ సర్వీస్ అవార్డు'ను యూఎస్-ఇండియా ఎస్ఎంఈ కౌన్సిల్ సీఈవో ఎలీషా పిపులివర్తి ప్రకటించారు.

ఆయిల్‌పామ్ ఓఈఆర్ 20.01 శాతానికి పెంపు

అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆయిల్‌పామ్ తాజా పండ్ల గెలలకు సంబంధించి చమురు ఉత్పత్తి రేటు (ఓఈఆర్. నూనె శాతం)ను 20.01 శాతానికి పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2025 నవంబరు నుంచి 2026 అక్టోబరు(ఆయిల్ ఇయర్) వరకు 10.08 శాతం ఆయిల్‌పామ్ గింజల రికవరీతో ఓఈఆర్ 20.01 శాతంగా నిర్ణయించింది. ఈమేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఉగాది పురస్కారాల దరఖాస్తులకు ఆహ్వానం

అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకల సందర్భంగా వివిధ రంగాల్లోని ప్రముఖులకు ఉగాది, కళారత్న పురస్కారాలను ప్రదానం చేస్తామని రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి ముఖ్య కార్యనిర్వాహణ అధికారి ఆర్.మల్లికార్జునరావు తెలిపారు. సాహిత్యం, సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, శిల్పం, నాటకం, జానపదం, మిమిక్రీ, అవధానం, వైద్యం, ఇంద్రజాలం... మొత్తం 14 రంగాలకు చెందిన ప్రముఖులతో పాటు కమిటీ సిఫార్సు చేసిన ఇతర సేవారంగాల్లో నిష్ణాతులైన వారికి 15వ విభాగంలో అవార్డులు అందిస్తారు. ఆసక్తి కలిగిన వారు బయోడేటాను ఫిబ్రవరి 20 నాటికి రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి సీఈవోకి పంపించాలి. లేదా 'ఏపీక్రియేటివ్.ఉగాది2026@జీమెయిల్.కామ్'కు మెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రజల్లో సంతృప్తి పెంచేలా పనిచేయాలి: డోలా

అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రజల్లో సంతృప్తి పెంచేలా లక్ష్యంగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు పనిచేయాలని ఆ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సూచించారు. బుధవారం ఆయన తన శాఖపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల రేషనలైజేషన్, పదోన్నతులు, మూడంచెల వ్యవస్థపైనా చర్చించారు. ఉద్యోగులందరికీ పదోన్నతులు కల్పించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. సిబ్బంది పనితీరుపై ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నామని చెప్పారు.

మార్చిలోపు దివ్యాంగ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న దివ్యాంగ బ్యాక్‌లాగ్ పోస్టులు ఈ ఏడాది మార్చిలోపు భర్తీ చేయాలని దివ్యాంగులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అధికారులను ఆదేశించారు. దివ్యాంగ పాఠశాలల్లో వంద శాతం అడ్మిషన్లు పూర్తి కావాలని చెప్పారు. విద్యార్థులకు మెనూ అమలులో రాజీపడొద్దన్నారు. త్రీవీలర్ మోటార్ సైకిళ్ల పంపిణీకి లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు.

ఆలయాల్లో రద్దీని నియంత్రించండి: దేవదాయ శాఖ

అమరావతి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి, కార్తీకమాసంతో పాటు ఇతర పర్వ పవిత్ర దినాల్లో దేవాలయాల్లో భక్తుల రద్దీ నియంత్రణపై దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేశారు. వీటిని బుధవారం రాష్ట్రంలోని ఆలయాల ఈవోలకు పంపించారు. కార్తీక మాసం, ఆదివారం, సోమవారం, పౌర్ణమి, ఏకాదశి వంటి పర్వదినాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని, ఆ రద్దీ నియంత్రణతోపాటు తగ్గరాదనిర్వహణ కల్పించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు.

రాష్ట్రానికి అమెరికా నుంచి పెట్టుబడులు!

అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): అమెరికా నుంచి పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చేలా, ఎస్ఎంఈల భాగస్వామ్యం పెంచడం కోసం యూఎస్-ఇండియా ఎస్ఎంఈ కౌన్సిల్ రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఆ కౌన్సిల్ సీఈవో ఎలీషా పిపులివర్తి, వైస్ ప్రెసిడెంట్ క్రిస్టోఫర్, ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవో విశ్వమనోహరన్, డాక్టర్ శంకర్‌ప్రసాద్ ఎంవోయూపై సంతకాలు చేశారు.

అధికారులు పాలకుల్లా వ్యవహరిస్తున్నారు

» ప్రజా సేవకులమనే విషయాన్ని మరిచిపోతున్నారు: హైకోర్టు

అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయా(కేజీబీవీ)ల్లో పీజీటీల నియామకానికి సంబంధించి సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేస్తామన్న హామీని అధికారులు ఉల్లంఘించడంపై హైకోర్టు తీవ్రంగా మండిపడింది. "కోర్టులు ఏం చేస్తాయిలే అనుకునే అధికారులను ఎవరూ కాపాడలేరు." అని హెచ్చరించింది. కొందరు అధికారులు తాము ప్రజా సేవకులమనే విషయాన్ని మర్చిపోయి పాలకుల్లా వ్యవహరిస్తున్నారని ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఆదేశాలు అమలు చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించింది. తమ ఆదేశాలను దిగువస్థాయి అధికారులు పాటించలేదని చెబితే సరిపోదని, అలాంటి అధికారులపై తీసుకున్న చర్యలను కోర్టు ముందు ఉంచినప్పుడే ఉన్నతాధికారుల వివరణను పరిగణనలోకి తీసుకుంటామని స్పష్టంచేసింది. సింగిల్ జడ్జి ఆదేశాల అమలుకు తీసుకున్న చర్యలను అఫిడవిట్ రూపంలో తమ ముందు ఉంచాలని సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావును ఆదేశించింది. మరోవైపు కేజీబీవీల విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని ధర్మాసనం తప్పుపట్టింది. తమ వాటా నిధులు విడుదల చేస్తే సరిపోతుందని కేంద్రం భావిస్తోందని, పథకం అమలు గురించి పట్టించుకోవడం లేదని వ్యాఖ్యానించింది. దీంతో పథకం ఉద్దేశం నెరవేరట్లేదని ఆక్షేపించింది. బాధ్యతల నుంచి ప్రభుత్వాలు తప్పుకున్నా, న్యాయస్థానాలు తప్పుకోవని తేల్చిచెప్పింది. విచారణను 2 వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ అవధానం హరిహరనాథశర్మతో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. కేజీబీవీల్లో పార్ట్‌టైం పీజీటీలుగా పనిచేస్తున్న తమను అర్ధాంతరంగా తొలగించడాన్ని సవాల్ చస్తూ 2023లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు పిటిషనర్లను కొనసాగించాలని ఆదేశిస్తూ 2023, డిసెంబర్ 5న తీర్పు ఇచ్చారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ అధికారులు 2024, జనవరిలో ధర్మాసనం ముందు అప్పీల్ వేశారు. ఈ అప్పీల్ ఇటీవల ధర్మాసనం ముందు విచారణకు రాగా సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ హామీ పూర్తిస్థాయిలో అమలుకాకపోవడంతో సర్వశిక్ష అభియాన్ పీడీ శ్రీనివాసరావుపై సుమోటోగా కోర్టుధిక్కరణ చర్యలు ప్రారంభించింది. బుధవారం విచారణ ప్రారంభమైన వెంటనే... సింగిల్ జడ్జి ఆదేశాలు, ధర్మాసనానికి ఇచ్చిన హామీని ఎందుకు అమలు చేయలేదని శ్రీనివాసరావును కోర్టు ప్రశ్నించింది. కింది స్థాయి అధికారులు అమలు చేయలేదని, వారికి నోటీసులు ఇచ్చానని శ్రీనివాసరావు సమాధానం ఇచ్చారు. నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారా? అని ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది.

మరో ఏడాది ఇలా కష్టపడితే చాలు

» స్టీల్ ప్లాంట్ సమస్యలన్నీ తీరిపోతాయి

» ఉత్పత్తి వ్యయం మరింత తగ్గించాలి

» కేంద్ర ఉక్కు కార్యదర్శి సందీప్ పౌండ్రిక్



కేంద్ర ఉక్కు కార్యదర్శి సందీప్ పౌండ్రిక్

విశాఖపట్నం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు ఇంకో ఏడాది ఇదేవిధంగా కష్టపడితే సమస్యలన్నింటినీ అధిగమిస్తామని కేంద్ర ఉక్కు శాఖ కార్యదర్శి సందీప్ పౌండ్రిక్ అన్నారు. బుధవారం ప్లాంట్‌ను సందర్శించిన ఆయన ఎంపిక చేసిన 400 మందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ ఉక్కుపై కేంద్ర ఉక్కు, ఆర్థిక శాఖలకు ఇప్పటివరకూ ఉన్న అభిప్రాయం పూర్తిగా మారిపోయిందని వ్యాఖ్యానించారు. చాలా తక్కువ అంచనాలతో ఆర్థిక ప్యాకేజీ అందిస్తే ఉద్యోగులు లక్ష్యాలను అధిగమించి చాలా గొప్ప ఫలితాలు సాధించారని సందీప్ ప్రశంసించారు. ఉత్పత్తి వ్యయం టన్నుకు రూ.48వేలు అవుతోందని, దానిని రూ.40వేల నుంచి రూ.42 వేల మధ్యకు తీసుకురావాలని సూచించారు. కొత్త ఎగ్జిక్యూటివ్‌ల నియామకం మొదలవుతుందని, అదేవిధంగా ఏప్రిల్ నుంచే పనితీరు ఆధారంగా ప్రమోషన్లు కూడా ఇస్తారని సందీప్ చెప్పారు. సీఎండీ మనీష్‌రాజ్ గుప్తా మాట్లాడుతూ, ఉద్యోగుల వ్యక్తిగత సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు ఇంకో రెండు నెలల్లో తొలగిపోతాయని అన్నారు. విశాఖ ఉక్కు పనితీరు సెయిల్ ప్లాంట్ల కంటే గొప్పగా ఉందని ప్రశంసించారు. ఉత్పత్తి వ్యయం తగ్గించడానికి అందరూ సహకరించాలని కోరారు.

యూరప్‌కు 38 శాతం పెరిగిన ఆక్వా ఎగుమతులు

» సీఫుడ్ ఎగుమతిదారుల సంఘం జాతీయ అధ్యక్షుడు పవన్‌కుమార్

విశాఖపట్నం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): అమెరికా దిగుమతి సుంకాలు పెంచడం వల్ల... గత ఆరు నెలల్లో యూరప్ దేశాలకు ఆక్వా ఎగుమతులు 38శాతం పెరిగాయని సీఫుడ్ ఎగుమతిదారుల సంఘం జాతీయ అధ్యక్షుడు పవన్‌కుమార్ తెలిపారు. విశాఖపట్నంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూరప్ దేశాలతో ఇటీవల కుదిరిన 'ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్' (ఎఫ్‌టీఏ) ఫలితంగా ఆక్వా ఉత్పత్తుల ఎగుమతులు మరింత పెరుగుతాయన్నారు. అమెరికా భారీగా సుంకాలు పెంచగానే తాము కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించగా.. ఆర్థిక, వాణిజ్య శాఖలు తక్షణమే స్పందించి తగిన చర్యలు చేపట్టాయన్నారు. ఏపీలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో ఎగుమతులకు ప్రత్యామ్నాయ మార్కెట్లు లభించాయన్నారు. వారందరికీ ఆక్వా ఎగుమతిదారుల తరపున కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు. ఇప్పుడు అమెరికాతో కూడా వాణిజ్య ఒప్పందం కుదరడంతో అన్ని సమస్యలు తీరిపోయాయని, గతం కంటే రెట్టింపు ఎగుమతులు చేసే అవకాశం ఉందన్నారు. అమెరికాకు ఏటా 2.8 బిలియన్ డాలర్ల విలువైన ఆక్వా ఉత్పత్తులు ఎగుమతి చేస్తామని, సుంకాల కారణంగా ఏడు శాతం వ్యాపారం తగ్గిందని ఏపీ సంఘం అధ్యక్షులు ఆనంద్ తెలిపారు. యూరప్ దేశాలకు ఏటా 1.1 బిలియన్ డాలర్ల ఎగుమతులు చేస్తుండగా, గత ఆరు నెలల్లో వ్యాపారం 38 శాతం పెరిగిందన్నారు. యూరప్‌లో సుమారు 102 కొత్త యూనిట్లకు అనుమతి లభించిందన్నారు. ఏపీ సంఘం సెక్రటరీ దిలీప్ మాట్లాడుతూ ఆక్వా రైతులు ప్రతి చెరువుకు జియోట్యాగింగ్ చేసుకోవాలని, మందులు ఉపయోగించవద్దని సూచించారు. మందులు వాడితే సరుకును ఆయా దేశాలు వెనక్కి పంపుతాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.

జోగి నేరచరితుడు

» అరెస్టు నుంచి రక్షణ పొందేందుకు అనర్హుడు: పీపీ

అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత జోగి రమేశ్ కులాలు, ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారని పోలీసులు హైకోర్టుకు నివేదించారు. సీఎం చంద్రబాబును, మంత్రి లోకేశ్‌ను అసభ్య పదజాలంతో దూషించారని.. నేరచరితుడైన ఆయనకు అరెస్టు నుంచి రక్షణ కల్పించవద్దని కోరారు. శ్రీవారి లడ్డూ కల్తీ వ్యవహారాన్ని పక్కదోవ పట్టించేలా జోగి జనవరి 31న ప్రెస్‌మీట్ పెట్టి చంద్రబాబు, లోకేశ్‌పై అనుచిత, అసభ్యకర వ్యాఖ్యలు చేశారంటూ తిరుపతి గ్రామీణ మండలం టీడీపీ అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి చేసిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదుచేశారు. ఎన్టీఆర్ జిల్లా మూలపాడుకు చెందిన కాకి నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు మరో కేసు నమోదు చేశారు. ఈ రెండు కేసులను కొట్టివేయాలని కోరుతూ జోగి రమేశ్ బుధవారం హైకోర్టును ఆశ్రయించారు. అరెస్టుతో పాటు తొందరపాటు చర్యలు తీసుకోకుండా పోలీసులను నిరోధించాలని కోరుతూ అనుబంధ పిటిషన్ వేశారు. ఆయన తరపున సీనియర్ న్యాయవాది ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపించారు. 'పిటిషనర్ కేవలం రాజకీయ విమర్శలే చేశారు. పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు ఆయనకు వర్తించవు. ప్రాథమిక విచారణ లేకుండానే కేసు నమోదు చేశారు. పోలీసులు పేర్కొన్న సెక్షన్లన్నీ ఏడేళ్లలోపు శిక్షకు వీలున్నవే. అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వండి' అని కోరారు. పోలీసుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపించారు. 'కల్తీ మద్యం కేసులో బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత జోగి రమేశ్ ప్రెస్‌మీట్‌లు పెట్టి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు తీవ్ర పదజాలంతో దూషించి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం అలవాటుగా మారింది. అరెస్టు నుంచి రక్షణ పొందేందుకు పిటిషనర్ అనర్హుడు. ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులూ జారీచేయొద్దు' అని అభ్యర్థించారు. ఇరుపక్షాల వాదనలు ముగియడంతో న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి మధ్యంతర ఉత్తర్వుల జారీపై నిర్ణయాన్ని వాయిదా వేశారు.



మామిడి తాండ్ర తయారీ యంత్రాన్ని చూపిస్తున్న శాస్త్రవేత్త వాసుదేవరావు

మామిడి తాండ్ర తయారీ ఇక సులువు

» కొత్త యంత్రాన్ని ఆవిష్కరించిన బాపట్ల పీహెచ్‌టీసీ శాస్త్రవేత్తలు

బాపట్ల, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో మామిడి తాండ్రకు ఎంతో ఆదరణ ఉంటుంది. రుచికరంగా ఉండే ఈ మామిడి తాండ్ర.. తయారీనే పెద్ద ప్రాసెస్..! మాన్యువల్‌గా మూడు దశల్లో చేపట్టే ఈ ప్రక్రియలో.. తొలుత మామిడికాయల నుంచి గుజ్జు తీస్తారు. దానికి చక్కెర లేదా బెల్లం కలిపి ఉడికిస్తారు. ఆపై దాన్ని పొరలుగా చేసి చాపలపై ఆరబెడతారు. పూర్తిగా ఎండిన తర్వాత ముక్కలుగా కోసి ప్యాక్ చేస్తారు. దీనికి కొన్నిరోజుల సమయం పడుతుంది. అయితే.. బాపట్ల పోస్ట్‌హార్వెస్ట్ టెక్నాలజీ సెంటర్ (పీహెచ్‌టీసీ) శాస్త్రవేత్తలు మామిడి తాండ్ర తయారీ యంత్రాన్ని రూపొందించారు. పరిశుభ్రతకు పెద్దపీట వేస్తూ.. రోజుల తరబడి ఆరబెట్టే పని లేకుండా.. 12 గంటల్లోనే నాణ్యమైన తాండ్రను ఈ యంత్రంతో తయారు చేయవచ్చు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వాసుదేవరావు కృషి ఫలితంగా ఈ యంత్రం అందుబాటులోకి వచ్చింది. ఈ యంత్రంలో ఏర్పాటు చేసిన 5 అరల్లో ఒక్కసారి 25 కిలోల మామిడి గుజ్జు వేస్తే.. 12.5 కిలోల తాండ్ర వస్తుందని .వాసుదేవరావు తెలిపారు. అరల సంఖ్య పెరిగే కొద్దీ ఉత్పత్తి పెరుగుతుందన్నారు. 'ఈ యంత్రం సాయంతో మామిడి తాండ్ర తయారీకి 12 గంటల సమయమే పడుతుంది. పైన, కింద అరల్లో వేడినీళ్లు ఉంటాయి. మధ్య ఉన్న 5 అరల్లో మామిడి గుజ్జు పోస్తాం. బయట వాతావరణంతో పనిలేకుండా పూర్తిగా ఆరిపోయి నాణ్యమైన మామిడి తాండ్ర తయారవుతుంది. యంత్రం ఖరీదు సుమారు రూ.3లక్షలు. రైతుల కోసం రూ.2లక్షల్లోపే రూపొందించేలా చర్యలు చేపట్టాం' అని వాసుదేవరావు తెలిపారు.

'మన మిత్ర'కు హాయ్ చెబితే చాలు..

» సేవ, సమస్య... ఏదైనా వాట్సాప్‌లోనే పరిష్కారం

» 9552300009 నంబరుతో ఏపీ పౌర సేవలు

» వెయ్యికిపైగా సేవలు వాట్సాప్ గవర్నెన్స్‌లో లభ్యం

» బిల్లుల చెల్లింపు నుంచి పట్టాదారు పాసుపుస్తకాల వరకు

» ఇప్పటి వరకూ 50 లక్షల మందికి 2.5 కోట్లకుపైగా పనులు



అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మీకు స్మార్ట్ ఫోన్, వాట్సాప్ ఉందా..! మీ వాట్సాప్ సెల్ నంబరు ఆధార్‌కు లింకై ఉందా? ఉంటే మీ వాట్సాప్‌లో 9552300009 నంబరు టైప్ చేయగానే... 'మన మిత్ర' స్పందిస్తుంది. ఏపీ పౌర సేవలు వాట్సాప్ గవర్నెన్స్ అంటూ చాట్ ఓపెన్ అవుతుంది. దానిలో హాయ్ అని టైప్ చేస్తే చాలు... మీరు ఏదైనా సమస్య(గ్రీవెన్స్) లేదా ఫీడ్‌బ్యాక్ చెప్పాలనుకుంటే మాకు తెలియచేయండి అంటూ ఒక మెసేజ్ వస్తుంది. ఆ వెంటనే 'మన మిత్ర' (వాట్సాప్ గవర్నెన్స్)కు స్వాగతం అంటూ మరో మెసేజ్ వస్తుంది. దానికింద 'సేవను ఎంచుకోండి' అంటూ ఆకుపచ్చ రంగులో దర్శనమిస్తుంది. సమస్య అయినా, సేవ అయినా అంతా వాట్సాప్‌లోనే పని అయిపోతుంది. భాషా సమస్య కూడా లేదు. తెలుగు లేదా ఇంగ్లీషును మీరు ఎంచుకోవచ్చు. మన మిత్రను ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకూ 50 లక్షల మంది వినియోగదారులకు రెండున్నర కోట్లకు పైగా ప్రభుత్వ సేవలు అందాయి. మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌లో 1,000కిపైగా ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉన్నాయి. వాటిని రాష్ట్రంలో నివాసముంటున్న వారే కాదు... రాష్ట్రం వెలుపల నివసిస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారూ వినియోగించుకునే వీలుంది. ఆస్తిపన్ను, విద్యార్హత పత్రాలు, కుల ధృవీకరణ పత్రాలు తదితర ప్రభుత్వ సేవలను వినియోగించుకునేందుకు సంబంధిత కార్యాలయాలకు వెళ్లాల్సి ఉండేది. ఇప్పుడు మన మిత్ర వాట్సాప్ నంబరు 9552300009తో ఈ పనులన్నింటినీ ఇంటి నుంచే చేసుకోవచ్చు. ఆర్టీసీ టికెట్ రిజర్వేషన్, మున్సిపాలిటీలు, పంచాయితీల్లో అస్తిపన్ను, నీటి పన్ను, కరెంటు బిల్లుల చెల్లింపులు, రెవెన్యూ, పోలీసు సేవలు, పింఛన్లు, వివిధ సర్టిఫికెట్లు, ప్రభుత్వం నిర్వహించే పలు ప్రవేశ పరీక్షలకు సంబంధించి హాల్ టికెట్లు, ఫలితాలు ఇందులో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పట్టాదారు పాసుపుస్తకం, వన్ బీ అడంగల్ కాపీలను కూడా మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ సహాయంతో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. చివరికి తిరుమల తిరుపతి దేవస్థానం సేవలు కూడా దీని ద్వారా లభిస్తాయి.

అమ్మో... పెద్దపులి!



సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్న పెద్దపులి ఇదే

» వణుకుతున్న తూర్పుగోదావరి ప్రజలు

దివాన్‌చెరువు/రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): జనారణ్యంలోకి ప్రవేశించిన పెద్దపులి తూర్పుగోదావరి జిల్లా ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. రాజమహేంద్రవరం సమీపంలోని దివాన్‌చెరువులో మంగళవారం రాత్రి ఎస్‌వీపీసీ ఫంక్షన్ హాలు ఎదుట గోడ దూకి తోటలోకి ప్రవేశించిన పులి ఆ తర్వాత రాజానగరం మండలం రఘునాథపురంలో సంచరించింది. అక్కడ ఒక గేదెపై బుధవారం తెల్లవారుజామున దాడిచేసి చంపేయడంతో పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ముందుగా దివాన్‌చెరువు నుంచి శ్రీరామపురం మీదుగా వెళుతూ ఆ గ్రామంలోని మాధవరపు సత్యనారాయణ అనే రైతుకు చెందిన ఆవు దూడపై దాడి చేసి గాయపరిచింది. అక్కడి నుంచి రఘునాథపురం వెళ్లిందని చెబుతున్నారు. ఇది రాజమహేంద్రవరం-విశాఖపట్నం జాతీయ రహదారిని దాటుకుని వెళ్లడం గమనార్హం. గతంలో దివాన్‌చెరువు రిజర్వ్ ఫారెస్ట్‌లో దాదాపు నెలరోజులు మకాం వేసిన చిరుతపులి తర్వాత కడియం మండలంలో కనబడింది. ఆ తర్వాత దాని జాడ లేదు. ఇప్పుడు పెద్దపులి కూడా ఇవే గ్రామాల మీదుగా ప్రయాణిస్తుండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. కాగా, రఘునాథపురంలో గేదెపై పులి దాడి చేసిందన్న సమాచారం అందుకున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఘటనా స్థలాన్ని సందర్శించి, బాధిత రైతును పరామర్శించారు.

శాటిలైట్ సిటీలో సంచారం

ప్రజలను హడలెత్తిస్తున్న పెద్దపులి రఘునాథపురం మీదుగా రాజమహేంద్రవరం రూరల్ మండలం శాటిలైట్ సిటీ పంచాయతీ పరిధిలో ఉన్న అక్కమ్మ కొండపైకి వెళ్లినట్టు అటవీశాఖ అధికారులు గుర్తించారు. పులి సంచరించిన ప్రాంతాలను బుధవారం అటవీశాఖ పీసీసీఎఫ్ చీఫ్, వైల్డ్ లైఫ్ వార్డెన్ ఆఫ్ ఏపీ డాక్టర్ పీవీ చలపతిరావు పరిశీలించారు. అక్కమ్మ కొండ అవతల జీడిమామిడి తోటవైపు దిగి ఉండొచ్చని, ఈరోజు రాత్రికి పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నామని వివరించారు. తడోబా నుంచి బయలుదేరి ఛత్తీస్‌గఢ్ మీదుగా తెలంగాణలోని పాల్వంచ నుంచి ఏపీలోకి ప్రవేశించిన పెద్దపులి ఏలూరు డివిజన్ వైపు వచ్చిందని తెలిపారు. అక్కడినుంచి గోదావరి దాటి ఇటువైపు ప్రవేశించిందని చెప్పారు. పులిని పట్టుకోవడానికి పుణే నుంచి ప్రత్యేక బృందం గురువారం ఉదయానికి చేరుకుంటుందని వెల్లడించారు. ఇక్కడా బృందాలు ఉన్నాయని చెప్పారు. పులి వయస్సు మూడున్నర ఏళ్లు అని, రోజుకి 15- 20 కిలోమీటర్లు ప్రయాణిస్తోందని చలపతిరావు తెలిపారు. మరోవైపు పెద్దపులిని సురక్షితంగా పట్టుకుని అడవికి తరలించి ప్రజలకు రక్షణ కల్పించేందుకు ఏకే 47, ఇన్సాస్ రైఫిళ్లు, డమ్మీ బుల్లెట్లతో పోలీసులు రంగంలోకి దిగారు. బుధవారం ఏఆర్ డీఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో 20 మంది పోలీసుల బృందం అక్కమ్మ కొండ వద్దకు చేరుకొంది.

పారిశ్రామికవేత్తలుగా బీసీలు

(మొదటి పేజీ తరువాయి)

పరికరాలను పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. రూ.60 కోట్ల సాస్కీ నిధులతో రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. 814 బీసీ సంక్షేమ హాస్టళ్లలో రూ.17 కోట్ల వ్యయంతో మార్చిలోగా ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. శానిటేషన్‌తో పాటు విద్యార్థులకు అందించే ఆహార నాణ్యతపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సీఎం స్పష్టం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యాబోధన సహా అన్ని అంశాల్లోనూ ఉత్తమ ఆచరణీయ మార్గాలను అనుసరించాలని, విద్యాపరమైన అంశాల పర్యవేక్షణకు అపార్ ఐడీలను నమోదు చేసి అనుసంధానం చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న బీసీ భవనాలను పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్రంలోని ఆరు మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ స్కూళ్లను జూనియర్ కాలేజీలుగా మార్చాలని ఆదేశించారు. బీసీ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో నెట్ జీరో కాన్సెప్ట్ కూడా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ బీసీ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు ఆలోచన చేస్తున్నామని చెప్పారు. బీసీ స్టడీ సర్కిళ్లను తదుపరి స్థాయికి తీసుకునేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. బీసీలకు కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తోందని, వారికి ప్రయోజనం కలిగేలా పథకాలు రూపొందించాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు.


స్వయం పేరుతో తయారవుతున్న డ్వాక్రా ఉత్పత్తులను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

డ్వాక్రా ఉత్పత్తులకు 'స్వయం' బ్రాండింగ్!

- జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లను ఆకట్టుకునేలా లోగో: సీఎం
- మెజారిటీ ప్రాతిపదికన నిర్ణయం.. సెర్ప్, మెప్మాపై సమీక్షలో సీఎం ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా ఉత్పత్తులకు బ్రాండింగ్ కోసం 'స్వయం' అనే పేరును సీఎం చంద్రబాబు ఖరారు చేశారు. డ్వాక్రా మహిళలు తయారుచేసే ఉత్పత్తులకు బ్రాండింగ్ కల్పించే అంశంపై బుధవారం సచివాలయంలో ఆయన సమీక్షించారు. అధికారులు ప్రతిపాదించిన వివిధ పేర్లు.. లోగోలను పరిశీలించారు. లోగో ఖరారులో డ్వాక్రా సంఘాల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని.. మెజారిటీ అభిప్రాయంతో నిర్ణయం తీసుకోవాలని సూచించారు. డ్వాక్రా మహిళలు అద్భుతమైన ఉత్పత్తులను తయారుచేస్తున్నారని, వారికి మంచి మార్కెటింగ్ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. స్థానికంగానే గాక జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లను కూడా ఆకర్షించేలా ఆ ఉత్పత్తులకు డిమాండ్ పెరగాలంటే.. అదే స్థాయిలో ఆకర్షణీయ బ్రాండింగ్ ఉండాలని చెప్పారు. బ్రాండ్ పేరు, లోగో ఆకట్టుకునేలా ఉండాలని.. వాటితోనే కాన్సెప్ట్ అందరికీ అర్థమయేలా ఉండాలని తెలిపారు. స్వయం సహాయ సంఘాల ద్వారా మహిళలు ఉత్పత్తులను తెస్తున్నందువల్ల 'స్వయం' అనే పేరు బాగుంటుందన్నారు. అదే తరహాలో లోగో డిజైన్ కూడా ఉండాలని సీఎం ఆదేశించారు. సమీక్షలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, సెర్ప్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


అమరావతిలో సాగునీటి సంఘాల అధ్యక్షుల సదస్సుకు సిద్ధమవుతున్న పెరేడ్ గ్రౌండ్

సాగునీటి సదస్సు నేడే!

సంఘాల అధ్యక్షులతో సీఎం భేటీ

- అమరావతి పెరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు
- 6,047 సంఘాలు, 58 ప్రాజెక్టు కమిటీలు, 267 డిస్ట్రిబ్యూటరీ కమిటీల చైర్మన్ల హాజరు
- యాజమాన్య విధానాలపై సీఎం కీలక ప్రకటన!
- లస్కర్ వ్యవస్థపైనా చేసే అవకాశం

అమరావతి/తుళ్లూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలో సాగునీటి ప్రాజెక్టుల యాజమాన్య నిర్వహణ కోసం నయాపైసా కూడా విడుదల చేయలేదు. ఫలితంగా అన్నమయ్య, పింఛ, బుడమేరు, పులిచింతల ప్రాజెక్టులు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని 6,047 సాగునీటి వినియోగ యాజమాన్య సంఘాల అధ్యక్షులు, 58 ప్రాజెక్టు కమిటీల అధ్యక్షులు, 267 డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లతో.. గురువారం అమరావతిలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవనాల నుంచి హైకోర్టుకు వెళ్లే మార్గంలో ఉన్న పెరేడ్ గ్రౌండ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు సదస్సు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సాగునీటి యాజమాన్య విధానాలపై వారికి దిశానిర్దేశం చేయనున్నారు. ఈ సమావేశంలోనే ప్రాజెక్టు యాజమాన్య నిర్వహణపై సీఎం కీలక ప్రకటన చేసే వీలుందని జల వనరుల శాఖ వర్గాలు చెబుతున్నాయి. సాగునీటి సంఘాల ద్వారా ఇప్పటికే రూ.10 లక్షల దాకా నామినేషన్ విధానంపై అభివృద్ధి పనులు చేయిస్తున్నారు. ఈ సంఘాల చైర్మన్లను పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ సమావేశాలకు ప్రత్యేక ఆహ్వానితులుగా పిలవాలని ఎప్పటినుంచో డిమాండ్ వినిపిస్తోంది. దీనితోపాటు లస్కర్ వ్యవస్థపైనా చంద్రబాబు ప్రకటన చేస్తారని సాగునీటి సంఘాల చైర్మన్లు ఆశిస్తున్నారు. పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను గుంటూరు కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, డీఎస్పీ మురళీకృష్ణ, సీఆర్‌డీఏ అధికారులు బుధవారం పరిశీలించారు.

అవును.. తప్పు చేశాం!

(మొదటి పేజీ తరువాయి)

సభ్యుడుగా పనిచేశారు. డెయిరీ టెక్నాలజీ ముఖ్యంగా నెయ్యికి సంబంధించి దేశంలోని అత్యున్నత స్థాయి సైంటిస్టుల్లో సురేంద్రనాథ్ కూడా ఒకరు. ఆయనకు టీటీడీలో కేవలం మార్కెటింగ్ జీఎం, ఈవో మినహా మరెవ్వరూ తెలియదని సమాచారం. నేరుగా వారిద్దరితోనే మాట్లాడడం, కలవడం చేసేవారని సమాచారం. గత టీడీపీ ప్రభుత్వంలో నెయ్యి సరఫరా, తనిఖీల విషయంలో నిక్కచ్చిగా వ్యవహరించేవారు. సురేంద్రనాథ్‌పై అప్పుడు ఎలాంటి ఆరోపణలూ లేవు. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చాక కథ మారింది. టీటీడీ పనుల మీద తాను ఎప్పుడు తిరుపతి వచ్చినా ఎయిర్‌పోర్టులో దిగగానే టీటీడీ వాహనం మొదలుకుని తిరుమలలో గెస్ట్ హౌస్ కేటాయింపు, శ్రీవారి దర్శనం వరకూ ప్రొటోకాల్ మర్యాదలతో ఏర్పాటు చేయించేవారని ఆయన కోర్టు ముందు వెల్లడించారు. తిరుమలలో కష్టసాధ్యమైన ప్రొటోకాల్ దర్శనాలు, మర్యాదలు దక్కుతుండడంతో కేవలం వాటికి ముగ్ధుడినై నెయ్యి సరఫరా విషయంలో సహకరించానని కోర్టుకు వివరించారు. ఈ వాస్తవాలు వెల్లడించే క్రమంలో తప్పు చేశానంటూ కోర్టు ముందు భోరున విలపించినట్టు సమాచారం. తాను పనిచేసిన సంస్థలో నెలకు రూ.3 లక్షల వేతనం అందేదని, తాను డబ్బు కోసం తప్పు చేయలేదని చెప్పారు. కేవలం దర్శనాలు, వసతి ఏర్పాట్లలో ప్రొటోకాల్ మర్యాదలకు మురిసి సహకరించానని వాపోయినట్టు తెలుస్తోంది. ఆ క్రమంలో నెయ్యి సరఫరా వ్యవహారంలో ఏం జరిగిందన్నది కోర్టుకు వివరించారు. తనిఖీల సందర్భంగా డెయిరీలకు పాల ఉత్పత్తి, నెయ్యి తయారీ సామర్థ్యం లేకపోయినా బాగున్నట్టుగా నివేదికలు ఇచ్చినట్టుగా చెప్పినట్టు తెలుస్తోంది.

మరో ఇద్దరు నేరాంగీకారం

కల్తీ నెయ్యి కేసులో ఇప్పటి దాకా ముగ్గురు నిందితులు అప్రూవర్లుగా మారారు. కేసుకు సంబంధించి ఏసీబీ కోర్టులో సిట్ దాఖలు చేసిన తుది చార్జిషీట్‌లో నిందితుల జాబితాలో 36 పేర్లు ఉన్నాయి. అందులో 5 పేర్లు డెయిరీ సంస్థలవి. మిగిలిన 31 మంది నిందితులలో ముగ్గురు అప్రూవర్లుగా మారారు. వారిలో డెయిరీ ఎక్స్‌పర్ట్ డాక్టర్ బత్తల సురేంద్రనాథ్‌తో పాటు ఏ14 ఆశిష్ రోహిలా, ఏ17 మహేశ్ కుమార్ రోహిరా ఉన్నారు. వేర్వేరు సందర్భాలలో ఏసీబీ కోర్టు న్యాయాధికారి ఎదుట హాజరై తాము తప్పు చేసినట్టు అంగీకరించారు. తమకు తెలిసినంత మేరకు వివరాలు కూడా కోర్టుకు వెల్లడించారు. ఏ14 ఆశిష్ రోహిలా ఉత్తరాఖండ్‌లోని భగవాన్‌పూర్‌లో ఉన్న భోలేబాబా డెయిరీలో ఉద్యోగి. అతడు పనిచేసిన కాలంలో భోలేబాబా డెయిరీలో కల్తీ నెయ్యి దందాకు సంబంధించి ఏమేం జరిగిందీ మొత్తం పూసగుచ్చినట్టు కోర్టుకు వివరించాడు. ఎక్కడెక్కడి నుంచి ఏయే రసాయనాలు, ఇతర పదార్థాలు ఎంతెంత పరిమాణంలో వచ్చాయి, వాటితో కల్తీ ఎలా జరిగిందీ వంటి వివరాలన్నింటినీ కోర్టుకు తెలియజేశాడు. ఇక ఏ17 మహేశ్ కుమార్ రోహిరా రసాయనాలు సరఫరా చేసే వ్యాపారి. అతడు కూడా భోలేబాబా డెయిరీకి తాను సరఫరా చేసిన రసాయనాలు, వాటి పరిమాణం, దానికోసం జరిపిన నగదు లావాదేవీలు వంటి వివరాలన్నింటినీ కోర్టు ముందు తప్పు చేసినట్టు ఒప్పుకొన్నాడు.

నెయ్యి ట్యాంకర్ల నుంచి.. అలిపిరిలో అక్రమ వసూళ్లు

- వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగి చిలక్కొట్టుడు
- తిరుచానూరు మార్కెట్ కమిటీ పేరిట దందా
- చర్యలకు సిఫారసు చేస్తూ సిట్ లేఖ

తిరుపతి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి లడ్డూల తయారీ కోసం టీటీడీకి నెయ్యి సరఫరా చేసిన ట్యాంకర్ల నుంచి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగి ఒకరు చిలక్కొట్టుడు కొట్టిన సంగతి సిట్ దర్యాప్తులో వెలుగు చూసింది. తిరుచానూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పేరు చెప్పుకొని ఓ ఉద్యోగి అలిపిరి చెక్ పాయింట్ వద్ద కాపు కాసి నెయ్యి ట్యాంకర్లను నిలబెట్టి అక్రమ వసూళ్లకు పాల్పడినట్టు సిట్ గుర్తించింది. టీటీడీకి సాధారణంగా రోజుకు ఒక ట్యాంకర్ నెయ్యి సరఫరా అవుతుంది. మార్కెట్ కమిటీ ఉద్యోగి నెయ్యి ట్యాంకర్‌ను ఆపి సెస్ కింద రూ.70 వేలు చెల్లిస్తారా లేక తనకు లంచం ఇస్తారా అంటూ డిమాండ్ చేసేవారని తెలిసింది. ప్రీమియర్ డెయిరీ ట్యాంకర్ల నుంచీ ఒకో ట్యాంకర్‌కు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకూ, భోలేబాబా డెయిరీ ట్యాంకర్ల నుంచీ రూ.8 వేలు చొప్పున వసూలు చేశారని తెలిసింది. కల్తీ నెయ్యి కేసులో సిట్ చేపట్టిన దర్యాప్తులో భాగంగా ప్రైవేటు డెయిరీలకు కమీషన్ ఏజెంటుగా వ్యవహరించిన శ్రీనివాసన్‌ను విచారించినప్పుడు ఈ విషయం వెలుగు చూసింది. శ్రీనివాసన్ వద్ద ఉన్న డైరీలలో 2022 నుంచి చేసిన చెల్లింపుల వివరాలు నమోదై ఉన్నాయి. వీటిని స్వాధీనం చేసుకున్న సిట్ సంబంధిత ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని సిఫారసు చేస్తూ రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖకు లేఖ రాసింది.

'కల్తీ నెయ్యి'పై త్వరలో సిట్ పూర్తి నివేదిక



- నగరాల్లో ప్రచార సదస్సులు జరుపుతాం: పీవీఎస్ మాధవ్

విజయవాడ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కల్తీ నెయ్యి వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం వేసిన సిట్ పూర్తిస్థాయి నివేదిక త్వరలో రానుందని, దీనిపై తప్పనిసరిగా విచారణ జరిపి, అక్రమార్కులందరినీ అరెస్ట్ చేస్తారని బీజే పీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎస్ మాధవ్ చెప్పారు. విజయవాడలో బుధవారం ఆయన మాట్లాడారు. కల్తీ నెయ్యి వ్యవహారంలో టీటీడీలోని చాలామందిని సస్పెండ్ చేశామన్నారు. దోషులు, వారిని ప్రోత్సహించిన వారిని తప్పకుండా అరెస్ట్ చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. తిరుమల పవిత్రతను కాపాడేందుకు ఏవిధమైన నిబంధనలు పెట్టాలనే విషయమై కూటమి నేతలు త్వరలోనే చర్చిస్తారని చెప్పారు. సంత్ రవిదాస్‌జీ 649వ జయంతి ఉత్సవాలు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నామని, అందులో భాగంగానే రాష్ట్రంలో బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో 500కు పైగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మాధవ్ తెలిపారు. విజయవాడలోని సంత్ రవిదాస్ వారసులను సత్కరిస్తామన్నారు. ఈనెల 7న విజయవాడలో కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ బడ్జెట్ గురించి వివరిస్తారన్నారు. బడ్జెట్‌లో కల్పించిన వెసులుబాట్లను ప్రజలకు తెలియజేసే కార్యక్రమాన్ని ఔట్‌రీచ్ పేరుతో నిర్వహిస్తున్నామన్నారు.

జగన్ కుట్రలపై జనంలోకి

- సున్నితమైన లడ్డూ అంశంలో రాజకీయాలకు తావు లేకుండా ప్రజలకు వాస్తవాలనే వివరించాలనే ఉద్దేశంతో ఆచితూచి వెళ్తున్నాం. దీనిని వైసీపీ అడ్వాంటేజ్‌గా తీసుకుంది. కోర్టు నిర్ణయం తర్వాత జనంలోకి వెళ్లి ఎండగడదాం.
  - సీఎం చంద్రబాబు
- పవిత్రమైన శ్రీవారి ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యిని వినియోగించడమే కాకుండా అడ్డగోలుగా సమర్థించుకుంటూ తిరిగి ప్రభుత్వంపైనే జగన్ అండ్ కో ఎదురుదాడి చేస్తోంది. దీనిని తొలి రోజుల్లో సమర్థంగా తిప్పికొట్టాల్సింది.
  - డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పుడు కూడా అదే బాటలో పయనిస్తున్నారని అన్నారు. పవన్ స్పందిస్తూ.. ఈ పరిణామాలను తొలి నుంచే కలిసికట్టుగా ఎదుర్కోకపోతే వైసీపీ చేస్తున్న విద్వేష ప్రచారాన్నే ఆయా వర్గాలు నిజమని నమ్మే పరిస్థితి వస్తుందని చెప్పారు. తిరుమల లడ్డూ వ్యవహారమే దీనికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. నేర రాజకీయాలకు.. క్రిమినల్ ఆలోచనలకు వైసీపీ కేరాఫ్ అడ్రస్ అని, వారి రాజకీయాలు తీరూ అలానే ఉంటుందని సీఎం అన్నారు. తిరుమల లడ్డూకు వాడిన నెయ్యిలో జంతు కొవ్వు ఉందని సిట్ నివేదికలో స్పష్టంగా ఉన్నా.. జంతు కొవ్వులేదని అడ్డంగా వాదిస్తూ ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారని చెప్పారు. సిట్ చార్జిషీటును కోర్టు పరిగణనలోకి తీసుకున్న తర్వాత ఆధారాలతో కల్తీ నెయ్యి వ్యవహారంలో ఏం జరిగిందో ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్దామని.. వైసీపీ వైఖరిని ఎండగడదామని తెలిపారు.

కూటమిని ఎదుర్కోలేక కుట్రలు..

కూటమి పార్టీలు కలిసికట్టుగా ఉంటే అధికారంలోకి రాలేనని జగన్‌కు స్పష్టమైన అవగాహన ఉందని, అందుకే కూటమిని.. ముఖ్యంగా టీడీపీ, జనసేనను విడగొట్టే ప్రయత్నాలు ముమ్మరం చేశారని సీఎం, డిప్యూటీ సీఎం అన్నారు. సామాజిక మాధ్యమాల వేదికగా రెండు పార్టీల నేతలను రెచ్చగొట్టే ప్రయత్నాలు ఇటీవల కాలంలో ఎక్కువగా జరుగుతున్నాయని, ఇలాంటి వాటి పట్ల రెండు పార్టీల శ్రేణులను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉందని ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. కూటమిలో చిచ్చు పెట్టాలని చూస్తే కలిసికట్టుగా అడ్డుకోవాలని నిర్ణయించారు. 2024 ఎన్నికల ముందు కూడా కూటమి ఏర్పాటు కాకుండా వైసీపీ విశ్వ ప్రయత్నాలు చేసిందని, విచ్ఛిన్న రాజకీయాలు.. విద్వేష రాజకీయాలు ఆ పార్టీ డీఎన్ఏలోనే ఉన్నాయని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

ఎమ్మెల్యేలపై ఆరోపణలకు చెక్..

రెండు పార్టీల ఎమ్మెల్యేలపై ఇటీవల కాలంలో ఆరోపణలు ఎక్కువగా వస్తున్నాయని, వీటికి చెక్ పెట్టాలని అధినేతలిద్దరూ నిర్ణయించారు. ఎమ్మెల్యేల పనితీరును ఎప్పటికప్పుడు వివిధ మార్గాల్లో తెప్పించుకుంటూ వారితో ముఖాముఖి సమావేశాలు నిర్వహిస్తున్నానని చంద్రబాబు చెప్పారు. ఆయన స్ఫూర్తితో తాను కూడా ఎమ్మెల్యేలతో సమావేశమవుతున్నానని పవన్ అన్నారు. రైల్వే కోడూరు ఎమ్మెల్యే విషయంలో పార్టీపరంగా విచారణ చేపట్టామని, నివేదిక ఆధారంగా కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టంచేశారు. కొన్ని జిల్లాల్లో కూటమి పక్షాల మధ్య సమన్వయ లోపాలపైనా చర్చించారు. తరచూ రెండు పార్టీలూ సమన్వయ సమావేశాలు నిర్వహిస్తుంటే చిన్న చిన్న సమస్యలను అధిగమించవచ్చని అభిప్రాయపడ్డారు.

జనసేనకు ఒక రాజ్యసభ సీటు!

త్వరలో ఖాళీ అయ్యే 4 రాజ్యసభ స్థానాల భర్తీ విషయమూ చర్చకు వచ్చింది. వీటిలో జనసేనకు ఒకటి కేటాయించే అవకాశం ఉంది. ఈ స్థానం నుంచి ఎవరిని అభ్యర్థిగా నిలపాలన్న అంశంపై చంద్రబాబు, పవన్ కల్యాణ్ చర్చించారు.

భేటీలో ఇద్దరే : కూటమిలో కీలక భాగస్వాములైన ఇద్దరు అగ్ర నేతల నడుమ చాలా రోజుల తర్వాత సుదీర్ఘ భేటీ జరగడం గమనార్హం. ఉదయం 10.40కి సీఎం నివాసానికి వచ్చిన పవన్.. మధ్యాహ్నం 1.20 గంటల వరకు అక్కడే గడిపారు. వీరిద్దరే ముఖాముఖి చర్చలు జరిపారు. రెండు పార్టీలకు చెందిన ఇతర నేతలెవరినీ భేటీకి ఆహ్వానించలేదు.

నేడు 3 కూటమి పార్టీల అగ్ర నేతల భేటీ

- కల్తీ నెయ్యి వ్యవహారంపైనే ప్రధాన చర్చ

అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కూటమి పార్టీల అధినేతలు గురువారం భేటీ కానున్నారు. టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ఉండవల్లిలోని సీఎం నివాసంలో ఉదయం 11 గంటలకు సమావేశం కానున్నారు. చంద్రబాబు, పవన్ బుధవారం ముఖాముఖి భేటీ అయిన మర్నాడే మూడు పార్టీల నాయకులూ సమావేశమవుతుండడం ప్రాధాన్యం సంతరించుకుంది. శ్రీవారి లడ్డూను కల్తీనెయ్యితో అపవిత్రం చేసిందే గాక.. తమకు క్లీన్‌చిట్ వచ్చిందంటూ జగన్ అండ్ కో ప్రచారం చేసుకుంటుండడంపై కూటమి నేతలు మండిపడుతున్నారు. వైసీపీ దుష్ప్రచారానికి చెక్ పెట్టి, అసలు వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంపై చర్చించేందుకు భేటీ కావాలని అధినేతలు నిర్ణయించారు.


ఢిల్లీలో ఎంపీలతో మంత్రి లోకేశ్

ఢిల్లీలో కూటమి ఎంపీలతో లోకేశ్ భేటీ

- కల్తీ నెయ్యి నివేదికపై చర్చ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి లోకేశ్ బుధవారం ఢిల్లీలో కూటమి ఎంపీలతో కీలక భేటీ నిర్వహించారు. ఉదయం కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ నివాసంలో అల్పాహార విందు సమావేశం జరిగింది. దీనిలో మరో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, టీడీపీ ఎంపీలు దగ్గుమళ్ల ప్రసాదరావు, బీద మస్తాన్‌రావు, కేశినేని చిన్ని, బీకే పార్థసారథి, కలిశెట్టి అప్పలనాయుడు, సానా సతీశ్, బైరెడ్డి శబరి, శ్రీభరత్, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జీఎం హరీశ్, బీజేపీ ఎంపీ పాక వెంకటసత్యనారాయణ, జనసేన ఎంపీ బాలశౌరి, మాజీ ఎంపీ గల్లా జయదేవ్ పాల్గొన్నారు. తిరుమల కల్తీనెయ్యి వ్యవహారంపై సిట్ నివేదిక, దాని నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు వైసీపీ నేతలు అంబటి రాంబాబు, జోగి రమేశ్ చేసిన వ్యాఖ్యలు, తదనంతర పరిణామాలపై చర్చించారు. మధ్యాహ్నం భోజన సమయంలో టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలి అధికారిక నివాసంలో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్యతోపాటు మరికొందరు యువ ఎంపీలతో లోకేశ్ భేటీ అయ్యారు. ప్రస్తుతం పార్లమెంటులో చోటుచేసుకుంటున్న ఘటనలు చర్చకు వచ్చాయి. ఏపీ, కర్ణాటక రాష్ట్రాల అభివృద్ధి కోసం ఏమేం చేయవచ్చో లోకేశ్‌తో చర్చించినట్లు తేజస్వి సూర్య ఆ తర్వాత 'ఎక్స్' వేదికగా తెలిపారు. ఏపీలో మంత్రి లోకేశ్ అమలు చేస్తున్న పాలనా విధానాల గురించి అడిగి తెలుసుకున్నానని.. ఇక నుంచి తరచుగా కలవాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. సుస్థిర, సంపన్నమైన ఏపీని నిర్మిస్తున్న లోకేశ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఇక రాత్రికి ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి నివాసంలో విందుకు లోకేశ్ హాజరయ్యారు. తర్వాత రాష్ట్రానికి బయల్దేరారు.

శ్రీకాళహస్తి బ్రహ్మోత్సవాలకు పవన్‌కు ఆహ్వానం

అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం శ్రీకాళహస్తిలో శివరాత్రి సందర్భంగా నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ఆహ్వానించారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కొట్టే సాయిప్రసాద్ నేతృత్వంలో వచ్చిన కమిటీ సభ్యులు బుధవారం మంగళగిరిలో పవన్ కల్యాణ్‌ను కలిశారు. బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందించారు.



పవన్‌తో రాజేంద్రప్రసాద్..

ఉప ముఖ్యమంత్రి పవన్‌ను ప్రముఖ నటులు రాజేంద్రప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ ప్రకటించిన నేపథ్యంలో ఆయనతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పవన్‌ను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందించారు.

వైసీపీ హిందూ ద్రోహి: నాగబాబు

అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ హిందూ ద్రోహి అని ఎమ్మెల్సీ కె.నాగబాబు విమర్శించారు. వైసీపీ ప్రభుత్వంలో హిందూ ఆలయాలపై జరిగిన దాడులతో పాటు కల్తీ నెయ్యి, లడ్డూపై ఆయన ఒక వీడియో విడుదల చేశారు. 'తిరుమల కొండపై రూమ్ చార్జీలు ఇష్టారాజ్యంగా పెంచేశారు. ఇది సామాన్యులను భగవంతుడు నుంచి దూరం చేయడం కాదా? టీటీడీ కామన్ గుడ్‌ఫండ్‌కు ఇచ్చే కంట్రిబ్యూషన్ రూ.2.50 కోట్లు ఉండేది. దానిని ఒకేసారి రూ.50 పెంచేశారు. ఇక్కడే కాదు, ఎక్కడ కొండ కనిపిస్తే అక్కడ గుండు కొట్టేయడమే అలవాటుగా మార్చుకున్నారు. డిక్లరేషన్‌ను గౌరవించడం మన సాంప్రదాయం. పవన్ కల్యాణ్ తన సతీమణి, పిల్లలను తీసుకువెళ్లినప్పుడు డిక్లరేషన్ ఇచ్చారు. అబ్దుల్ కలాం డిక్లరేషన్ ఇచ్చారు. ఆయనకంటే నువ్వు గొప్పోడివా..! నీ మంత్రి 'తిరుమల నీ అమ్మ మొగుడు కట్టాడా?' అంటూ మాట్లాడతాడా..? అలా తలపొగరుతో మాట్లాడినందుకే 151 లో మధ్యలో 5 తీసేసి 11 సీట్లే ప్రజలు ఇచ్చారు. అయినా ఏం మారలేదు. డిక్లరేషన్ అడిగారని తిరుమల పర్యటన మానుకున్న చరిత్ర మీది' అంటూ నాగబాబు జగన్‌పై విరుచుకుపడ్డారు.

తిరుమల వేదికగా కుల రాజకీయాలా?

- టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): తిరుమలను వేదికగా చేసుకుని కుల రాజకీయాలు చేయొద్దని వైసీపీకి టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాశ్ రెడ్డి హితవు పలికారు. సీఎం చంద్రబాబుపై నోటి దురదతో ఇష్టారీతిగా మాట్లాడిన వైసీపీ నేతలు.. మళ్లీ ఇప్పుడు కులాల కుంపట్లను రాజేసేందుకు ప్రయత్నించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కొంతమంది ఆంబోతులను రోడ్డు మీదకి వదిలేసి, వారితో ఇష్టారీతిగా మాట్లాడించి, ఇప్పుడు జగన్ కులాల ప్రస్తావన తేవడం చూస్తుంటే ఇదంతా ముందస్తు ప్రణాళిక అని స్పష్టం అవుతోందన్నారు. ఏపీభవన్‌లో బుధవారం మాట్లాడారు. వైసీపీ పాలనలో తిరుమల లడ్డూ తయారీలో రసాయనాలతో తయారైన మిశ్రమాన్ని వాడారని సిట్ తేల్చిచెప్పినప్పటికీ వైసీపీ డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతూ కులాల కుంపటిని రాజేస్తున్నదన్నారు.

లడ్డూ ప్రసాదంలో కల్తీ కాదు.. అంతకు మించి!

- పక్కదారి పట్టించేందుకు అంబటితో బూతుపురాణం: సత్యకుమార్

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): తిరుపతి లడ్డూ ప్రసాదం తయారీలో నాటి వైసీపీ ప్రభుత్వం కల్తీ కాదు.. అంతకు మించి చేసిందని మంత్రి సత్యకుమార్ మండిపడ్డారు. బుధవారం గుంటూరు వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన మెడికల్ ఎగ్జిబిషన్ మెడ్‌ఫ్యూజన్ 26ను ఆయన ప్రారంభించారు. ప్రదర్శనలో వివిధ స్టాళ్లను మంత్రి సందర్శించారు. అనంతరం కళాశాల ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడారు. "నెయ్యిలో 10 శాతమో, 20 శాతమో, లేకుంటే 50 శాతమో రసాయనాలు కలిపితే... దానిని కల్తీగా భావించవచ్చు. అసలు నెయ్యే లేకుండా 100 శాతం రసాయన మిశ్రమాన్ని నెయ్యిగా వాడటం దిగ్భ్రాంతిని కలిగించింది. ఈ విషయం ప్రజల్లోకి వెళ్లకుండా అంబటి రాంబాబుతో బూతు పురాణం చేయించారు. రాజకీయాల్లో ఇతర పార్టీల నాయకులను ప్రత్యర్థులుగా మాత్రమే చూడాలి. శత్రువులుగా చూడటం తగదు. మాజీ సీఎం జగన్ వైఖరి.. బూతులు మాట్లాడే తమ పార్టీ నాయకులను ప్రోత్సహించేలా ఉంది. 'మరిన్ని కొత్త బూతులు నేర్చుకోండి. వాటిని బాగా ప్రాక్టీసు చేయండి. ప్రత్యర్థి పార్టీల నాయకులపై ప్రయోగించండి. అన్న జగన్ వైఖరిని ఆయన ప్రవర్తనే చెబుతోంది.' అన్నారు.

చిన్నప్పన్న.. పెద్ద దందాలు

(మొదటి పేజీ తరువాయి)

గుర్తించింది. నేరుగా చిన్నప్పన్న ఖాతాకు కాకుండా ఓ మహిళ బ్యాంకు ఖాతా ద్వారా లావాదేవీలు సాగించినట్టు నిర్ధారించింది. గత ప్రభుత్వంలో టీటీడీ చైర్మన్‌గా ఉన్న వైవీ సుబ్బారెడ్డి పీఏగానూ, ఢిల్లీలోని ఏపీ భవన్‌లో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగిగానూ పనిచేసిన క్రమంలో కొన్నేళ్ల పాటు ఢిల్లీలో గడిపాడు. కల్తీ నెయ్యి కేసు దర్యాప్తులో భాగంగా సిట్ ఆయన ఆస్తులు, బ్యాంకు ఖాతాలపై దృష్టి పెట్టి వివరాలు సేకరించింది. ఢిల్లీలో ఎస్‌బీఐకి సంబంధించి సంసదీయ బ్రాంచిలోనూ (ఖాతా నం 30691757390), యూనియన్ బ్యాంకుకు సంబంధించి ఏపీ భవన్ బ్రాంచిలోనూ (ఖాతా నం.056210100049273) ఖాతాలున్నట్టు గుర్తించి వాటి లావాదేవీలను పరిశీలించింది. ఎస్‌బీఐ ఖాతాలో 2019 జనవరి 1నుంచీ 2025 జూన్ 10వరకూ మొత్తం రూ.4,69,26,202 జమయింది. రూ.4,64,30,981 విత్‌డ్రా అయింది. 2019 నుంచీ 2024 వరకూ ఆయన జీతభత్యాలు రూ.65 లక్షలు. దీంతో మిగిలిన సొమ్ము ఎక్కడి నుంచి వచ్చిందని సిట్ ఆరా తీసింది. అదంతా లంచాల సొమ్ముగా గుర్తించింది. కాకినాడలో ఓ షిప్పింగ్ కంపెనీ నుంచీ లంచంగా తీసుకున్న నగదు, అలాగే ఓ షూ కంపెనీ బిల్లు క్లియరెన్స్ కోసం అందిన నగదు అందులో ఉన్నట్టు కనుగొంది. అలాగే ఓ మైనింగ్ సంబంధిత పనికి సంబంధించి అందిన నగదు కూడా ఆ మొత్తంలో ఉన్నట్టు నిర్ధారించింది. చిన్నప్పన్న అక్రమ, ఆదాయానికి మించిన ఆస్తుల వ్యవహారంపై కేసు నమోదు చేయాలని సిట్ అధికారులు ఏసీబీ డైరెక్టర్ జనరల్‌కు లేఖ రాశారు. వైవీ సుబ్బారెడ్డి ఎంపీగా ఉన్నపుడు 2014-19 మధ్య చిన్నప్పన్న ఆయనకు పీఏగా పనిచేశాడు. అలాగే 2019-2023 మధ్య వైవీ టీటీడీ చైర్మన్‌గా కొనసాగినప్పుడు కూడా ఆయనకు పీఏగా పనిచేశాడు. ఇక 2019 అక్టోబరు 10న గత ప్రభుత్వం చిన్నప్పన్నను ఢిల్లీలోని ఏపీ భవన్‌లో స్పెషల్ లైజన్ ఆఫీసర్‌గా నియమించింది. 2024 జూన్ 1న చిన్నప్పన్న రాజీనామా చేశాడు. మొత్తమ్మీద 2019 అక్టోబరు 16 నుంచీ 2024 జూన్ 1 వరకూ వేతనాలు, ఇతర అలవెన్సుల కింద ప్రభుత్వం నుంచీ రూ.64,72,783 అందుకున్నాడు. కాబట్టి ఆయన పబ్లిక్ సర్వెంట్‌గా అవినీతి నిరోధక చట్టం పరిధిలోకి వస్తాడని, ఆదాయానికి మించి బ్యాంకు ఖాతాల్లో నగదు, ఆస్తులను కలిగి ఉన్నందున అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయాలని సిఫారసు చేస్తూ సిట్ అధికారులు ఏసీబీ డీజీకి లేఖ రాశారు.

ఇవీ అక్రమాస్తులు!

- చిన్నప్పన్న అక్రమంగా సంపాదించిన పలు ఆస్తులను సిట్ గుర్తించింది. 2021 నుంచీ 2024 మధ్య విజయనగరం జిల్లా తగరపువలసలో 5 ప్లాట్లు కొనుగోలు చేశాడు. ఒక్కొక్కటి 160 చదరపు గజాల స్థలమని సమాచారం.
- అనకాపల్లి మండలం లంకెలపాలెంలో ఒక్కొక్కటి 240 చ. గజాలున్న 8 ప్లాట్లు కొనుగోలు చేశాడు.
- విశాఖ రుషికొండ ప్రాంతంలో ఒక ఫ్లాట్ కొనుగోలు చేశాడు. ఇవన్నీ చిన్నప్పన్న పేరు మీదే ఉన్నాయని సిట్ దర్యాప్తులో తేలినట్లు సమాచారం.

విజయవాడ మహిళ పరిచయంతో...

చిన్నప్పన్న లంచాల నగదును నేరుగా తన బ్యాంకు ఖాతాలో వేయించుకోకుండా, విజయవాడకు చెందిన బవిరెడ్డి శ్రీదేవి పేరిట ఉన్న ఖాతాను వాడుకుని, ఆయనే ఆపరేట్ చేసినట్టు సిట్ గుర్తించింది. తాడేపల్లిలోని ఓ అపార్టుమెంటులో నివాసం ఉన్న చిన్నప్పన్నకు అదే అపార్టుమెంటులో ఉన్న మహిళతో పరిచయమైంది. ఆమె ద్వారా ఆమె తల్లి శ్రీదేవి బ్యాంకు ఖాతాను (ఎస్‌బీఐ ఖాతా నం.40670014499) విజయవాడ నుంచీ ఢిల్లీకి మార్చుకున్నట్టు గుర్తించారు. లంచాల నగదును తొలుత శ్రీదేవి ఖాతాలో జమ చేయించి, ఆ తర్వాత ఆ ఖాతా నుంచి ఆయన ఖాతాలకు బదిలీ చేసుకున్నట్టు కనుగొంది. కస్టడీలోకి తీసుకుని ప్రశ్నించినపుడు ఈ వివరాలను చిన్నప్పన్న వెల్లడించలేదని, తర్వాత సిట్ అధికారులే దర్యాప్తులో భాగంగా గుర్తించారని సమాచారం.

బూతుల నేతలను దండించకుండా పరామర్శ పేరుతో డ్రామాలా..: అచ్చెన్న

అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): బూతులు మాట్లాడే నేతలను దండించాల్సింది పోయి, వారిని పరామర్శించే పేరుతో జగన్ డ్రామాలు ఆడటం విడ్డూరంగా ఉందని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 30 నిమిషాలు పట్టే 34 కిలోమీటర్లకు 9 గంటల ప్రయాణాన్ని సాగించింది కేవలం మునిగిపోతు్న్న వైసీపీ నావను కాపాడుకోవడానికేనని అన్నారు. జగన్ జంగిల్‌రాజ్ పాలనను చూసే ప్రజలు ఆయన్ను 11 సీట్లకు పరిమితం చేశారని అన్నారు. అయినా తన తీరును మార్చుకోకుండా వైసీపీ నాయకులను రెచ్చగొట్టేలా జగన్ యాత్ర సాగిందన్నారు. చట్టాలంటే లెక్కలేని ఇలాంటి వ్యక్తి రాజకీయాల్లో ఉండటం ప్రమాదకరమని అన్నారు.

ప్రశాంతతను దెబ్బతీయడమే జగన్ లక్ష్యం: అనగాని

రాష్ట్రంలో ప్రశాంత వాతవరణాన్ని దెబ్బతీయడమే లక్ష్యంగా జగన్ పరామర్శ యాత్రలు చేస్తున్నారని మంత్రి అనగాని సత్యప్రసాద్ మండిపడ్డారు. 'అనుమతికి మించి జనాలను సమీకరించి రోడ్లపై బీభత్సం సృష్టించడం, కుల మతాల పేరుతో అలజడి సృష్టించడం.. వీటికోసమే జగన్ పరామర్శ యాత్రలు. జగన్‌కు కానీ అతని పార్టీ నేతలకు కానీ ప్రజాస్వామ్య పదానికి అర్థం తెలియదు' అని అనగాని విమర్శించారు.

అధికారం పోయినా మారలేదు: భూమిరెడ్డి

అధికారం కోల్పోయినా జగన్ జంగిల్ రాజ్ మనస్తత్వం మాత్రం మారలేదని టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ప్రభుత్వ ఆస్తులను, పరిశ్రమలను ధ్వంసం చేయడం, రాజకీయ ప్రత్యర్థులను హతమార్చడం, అడ్డొచ్చిన వారిని భౌతికంగా తొలగించే సంస్కృతికి రాష్ట్రంలో బీజం వేసింది వైఎస్ కుటుంబమే. కూటమి ప్రభుత్వం శాంతిభద్రతలకు అధిక ప్రాధాన్యం ఇస్తుంది. దానికి విఘాతం కలిగించేందుకు ఎవరు ప్రయత్నించినా ఉపేక్షించదు. దానికి నిదర్శనమే ఎమ్మెల్యే గల్లా మాధవిపై నమోదు చేసిన కేసులు' అని అన్నారు.

సీమకు ద్రోహం చేసి దొంగ దీక్ష: ఆర్.శ్రీనివాసరెడ్డి

రాయలసీమకు ఐదేళ్లపాటు ద్రోహం చేసి ఇప్పుడు దొంగ దీక్షల పేరుతో వైసీపీ నాయకులు డ్రామాలు ఆడుతున్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం 19 నెలల కాలంలో రూ.8 వేల కోట్లు సీమ ప్రాజెక్టులకు ఖర్చు చేసింది. సీమలోని ప్రతి జిల్లాకు కృష్ణా జలాలను అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిది. జగన్ మాత్రం రూ.12 వేల కోట్లకు జీవోలు ఇచ్చి రూ.12 కోట్లు కూడా ఖర్చు చేయలేదు' అని విమర్శించారు.

శవ రాజకీయాలకు జగన్ కుట్రలు: కలిశెట్టి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు రాష్ట్రాభివృద్ధి కోసం చేస్తున్న నిరంతర కృషిని చూసి ఓర్వలేక జగన్ కులాలను, మతాలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్నారని టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు విమర్శించారు. బుధవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. 'కులాల మధ్య అగ్గి రాజేసి శవ రాజకీయాలు చేసేందుకు జగన్ కుట్ర చేస్తున్నారు. అంబటి వ్యాఖ్యలపై జగన్ క్షమాపణ చెప్పాలి' అనిడిమాండ్ చేశారు.

పరామర్శా.. లేక బల ప్రదర్శనా?

అరగంట ప్రయాణానికి 9 గంటలపాటు జగన్ దండయాత్ర

- వాహనాలను అడ్డదిడ్డంగా నిలిపేసి.. లేని జనం ఉన్నట్టు నానా హడావుడి
- ట్రాఫిక్ భారీగా స్తంభించినట్టు కలరింగ్
- అంబటి ఇంట్లో గడిపింది అరగంట
- మీడియాతో మాట్లాడింది గంటన్నర
- అడుగడుగునా నిషేధాజ్ఞల ఉల్లంఘన
- పోలీసుల హెచ్చరికలు బేఖాతర్
- నరకం చూసిన గుంటూరు వాసులు



రాంబాబు కుటుంబ సభ్యులను పరామర్శించి వెళ్తున్న జగన్

గుంటూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిపై బూతులు మాట్లాడి జైలు పాలైన మాజీ మంత్రి అంబటి రాంబాబు కుటుంబసభ్యుల పరామర్శ పేరుతో వైసీపీ అధినేత జగన్ బుధవారం బల ప్రదర్శనకు దిగారు. పరామర్శకు వచ్చినట్లు కాకుండా గుంటూరు నగరంపై దండయాత్ర చేసినట్లుగా ఆయన పర్యటన సాగింది. తాడేపల్లికి, గుంటూరు నగరానికి మధ్య దూరం సుమారు 30 కిలోమీటర్లు. అరగంటలో చేరుకోవచ్చు. కానీ, తొమ్మిది గంటలపాటు ఈ తతంగాన్ని జగన్ అండ్ కో నడిపించారు. జనం పెద్దగా లేకపోయినప్పటికీ వాహనాలను అడ్డదిడ్డంగా నిలిపివేసి, భారీగా జనం వచ్చినట్లు, ట్రాఫిక్ స్తంభించినట్లు కలరింగ్ ఇచ్చారు. సాయంత్రం నాలుగున్నరకు అంబటి ఇంటిలోకి ప్రవేశించిన జగన్ అక్కడ గడిపింది అరగంట. కానీ, ఐదు గంటలకు బయటికి వచ్చి గంటన్నరకుపైగానే మీడియాతో మాట్లాడటం గమనార్హం.

ఆద్యంతం ఆంక్షలను ఉల్లంఘిస్తూ..

జగన్ పర్యటన ఆద్యంతం నిషేధాజ్ఞలను ఉల్లంఘిస్తూ సాగింది. జగన్ పర్యటన సందర్భంగా గతంలో చోటు చేసుకున్న పరిణామాలను, శాంతిభద్రతల సమస్యలను పరిగణనలోకి తీసుకున్న పోలీసులు ఆయన పర్యటనకు అనుమతి ఇవ్వలేదు. నగరంలో పోలీస్ యాక్ట్ అమల్లో ఉందని, ఉల్లంఘించి సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహిస్తే 30 పోలీస్ యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హెచ్చరించారు. జగన్ పర్యటనకు అనుమతి లేదని కూడా ప్రకటించారు. అయినప్పటికీ జగన్ అండ్ కో పోలీస్ నిషేధాజ్ఞలు ఉల్లంఘించి గుంటూరుకు బయలుదేరారు. ఉదయం 10:40 నిమిషాలకు జగన్ తాడేపల్లిలోని తన నివాసం నుంచి 20 వాహనాల్లో బయలుదేరారు. అక్కడి నుంచి గుంటూరు చేరుకునే వరకు సుమారు పదిచోట్ల ఐదారు వందల మంది కార్యకర్తలు రాగానే, వాహనాలను ఎక్కడికి అక్కడ నిలిపివేశారు. దీంతో జాతీయ రహదారితో పాటు గుంటూరు నగరంలోనూ ఎక్కడికక్కడ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగించారు. వీఐపీ రోడ్డు నుంచి గుంటూరు నగరంలోని అంబటి రాంబాబు ఇంటి వరకు సుమారు మూడు గంటల పాటు ఈ యాత్ర సాగింది. పట్టాభిపురం, గుజ్జనగుండ్ల రింగ్‌రోడ్లలో వాహన చోదకులు సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విధంగా సాయంత్రం 4.20కి జగన్ కాన్వాయ్ అంబటి ఇంటి వద్దకు చేరుకుంది. కాగా, నిషేధాజ్ఞలను ఉల్లంఘించి జనజీవనానికి తీవ్ర అంతరాయం కలిగించిన నేపథ్యంలో జగన్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేసే అవకాశం ఉన్నా, పోలీసులు సంయమనం పాటించారు.

రోజంతా ఉద్రిక్తత

గుంటూరు నగరంలో అంబటి నివాసం ఉన్న సిద్ధార్థ నగర్ ప్రాంతంలో ఉన్న తెలుగు దేశం పార్టీ కార్యాలయాలు, ఆ పార్టీ నాయకుల ఇళ్ల వద్ద పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆయన ఇంటికి కూతవేటు దూరంలో ఉన్న పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ కార్యాలయం వద్ద ప్రత్యేక బలగాలను మోహరించారు. అదే సమయంలో పెద్ద సంఖ్యలో టీడీపీ శ్రేణులు ఎమ్మెల్యే కార్యాలయానికి చేరుకున్నారు. అయితే, అటువైపు వైసీపీ శ్రేణులు రాకుండా పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా అంబటి ఇంటికి అత్యంత సమీపంలో ఉన్న టీడీపీ నాయకుడు శివనాగమల్లేశ్వరరావు అలియాస్ అబ్బూరు మల్లి కార్యాలయానికి కూడా పెద్ద సంఖ్యలో కార్యకర్తలు చేరుకున్నారు. అక్కడ కూడా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. జగన్ ఎక్కడికి బయలుదేరితే అక్కడకు వెంట వచ్చే తాడేపల్లికి చెందిన జేబు దొంగల ముఠా బుధవారం ఆయన పర్యటనలో హల్‌చల్ చేసింది. 15 మంది ముఠా ఆయన పర్యటనలో చేతివాటం ప్రదర్శించింది. అనేకమంది జేబుల్లోని డబ్బులు, సెల్‌ఫోన్లు కొట్టేశారు.

అంబటి సంస్కారం ఉన్న వ్యక్తి


- ఆయనను చేతనైతే పొగడాలి
- కాపు కులంలో విలువలు ఉన్న నాయకుడు
- టైగర్‌లా రాజకీయం చేస్తున్నారు
- గుంటూరులో జగన్ వ్యాఖ్యలు.. అంబటి కుటుంబానికి పరామర్శ



గుంటూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి అంబటి రాంబాబు సంస్కారం ఉన్న వ్యక్తి అని, చేతనైతే ఆయనను పొగడాలని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌లు రాష్ట్రంలో జంగిల్ రాజ్ నడిపిస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబుపై బూతులు మాట్లాడిన కేసులో జైలుపాలయిన అంబటి రాంబాబు కుటుంబాన్ని బుధవారం గుంటూరులో వారి నివాసంలో కలిసి జగన్ పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. "అంబటి రాంబాబు కాపు కులంలో విలువలు ఉన్న వ్యక్తి. టైగర్‌లా రాజకీయం చేస్తున్నారు" అని జగన్ పేర్కొన్నారు. తిరుపతి లడ్డూ తయారీలో వినియోగించిన నెయ్యిలో జంతువులు, పంది, గొడ్డు కొవ్వు, చేపనూనె లేదని సీబీఐ క్లీన్ చిట్ ఇచ్చిందన్నారు. అయినప్పటికీ చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్ దీనిపై రాజకీయాలు చేస్తున్నారని, దేవుడంటే భయం, భక్తి లేకుండా తిరుపతి వెంకటేశ్వరస్వామి ప్రతిష్ఠని దెబ్బతీస్తున్నారన్నారు. "చేసిన తప్పులకు చెంపలేసుకుని ప్రజలను, వెంకటేశ్వరస్వామిని క్షమాపణలు కోరాల్సింది పోయి మళ్లీ అవే అబద్ధాలు ఆడుతూ, సీబీఐ చార్జిషీట్‌ని వక్రీకరిస్తూ, ఫ్లెక్సీలు పెట్టి కులమతాలను రెచ్చగొడుతున్నారు" అని వ్యాఖ్యానించారు. అంబటి గుడిలో పూజ చేసుకుని వస్తుంటే, కర్రలు పట్టుకుని ఆయన కారును అడ్డగించి దుర్భాషలాడారని, దానికి ప్రతిస్పందనగానే ఆయన నోటి వెంట తిట్లు వచ్చాయన్నారు. అంబటి ఇంటిపై దాడి జరుగుతున్నా పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించారని జగన్ ఆరోపించారు. చూస్తుండగానే రెండేళ్లు అయిపోయాయని, మరో మూడేళ్లు కళ్లు మూసుకుంటే తిరిగి వైసీపీయే అధికారంలోకి వస్తుందని జగన్ ధీమా వ్యక్తం చేశారు. అప్పుడు చంద్రబాబు, లోకేశ్, పవన్‌కల్యాణ్‌లకు కొమ్ము కాస్తున్న పోలీసులపై ఎంక్వైరీకి ఆదేశిస్తామని, యూనిఫాం ఊడదీసి బొక్కలో పెట్టి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని వ్యాఖ్యానించారు. వైసీపీ నేతలపై దాడులు ఇలానే కొనసాగితే రాష్ట్ర వ్యాప్తంగా బంద్‌కు పిలుపునిస్తామన్నారు. జగన్‌తో కృష్ణా, పల్నాడు జిల్లాల నేతలు మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి ఉన్నారు.

పోలీసింగ్‌లో ఏఐ విప్లవం

- 'ఏఐ4ఏపీ పోలీస్' ప్రాజెక్టుకు శ్రీకారం
- 3 జిల్లాల్లో ప్రారంభమైన పైలట్ ప్రాజెక్టు
- ఎనిమిది ఏఐ టూల్స్‌తో సమగ్ర వ్యవస్థ
- ఆరు నెలల్లో రాష్ట్రమంతా అమలుకు చర్యలు



ఏఐ4ఏపీ కార్యక్రమాన్ని ప్రారంభించిన డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా. చిత్రంలో టెక్నికల్ ఐజీ శ్రీకాంత్

అమరావతి, ఫిబ్రవరి4 (ఆంధ్రజ్యోతి): పోలీసింగ్ వ్యవస్థలో సాంకేతిక విప్లవానికి ఏపీ పోలీసు శాఖ శ్రీకారం చుట్టింది. నేరాల దర్యాప్తు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, ఆధారాల సేకరణతోపాటు ఇంటెలిజెన్స్ సమాచార విశ్లేషణలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను వినియోగిస్తూ 'ఏఐ4ఏపీ పోలీస్' ప్రాజెక్టును ప్రారంభించింది. మంగళగిరిలోని ఏపీ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా పైలట్ ప్రాజెక్టును ప్రారంభించారు. పైలట్ ప్రాజెక్టు కింద చిత్తూరు, అన్నమయ్య, గుంటూరు జిల్లాల్లో ఈ ప్రాజెక్టును మొదలుపెట్టిన పోలీసు శాఖ రాబోయే మూడు నుంచి ఆరు నెలల్లో దీన్ని రాష్ట్రమంతా అమలు చేయనుంది. దీనికోసం అమెరికాకు చెందిన జనరేటివ్ ఏఐ సంస్థ '4సైట్ ఏఐ నాలెడ్జ్', 'స్పారిటీ' సంస్థతో పోలీసు శాఖ ఏంవోయూ కుదుర్చుకుంది.

పోలీసు అవసరాలకు అనుగుణంగా..

కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక టెక్ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యమిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా సీసీ కెమెరాలు, ఫేస్ రికగ్నైజేషన్ కెమెరాలు, డ్రోన్లు, అత్యాధునిక ఎఫ్ఎస్ఎల్ సేవలను వినియోగంలోకి తీసుకొచ్చింది. మారుతున్న కాలానికి అనుగుణంగా ఏఐ పోలీసింగ్‌ను అమలు చేసేందుకు ఏపీ పోలీసు శాఖ గతేడాదే నడుం బిగించింది. దేశవ్యాప్తంగా ఏఐ నిపుణుల్ని ఆహ్వానించి 2025 జూన్‌లో గుంటూరులో దేశంలోనే తొలి ఏఐ హ్యాకథాన్‌ను నిర్వహించింది. శాంతి భద్రతల పరిరక్షణ మొదలుకొని పోలీసులకు అవసరమైన పలు సేవల్ని ఏఐ ద్వారా అందించేందుకు అనేక మంది ముందుకొచ్చారు. వాటిలో ఏపీ పోలీసులకు అవసరమైన వాటిని ఎంపిక చేసుకుని ప్రాజెక్టు రూపంలోకి తీసుకొచ్చారు. అమెరికాకు చెందిన '4సైట్ ఏఐ' నాలెడ్జ్ సహకారం, 'స్పారిటీ' సంస్థ భాగస్వామ్యంతో 4 నెలలపాటు అభివృద్ధి చేసిన ఏఐ టూల్స్‌లో.. కీలకమైన 8 ఏఐ టూల్స్‌ను పోలీసు శాఖ ప్రవేశపెట్టింది. వాటిలో 'పిటిషన్ ఏఐ'.. ఉన్నతాధికారుల ఫిర్యాదుల సమయాన్ని గణనీయంగా తగ్గిస్తే.. 'డిజిటల్ ఎవిడెన్స్ ఏఐ' టెలికామ్, బ్యాంకులు, పేమెంట్ గేట్ వేల నుంచి ఆధారాల సేకరణను వేగవంతం చేస్తుంది. 'కాగ్నిటివ్ నెట్ ఏఐ' దర్యాప్తు అధికారులకు డేటా విశ్లేషణలో సహకరిస్తే.. 'ఇన్వెస్టిగేషన్ కో-పైలట్' చట్టపరమైన దిశానిర్దేశం చేస్తుంది. పాత రికార్డులను డిజిటల్ రూపంలోకి మార్చే 'డాక్స్2డేటా'.. సోషల్ మీడియా గూఢచారిగా పనిచేసే 'సోకింట్ ఏఐ', వార్తల పర్యవేక్షణకు 'న్యూస్ 360ఏఐ', మొత్తం వ్యవస్థకు పునాదిగా 'ఏఐ ఫౌండేషన్' పనిచేస్తాయి.

శిక్షల శాతం పెరుగుతుంది: డీజీపీ

'ఏఐ4ఏపీ పోలీస్' ప్రాజెక్టుతో దర్యాప్తులో వేగం పెరగడంతో పాటు ఆధారాల నాణ్యత మెరుగుపడి శిక్షల శాతం పెరుగుతుందని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా తెలిపారు. పోలీసు అధికారులు చేసే సాధారణ పనిని ఆటోమ్యాటిక్‌గా ఏఐ చేయడంతో.. ఆ సమయాన్ని వారు శాంతి భద్రతల పరిరక్షణకు ఉపయోగించవచ్చని చెప్పారు. భవిష్యత్తులో ప్రతి పోలీసుస్టేషన్‌లోనూ ఏఐ ఏజెంట్లను ప్రవేశపెట్టే యోచన కూడా ఉందన్నారు. 'ఏఐ4ఏపీ పోలీస్' త్వరలోనే రాష్ట్రమంతా అమల్లోకి రాబోతోందన్నారు. కార్యక్రమంలో ఐజీ సీహెచ్ శ్రీకాంత్, పలువురు ఐపీఎస్‌లు పాల్గొన్నారు.

హవ్వ.. నవ్విపోదురు గాక!

(మొదటి పేజీ తరువాయి)

జుగుప్స కలిగించేలా గత పదేళ్లుగా ఆయన వ్యాఖ్యలు చేస్తున్నారు. ముఖ్యంగా చంద్రబాబుపైనా, పవన్ కల్యాణ్‌పైనా పత్రికల్లో ప్రచురించలేని భాషలో బూతులు మాట్లాడారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో గతంలో ఏ రాజకీయ నాయకుడిపై రానన్ని అసభ్యకర, అవినీతి ఆరోపణలు అంబటి రాంబాబుపై వచ్చాయి. ఆయన ఒక మహిళతో నెరిపిన ఫోన్ సంభాషణ అప్పట్లోనే తీవ్ర దుమారం రేపింది. దాడులు చేయడం, బూతులు తిట్టడమే అర్హత అన్నట్లుగా అంబటి రాంబాబుకు జగన్ మంత్రి పదవి ఇచ్చారు. పవన్‌కల్యాణ్, చంద్రబాబు కుటుంబాలపై భయంకరంగా నోరు పారేసుకున్న అంబటిపై టీడీపీ క్యాడర్ ఎప్పటి నుంచో గుర్రుగా ఉంది. తాజాగా ఆయన బూతులు మరీ శ్రుతిమించడమే దాడులకు కారణమని టీడీపీ వర్గాలు పేర్కొంటున్నాయి. అయినప్పటికీ... ప్రభుత్వం ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించింది. ఎవరైనా చట్టానికి కట్టుబడి ఉండాల్సిందే అని సంకేతాలు పంపింది. ఎమ్మెల్యే దంపతులపైనా పోలీసులు కేసు నమోదు చేశారు.

మాపై కేసులు కొట్టివేయండి

- హైకోర్టులో రజని, కాకాణి పిటిషన్లు

అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కులాలు, మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశామంటూ పల్నాడు జిల్లా యడ్లపాడు పోలీసులు తమపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ మాజీ మంత్రి విడదల రజని, వైసీపీ నేతలు, కార్యకర్తలు 21 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అలాగే కల్తీ నెయ్యి వ్యవహారంలో విద్వేషాలు రెచ్చగొట్టేలా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యాఖ్యలు చేశానంటూ తనపై పొదలకూరు, నెల్లూరు దర్గామిట్ట పోలీసులు పెట్టిన కేసులను కొట్టివేయాలని కోరుతూ కాకాణి గోవర్ధన్‌రెడ్డి కూడా హైకోర్టును ఆశ్రయించారు.

అంబటిని కాపాడింది పోలీసులే

- జగన్ తెలుసుకోవాలి: పట్టాభి



కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి అంబటి రాంబాబును కాపాడింది పోలీసులే అన్న విషయాన్ని జగన్ తెలుసుకోవాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. బుధవారం కర్నూలులో ఆయన మాట్లాడారు. 'పోలీసులు అంబటిని కాపాడడం ప్రపంచమంతా చూసింది. అంబటి ఇంటిపై దాడికి పాల్పడిన వారిపై పార్టీలకతీతంగా మా అధినేత చర్యలకు ఆదేశించారు. వైసీపీ పాలనలో ఆ పార్టీ దాడులతో నా ఎనిమిదేళ్ల కుమార్తె ప్రాణభయంతో అల్లాడింది. రఘురామరాజు, బొండా ఉమ, బుద్దా వెంకన్నలపై దాడి చేసిన తురకా కిశోర్‌ను మున్సిపల్ చైర్మన్ చేసిన జగన్.. ఇప్పుడు నీతులు మాట్లాడుతున్నాడు. చంద్రబాబు నివాసంపై దాడికి దిగిన జోగి రమేశ్‌కు మంత్రి పదవి ఇచ్చింది ఆయన కాదా' అని ప్రశ్నించారు.

బడ్జెట్‌లో వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వండి

- ఆర్థిక మంత్రి కేశవ్‌ను కోరిన మంత్రి అచ్చెన్న

అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులకు వెన్నుదన్నుగా నిలిచేలా, వ్యవసాయ-అనుబంధ రంగాల అభివృద్ధిని మరింత ప్రోత్సహించేలా 2026-27 బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు జరపాలని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు కోరారు. ఈ నెల11 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో బడ్జెట్ కూర్పుపై బుధవారం ఆర్థిక మంత్రి కేశవ్‌తో అచ్చెన్నాయుడు భేటీ అయ్యారు.

అంతర్రాష్ట్ర బదిలీలకు చర్యలు: విద్యాశాఖ

అంతర్రాష్ట్ర బదిలీల్లో భాగంగా పాఠశాల విద్యాశాఖలో ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు వెళ్లాలనుకునే వారి వివరాలు అప్‌డేట్ చేయాలని సంబంధిత అధికారులను పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది. గతంలో బదిలీలకు ఆప్షన్లు తీసుకున్నప్పుడు 228 మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే, చాలాకాలం అయినందున వారిలో కొందరు రిటైరవడం, పదోన్నతి పొందడం, చనిపోవడం, మనసు మార్చుకోవడం తదితర వివరాలు సేకరించి తాజా డేటాను నమోదు చేయాలని ఆదేశించింది. కొత్త పేర్లు ఇప్పుడు జతచేయకూడదని స్పష్టం చేసింది.

ఏపీకి ఐటీ దిగ్గజాలు బారులు: టీడీపీ ఎంపీ హరీశ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): దేశాన్ని 2047 నాటికి వికసిత భారత్‌గా మార్చాలన్న లక్ష్యసాధనలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషిస్తోందని టీడీపీ ఎంపీ జీఎం హరీశ్ బాలయోగి అన్నారు. వికసిత భారత్ అనేది కేవలం ఒక నినాదం కాదని, నిరంతర జాతీయ మిషన్ అని, ఈ లక్ష్యసాధనలో ఎన్డీయే ప్రభుత్వంతో టీడీపీ కలిసి అడుగులు వేస్తోందని అన్నారు. బుధవారం లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఆయన మాట్లాడారు. ఏపీలో జరుగుతున్న అభివృద్ధిని సభ దృష్టికి తీసుకెళ్లారు. 2025-26లో దేశవ్యాప్తంగా జాతీయ పెట్టుబడి ప్రతిపాదనల్లో సుమారు 25 శాతం ఒక్క ఆంధ్రప్రదేశ్‌కు రావడం గర్వకారణమన్నారు.

రాష్ట్ర గౌరవాన్ని దెబ్బతీస్తున్న వైసీపీ: ఎంపీ బీద

రాష్ట్ర గౌరవాన్ని దెబ్బతీసేలా వైసీపీ ఎంపీలు గత రెండు రోజులుగా పార్లమెంటులో అసత్యాలు ప్రచారం చేస్తున్నారని రాజ్యసభలో టీడీపీ ఎంపీ బీద మస్తాన్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని విమర్శంచారు. ఇటువంటి అబద్ధాలను తెలుగు ప్రజలు నమ్మవద్దని కోరారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలపై దృష్టి కేంద్రీకరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై బుధవారం మస్తాన్‌రావు మాట్లాడారు.

ఏపీలో గద్దర్ విగ్రహం ఏర్పాటుకు అనుమతించండి

- సీఎం చంద్రబాబుకు గద్దర్ కుమార్తె వినతి

అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రజలు, గద్దర్ అభిమానుల కోరిక మేరకు ఏపీలో గద్దర్ విగ్రహం ప్రతిష్ఠకు అనుమతులు ఇవ్వాలని గద్దర్ కుమార్తె వెన్నెల సీఎం చంద్రబాబును కోరారు. ఆంధ్ర యూనివర్సిటీలో ఆర్ట్ అండ్ కల్చరల్ డిపార్ట్‌మెంట్‌కి గద్దర్ పేరు పెట్టాలని, ప్రజా జీవనంలో కలుస్తున్న మావోయిస్టులకు ఉపాధి కల్పించాల్సిందిగా సీఎంని కోరారు. సీఎంని చంద్రబాబుని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం ఇచ్చారు.

రాష్ట్రంలో హక్కుల ఉల్లంఘన

- ఎన్‌హెచ్‌ఆర్సీకి వైసీపీ ఫిర్యాదు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఏపీలో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతూ ఎన్‌హెచ్‌ఆర్సీకి వైసీపీ ఫిర్యాదు చేసింది. బుధవారం ఢిల్లీలోని ఎన్‌హెచ్‌ఆర్సీ చైర్మన్ జస్టిస్ రామసుబ్రమణియన్‌ను వైసీపీ బృందం కలిసింది. అంబటి రాంబాబుపై దాడి, మంద సాల్మన్ హత్యలపై విచారణ జరపాలని వినతిపత్రం సమర్పించింది. ఆ తర్వాత జాతీయ ఎస్సీ కమిషన్‌ను కలిసిన వైసీపీ నేతలు రాష్ట్రంలో పరిస్థితిని వివరించారు. "ఆటవిక పాలన నేపథ్యంలో రాష్ట్రపతి పాలన విధించాలని కేంద్రాన్ని కోరుతున్నాం. ఇదే విషయమై ఎన్‌హెచ్‌ఆర్సీకి వినతిపత్రం సమర్పించాం. ఆయన డీజీపీ ద్వారా నివేదిక తెప్పించుకుంటామని తెలిపారు." అని వైసీపీ నేత జూపూడి ప్రభాకర్ మీడియాకు వివరించారు.

అధికారంలో ఉంటే రెడ్లు.. లేకపోతే కాపులు కావాలి!

- జగన్ ఉచ్చులో పడి కాపులు మోసపోవద్దు
- ముద్రగడ కుమార్తె క్రాంతి వినతి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్‌కు అధికారంలో ఉంటే రెడ్లు, అధికారంలో లేకపోతే కాపులు కావాలని వైసీపీ నేత ముద్రగడ పద్మనాభం కుమార్తె బార్లపూడి క్రాంతి వ్యాఖ్యానించారు. "అంబటి రాంబాబుని వాడుకుని ఏవిధంగా అల్లర్లు చేయాలని చూస్తున్నారో, రేపు మా నాన్న(పద్మనాభం)ను కూడా వాడుకుని బలిపశువుని చేయరన్న గ్యారెంటీ ఉందా?. జగన్ ఉచ్చులో పడి కాపులు మరోసారి మోసపోవద్దు. శ్రీవారి లడ్డూ నెయ్యి కల్తీ జరిగిందని సీబీఐ చార్జిషీటులో పేర్కొన్నా.. క్లీన్ చిట్ ఇచ్చేసిందన్న రీతిలో వైసీపీ వాళ్లు హడావుడి చేస్తున్నారు. 60 లక్షల కిలోల నెయ్యి భయంకరమైన రసాయనాలతో తయారైందని చార్జిషీట్‌లో తేల్చారు. విషయాన్ని దారి మళ్లించడం కోసమే అంబటి, జోగి రమేశ్‌తో సీఎంను దూర్భాషలాడించి రాజకీయ ప్రయోజనం పొందాలని జగన్ చూస్తున్నారు." అని విమర్శించారు. నెయ్యి కల్తీ జరిగిందని సీబీఐ చార్జిషీటులో పేర్కొన్నా.. అసలేమీ జరగలేదని మా నాన్న ఎలా అనగలుగుతున్నారో అర్థం కావడం లేదన్నారు.

నకిలీ మద్యం కేసులో మరో ముగ్గురికి బెయిల్

- జైలు నుంచి అద్దేపల్లి సోదరుల విడుదల.. నేడు మరికొందరు
- రోణక్, అనిల్‌చోక్రా పిటిషన్లు కొట్టివేత

ములకలచెరువు/విజయవాడ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు నకిలీ మద్యం కేసులో అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె కోర్టు బుధవారం మరో ముగ్గురికి బెయిల్ మంజూరు చేసింది. నకిలీ మద్యం తయారీ కేంద్రానికి ఇన్‌చార్జిగా వ్యవహరించిన కట్టా రాజు(ఏ2)తో పాటు బాలరాజు(ఏ4), పెద్దతిప్పసముద్రం మండలం కమ్మవారిపల్లెకు చెందిన కట్టా సురేంద్రనాయుడు(ఏ13)లకు తాజాగా బెయిల్ లభించింది. ఇదివరకే బెయిల్ మంజూరైన అద్దేపల్లి జనార్దనరావు, జగన్‌మోహన్‌రావు కోర్టుకు ష్యూరిటీలు సమర్పించి బుధవారం రాత్రి మదనపల్లె సబ్‌జైలు నుంచి విడుదలయ్యారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న జినేష్, షిబు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై తీర్పును విజయవాడ ఆరో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి లెనిన్‌బాబు తీర్పును 11వ తేదీకి రిజర్వ్ చేశారు. కాగా, మద్యం కుంభకోణం కేసులో ముంబైకి చెందిన అనిల్‌చోక్రా, రోణక్‌కుమార్ వేసిన బెయిల్ పిటిషన్లను విజయవాడ ఏసీబీ కోర్టు కొట్టివేసింది.

'కల్తీ నెయ్యి'లో వెలంపల్లి పాత్ర!

- ఏసీబీకి జనసేన ఫిర్యాదు

విజయవాడ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా చేయడంలో వైసీపీ నేత వెలంపల్లి శ్రీనివాసరావు పాత్ర ఉందని జనసేన సెంట్రల్ ఆంధ్రా జోన్ కన్వీనర్ బాడిత శంకర్ బుధవారం ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. వైసీపీ ప్రభుత్వంలో దేవదాయ మంత్రిగా ఉన్నప్పుడు ఆయన కోటాలో వస్త్రం, అభిషేకం, తోమాల, సుప్రభాత సేవలను సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. ఆయనకు భోలేబాబాతో సంబంధాలు ఉన్నాయని.. శ్రీవాణి టికెట్లను అధిక ధరలకు విక్రయించారని తెలిపారు. దుర్గగుడి ఈవోగా సురేశ్‌బాబు ఉన్న సమయంలో అమ్మవారి సొమ్ము రూ.100 కోట్లను వివిధ మార్గాల్లో వెలంపల్లికి చేరేలా అక్రమాలు చేశారని పేర్కొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 ,
RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.